
ముసలోడూ సముద్రమూ

ఇంగ్లీష్ : ఎర్నెస్ట్ హెమింగ్వే
తెలుగు : పృథ్వీరాజు, రమేష్ బాబు





ముసలోడూ సముద్రమూ

ఇది నవలిక. రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే. ఆయన దీనిని 1952లో రాశాడు. దీనికి 1953లో పులిట్జర్ బహుమతి లభించింది. 1954లో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ చిరు పుస్తకం హెమింగ్వే ఖ్యాతిని పదింతలు పెంచింది. ఈ పుస్తకంలో ప్రధాన పాత్ర పేరు శాంటియాగో. అతనొక ముసలి జాలరి. అతనికి ఎనభై నాలుగురోజులపాటు ఒక్క చేప కూడా పడదు. ఎనభై ఐదవరోజున వేటకు వెళ్తాడు. సముద్రంలోనే మూడురోజులు రాత్రింబగళ్లు ఉండిపోతాడు. పోరాటం ఈ కథకు మారుపేరు. మనుగడకోసం పోరాటం. సముద్రంతో పోరాటం. తను వేటాడిని పెద్దచేపతో పోరాటం. చేపను తినేయటానికి వచ్చిన షార్కులతో పోరాటం. తన వృధ్యాప్యంతో పోరాటం. తన నిద్రతో, ఆకలితో పోరాటం. కొంకర్లు పోతున్న తన అవయవాల అశక్తతతో పోరాటం. ఓపిక నశించినా, ప్రాణం కడగట్టినా, ఊపిరిపోతున్నా ఆగని పోరాటం.



PEACOCK CLASSICS

ముసలోడూ సముద్రమూ

మూలం

ఎర్నెస్ట్ హెమింగ్వే

తెలుగు

పృథ్వీరాజ్ ● దాసరి రమేష్‌బాబు



పీకాక్ క్లాసిక్స్ ● హైదరాబాద్



రచయిత గురించి..

ఎర్నెస్ట్ హెమింగ్వే 1899లో ఇలినాయిస్ (అమెరికా)లోని **ఓక్ పార్క్‌**లో జన్మించాడు. 1917లో రచనా వ్యాసంగం మొదలుపెట్టాడు. మొదటి ప్రపంచ యుద్ధంలో పని చేశాడు. అక్కడ తీవ్రంగా గాయపడ్డాడు. 1921లో పారిస్ వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. ఇంతకు ముందే అమెరికా నుంచి పారిస్‌కు వలస వచ్చిన గెర్ట్రూడ్ స్టెయిన్, ఎఫ్ స్కాట్ ఫిట్జరాల్డ్, ఎజ్రా పౌండ్ ఫోర్డ్ మెడాక్స్ ఫోర్డ్ ఉన్నారు. అతని మొదటి పుస్తకం ***త్రీ స్టోరీస్ అండ్ టెన్ పోయెంస్*** 1923లో పారిస్‌లో విడుదలైంది. దాని తర్వాత ***ఇన్ అవర్ టైం*** అనే కథానికల సంకలనం వచ్చింది. 1926లో వెలువడిన ***ద సన్ ఆల్సో రైజెస్*** అతనికి యూరపు అమెరికాల్లో గుర్తింపు తెచ్చిపెట్టింది. 1927లో ***మెన్ విదౌట్ విమెన్,*** 1929లో ***ఎ ఫేర్వెల్ టు ఆంస్*** వచ్చాయి. ఈ కాలంలోనే హెమింగ్వే అమెరికాకు తిరిగొచ్చాడు. తర్వాత క్యూబాలో స్థిరపడ్డాడు. ఈ సమయంలో అతను స్పెయిన్, ఫ్లోరిడా, ఇటలీ మరియు ఆఫ్రికాలోని పలు దేశాలలో విస్తృతంగా పర్యటించాడు.

1932లో ***డెత్ ఇన్ ది ఆఫ్టర్ నూన్,*** 1935లో ***గ్రీన్ హిల్స్ ఆఫ్ ఆఫ్రికా,*** 1939లో ***ఫర్ హూం ద బెల్ టోల్స్*** వెలువడ్డాయి. ***ది ఓల్డ్ మేన్ అండ్ ది సీ*** **(ముసలోడూ సముద్రమూ)** పుస్తకానికి 1953లో పులిట్జర్ బహుమతి లభించింది. ఈ రచనకే 1954లో సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. విషాదం ఏమంటే, 1961లో ఆత్మహత్య చేసుకున్నాడాయన. ***ది టారెంట్స్ ఆఫ్ స్ప్రింగ్*** (1926), ***విన్నర్ టేక్ నథింగ్*** (1933), ***టు హేవ్ అండ్ హేవ్ నాట్*** (1937), ***ది ఫిఫ్త్ కాలం అండ్ ది ఫస్ట్ ఫార్టీ నైన్ స్టోరీస్*** (1938), ***అక్రాస్ ది రివర్ అండ్ ఇంటూ ద ట్రీస్*** (1950) అతని ఇతర రచనలు. ***ఎ మూవబుల్ ఫీస్ట్*** (1964), ***ఐలండ్స్ ఇన్ ద స్ట్రీం*** (1970), ***ది డేంజరస్ సమ్మర్*** (1985), ***ది గార్డెన్ ఆఫ్ ఈడెన్*** (1986) అతని మరణానంతరం వెలువడిన రచనలు.

ముసలోడూ సముద్రమూ

అతనొక ముసలోడు. ఒంటరిగా చిన్న పడవలో అట్లాంటిక్ సముద్రంలో చేపల వేటకు వెళ్తుంటాడు. ఇప్పటికి ఎనభై నాలుగు రోజులుగా అతనికి ఒక్క చేప కూడా దొరకలేదు. మొదటి నలభై రోజులూ చేపల వేటలో అతనికి తోడుగా ఒక పిల్లోడు ఉన్నాడు. కానీ నలభై రోజులు గడిచినా ఒక్క చేప కూడా పడకపోవటంతో ఈ ముసలోడు పెద్ద నష్టజాతకుడని వాడితో వెళ్లొద్దని పిల్లోడికి వాళ్ల అమ్మానాన్నా చెప్పారు. ఆ ముసలోడ్ని వదిలేసి వేరేవాళ్ల పడవలో చేపల వేటకు వెళ్లమన్నారు. దాంతో వాడు ముసలోడ్ని వదిలేసి మరో పడవలో చేపల వేటకు వెళ్లక తప్పిందికాదు. అలా వెళ్లిన మొదటి వారంలోనే ఆ పడవ వాళ్లకు మూడు పెద్ద చేపలు దొరికాయి. ముసలోడు రోజూ ఒక్క చేప కూడా దొరక్క ఖాళీ పడవతో తిరిగి రావటం చూసి పిల్లోడు చాలా బాధపడేవాడు. ఖాళీగా తిరిగొచ్చే ముసలోడి పడవ దగ్గరకు వెళ్లి లంగరు తాడో తెరచాపో తెరచాప కర్రో గాలం కర్రో ఏదో ఒకటి పైకి తెస్తూ సాయం చేసేవాడు. ఆ ముసలోడి తెరచాప చినిగిపోయి, గోతం పట్టాల మాసికలతో, నలిగిపోయి ఓడిపోయినోడి జెండాలా ఉంది.

ముసలోడు చాలా బక్కచిక్కి ఉన్నాడు. చాలా నీరసంగా కనపడుతున్నాడు. అతడి మెడ మీద చర్మం ముడతలు పడి, ముఖం ఎండిపోయి పీక్కుపోయింది. పగలంతా సముద్రం మీద ఉండిపోవటంతో ఎండ దెబ్బకి అతడి ముఖం మీద రెండు వైపులా మంగు మచ్చలు అల్లుకుపోయి ఉన్నాయి. బరువైన చేపల వలల తాళ్లు లాగిలాగి అతడి అరిచేతులు గాట్లు పడి కాయలు కాశాయి. చర్మం సాగిపోయింది. ఆ గాట్లూ కాయలూ ఇప్పుడు కొత్తగా అయినవి కాదు. నీళ్లన్నీ ఇంకిపోయి ఎడారులుగా మారిన ఒకప్పటి సముద్రాల వయసుంది ఆ మచ్చలకి. కానీ అతడి కళ్లు మాత్రం సముద్రంలా నీలం రంగులో అసలు అపజయమనేది ఎరుగని ఆనందంతో మెరుస్తూ ఉంటాయి.

"శాంటియాగో" పడవను నీళ్లలో నుంచి బయటకు లాగి ఒడ్డెక్కిన తర్వాత ఆ ముసలోడితో అన్నాడు పిల్లోడు "నేను మళ్లీ నీతో వచ్చేవాడ్నే. మనం మంచి చేపలు పట్టి కొంత డబ్బు సంపాదించేవాళ్లం."

ఈ పిల్లోడికి చేపలు పట్టటం నేర్పింది ఆ ముసలోడే. అందుకే అతనంటే వాడికి చాలా ఇష్టం.

"వద్దు. నువ్విప్పుడున్న పడవకు అదృష్టం కలిసొస్తోంది. వాళ్లతోనే ఉండు" అని చెప్పాడు ముసలోడు.

"నీకు గుర్తుందా... ఎనభై ఏడు రోజుల పాటు నీకు ఒక్క చేప కూడా దొరక్కపోయినా ఆ తర్వాత మనం మూడు వారాల పాటు రోజూ చాలా పెద్ద పెద్ద చేపలు పట్టాం."

"నాకు గుర్తుంది" ముసలోడు చెప్పాడు. "నువ్వు వేరే పడవలో వెళ్లింది నామీద నమ్మకంలేక కాదని నాకు తెలుసు."

"నేను నిన్ను వదిలి వేరే పడవలో వెళ్లేలా చేసింది మా నాన్న. నేను చిన్న పిల్లోడ్ని కదా... ఆయన మాట వినాల్సిందే."

"నాకు తెలుసు. అది మామూలు విషయమే" అన్నాడు ముసలోడు.

"మా నాన్నకు నీమీద అంత నమ్మకం లేదు."

"కానీ మనిద్దరికీ నమ్మకం ఉంది కదా" అన్నాడు ముసలోడు.

"అవును" పిల్లోడు చెప్పాడు. "మెరక ఎక్కాక నేను నీకు బీరు ఇవ్వనా? అది తాగేసి సామాను తీసుకుని ఇంటికెళదాం."

"అలాగే. మనమిద్దరం జాలర్లం. కలిసి బీరు తాగొచ్చు" అన్నాడు ముసలోడు.

అలా వాళ్లిద్దరూ ఇసుక తిన్నె పైకెక్కి చతికలపడ్డారు. అటుగా వచ్చి పోయే జాలరుల్లో చాలా మంది ముసలోడితో పరాచికాలాడారు. ముసలోడు వాళ్లమీద కోప్పడలేదు. వాళ్లలో కొంతమంది ముసలి జాలర్లు ఈ ముసలోడ్ని చూసి బాధపడ్డారు. కానీ ఆ మాట చెప్పకుండా ఆ రోజు సముద్రం ఎలా ఉందో వేటకు వెళ్లినప్పుడు తమ గాలాలు ఎంతెంత లోతుకు పోయాయో గాలి కదలకుండా ఎలా ఉందో ఇంకా తామేం చూశామో అనే విషయాల గురించి అతడితో మర్యాదగా మాట్లాడారు.

ఆ రోజు మంచి చేపలు పట్టినవాళ్లు ఇళ్లకు వచ్చేశారు. వంజరాలు పట్టిన వాళ్లు వాటిని ముక్కలుగా కోసి రెండు చెక్కబల్లల మీద వేశారు. ఆ బల్లలను ఇద్దరు జాలర్లు చెరో వైపు పట్టుకుని మోసుకుంటూ గిడ్డంగి దగ్గరికి చేర్చారు. అక్కడ్నించి వీటిని హవానాలో చేపల మార్కెట్‌కి తీసుకెళ్లే ఐస్ ట్రక్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు. సొరచేపలను పట్టిన వాళ్లు వాటిని గుట్టకు అటుపక్కగా ఉన్న సందులోని సొరచేపల కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ దూలాలకు ఉన్న తాళ్లకు సొరచేపలను వేళ్లాడదీశారు. వాటిని కోసి కాలేయాన్ని తీసేశారు. రెక్కలు కత్తిరించి తోలు వలిచారు. మాంసాన్ని ఉప్పుపెట్టటం కోసం ముక్కలుగా కోశారు.

గాలి తూర్పుకు వీస్తున్నపుడు ఓడరేవు ఆవలివేపునున్న సొరచేపల కేంద్రం నుంచి వస్తున్న వాసన ముక్కుపుటాలను గుప్పున తాకుతుంటుంది. కానీ ఈ రోజు గాలి ఉత్తరానికి తిరిగి కిందకు వెళ్లాక తగ్గిపోవటం వల్ల ఆ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వాసన అంతంత మాత్రంగానే ఉంది. ఆ సాయంకాలపు వెలుతురులో ఇసుక తిన్నెల దగ్గర

వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.

"శాంటియాగో" పిలిచాడు పిల్లోడు.

"ఊ" చేతిలో గ్లాసు పట్టుకుని కొన్నేళ్ల కిందటి సంఘటనలను గురించి ఆలోచిస్తూ ఉన్న ముసలోడు ఈ లోకంలోకి వచ్చాడు.

"నేను బయటకెళ్లి నీకోసం కవడ చేపలు తీసుకురానా?"

"వద్దు. నువ్వెళ్లి బేస్‌బాల్ ఆడుకో. నేను పడవ నడపగలను. వల విసరటానికి రొగెలియో ఉన్నాడు."

"నేను కవడ చేపలు తెస్తా. నీతోపాటు వేటకి రాలేనప్పుడు ఏదో ఒక సాయం చేయనీ."

"బీరు సీసా కొనిచ్చావు కదా. ఇప్పటికే నాకు సాయం చేసి పెద్దోడివి ఐపోయావు."

"నువ్వు నన్ను మొదటిసారి పడవలో వేటకి తీసుకెళ్లినప్పుడు నాకెన్నేళ్లు?"

"ఐదేళ్లు. చాలా చిన్నోడివి. అప్పుడు నేనో పెద్ద చేప పట్టి పడవలోకి లాగుతోంటే అది పడవను విరగ్గొట్టినంత పనిచేసింది. అప్పుడు నువ్వు చచ్చిపోయేవాడివే. గుర్తుందా?"

"అవునవును. గుర్తుంది. అది తోకతో కొట్టటం పడవను బాదటం అడ్డదూలాన్ని విరగ్గొట్టటం కర్రతో ఠపీ ఠపీమని బాదిన శబ్దం అన్నీ గుర్తున్నాయి. నువ్వు నన్ను లంగరు తాళ్ల చుట్ట మీదకి విసిరేయటం పడవంతా ఊగిపోవటం నువ్వు ఆ చేపను పట్టుకుని కొడుతున్నపుడు చెట్టును నరికినట్టు వచ్చిన మోత నా ఒంటిమీదంతా చేప రక్తం పడటం దాని తీయటి వాసన అంతా గుర్తుంది."

"నీకు నిజంగా ఇదంతా గుర్తుందా? లేకపోతే నువ్వు పెద్దయ్యాక ఎప్పుడైనా నేనే చెప్పానా?"

"మనం మొట్టమొదటిసారి కలిసి చేపల వేటకు వెళ్లినప్పటి నుంచీ అంతా నాకు గుర్తుంది."

ముసలోడు ప్రేమ నిండిన తన నీలి కళ్లతో పిల్లోడ్ని చూశాడు.

"నువ్వే కనక నా కొడుకువైతే నిన్ను వెంట తీసుకెళ్లి పందెంలో పెట్టేవాడిని" అన్నాడతను. "నా దురదృష్టం. నువ్వు మీ అమ్మానాన్నల కొడుకువి. అదీగాక ఇప్పుడు నువ్వు అదృష్టం కలిసివస్తున్న పడవలో ఉన్నావు."

"నేను కవడ చేపలు తేనా? నాలుగు ఎరలు కూడా తెస్తా. అవెక్కడున్నాయో కూడా నాకు తెలుసు."

"ఈ రోజు మిగిలిపోయిన ఎర ఉందిలే. దాన్ని ఉప్పు డబ్బాలో పెట్టా."

"ఇంకో నాలుగు కొత్త ఎరలు తెస్తా."

"ఒక్కటి చాలు" ముసలోడు చెప్పాడు. అతనెప్పుడూ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. నిరాశపడలేదు. ఇప్పుడు చల్లని గాలి తాకినప్పుడల్లా అతడిలో ఉత్సాహం రెట్టింపవుతోంది.

"రెండు తెస్తా" అన్నాడు పిల్లోడు.

"సరే. రెండు" ఒప్పుకున్నాడు ముసలోడు. "వీటిని నువ్వు ఎక్కడో కొట్టేయలేదు కదా?"

"కొట్టేయాల్సింది" కన్ను కొడుతూ అన్నాడు పిల్లోడు. "కానీ కొన్నాలే."

"మంచోడివి" ముసలోడు నవ్వుతూ అన్నాడు. ఆ పిల్లోడిలో ఇంత వినయం ఎప్పుడు ఎలా పుట్టుకొచ్చిందని ముసలోడు ఆశ్చర్యపోయాడు. పిల్లోడిలో ఈ మార్పు మంచిదే. దీనివల్ల వాడికి జరిగే నష్టం కానీ అవమానం కానీ ఏంలేదు. వినయం మనిషికి ఆభరణమే. నిజమైన ఆత్మాభిమానానికి ఈ గుణం మరింత అందాన్నిస్తుంది.

"సముద్రంలో పోటు ఇలాగే ఉంటే రేపు బ్రహ్మాండంగా ఉంటుంది" ముసలోడు అన్నాడు.

"నువ్వు ఎక్కడికెళతావు?" పిల్లోడు అడిగాడు.

"చాలా దూరం. ప్రవాహం లోపలికి వెళ్లాలి. గాలి దారి మారేసరికల్లా నేను అక్కడుండాలి. తెల్లారకముందే బయల్దేరాలి."

"మా బోటు వాళ్లని కూడా ఆ ప్రవాహంలోకి వేటకు వెళ్దామని అడుగుతా" పిల్లోడు చెప్పాడు. "నీకు పెద్ద చేప చిక్కితే.. మేం దగ్గరే ఉంటాం కదా. దాన్ని పట్టటానికి నీకు సాయం చేయొచ్చు".

"అంత దూరం వేటకు రావటం మీ పడవోడికి ఇష్టముండదు."

"లేదు" పిల్లోడు అన్నాడు. "వాడికి చూపు ఆనదు. పిట్టలొచ్చి వాలినా వాడికి కనిపించదు. డాల్ఫిన్ లాంటి పెద్ద చేపలు మాత్రమే కనిపిస్తాయి."

"వాడి కళ్లు మరీ అంత పాడైపోయాయా?"

"దాదాపు గుడ్డోడైపోయాడు."

"అలాగెలాగైంది?" ముసలోడు ఆశ్చర్యపోతూ అన్నాడు. "వాడెప్పుడూ తాబేళ్లు పట్టటానికి వెళ్లలేదే. తాబేళ్ల వేటకు వెళ్తే కళ్లు దెబ్బతింటాయి."

"మరి నువ్వు ఏళ్ల తరబడి దోమల తీరంలో తాబేళ్లు పట్టావు కదా. నీ కళ్లు బాగానే ఉన్నాయే!"

"నేనో వింత ముసలోడ్ని. అందుకే నా కళ్లు పోలేదు."

"అయితే ఇప్పుడు పెద్ద పెద్ద చేపలు పట్టేంత బలం నీకుందా?"

"ఉంది. నాకు చాలా కిటుకులు తెలుసు."

"సరే ముందు ఈ సామాన్లు ఇంటికి తీసుకుపోదాం" అన్నాడు పిల్లోడు. "విసరు వల తీసుకుని నేను కవడ చేపల కోసం వెళ్లాలి."

వాళ్లు పడవలో నుంచి తెడ్డు తీసుకున్నారు. ముసలోడు తెరచాప కర్రని, గాలం కర్రని, పోలుకర్రని పట్టుకున్నాడు. పెద్ద చేపలను పట్టి పడవలోకి తెచ్చినప్పుడు అవి కదలకుండా కొట్టటానికి వాడే దుడ్డుకర్ర, ఎరల డబ్బా పడవ కింద వెనుక పక్క ఉన్నాయి. తెరచాపని, పద్దె మోకులను పడవలోనే ఉంచినా ఎవరూ కొట్టేయరు కానీ మంచుకు తడిసి పాడవ్వొచ్చు. వీటితో పాటు చాపకర్ర, గాలం కర్రలను కూడా పట్టుకుని బయల్దేరారు.

అలా ఇద్దరూ నడుచుకుంటూ ముసలోడి గుడిసె దగ్గరకెళ్లారు. గుడిసె తలుపు తెరిచే ఉంది. అలాగే లోపలికెళ్లారు. తెరచాప చుట్టిన కర్రను ముసలోడు ఒక గోడవారగా అనించాడు. పిల్లోడు మోసుకొచ్చిన సామాన్లను దాని పక్కనే పెట్టాడు. తెరచాప కర్ర గుడిసె పొడవుకు సరిపోయింది.

ఆ గుడిసెను గువానో అనే గట్టి ఓకు చెట్టు ఆకులతో కట్టారు. గుడిసెలో ఒక మంచం ఉంది. ఒక బల్ల, దానిపక్కన ఒక కుర్చీ కూడా ఉంది. మట్టితో అలికిన నేల మీద ఒక మూలగా బొగ్గు పొయ్యి ఉంది. గుడిసె గోడలు ఓకు ఆకులతో కట్టారు. ఆకులను చదును చేసి దడిగా కట్టి వాటిపై మట్టితో అలికారు. ఆ గోడ మీద యేసుక్రీస్తు పవిత్ర హృదయం బొమ్మ, మేరీమాత బొమ్మ రంగుతో వేసి ఉన్నాయి. ఇవి ఆ ముసలోడి భార్య తాలూకు గుర్తులు. ఇంతకుముందు గోడమీద అతడి భార్య కలర్ ఫొటో వేలాడుతూ ఉండేది. ఆ ఫొటోను చూసినప్పుడల్లా ముసలోడికి ఒంటరితనం ఎక్కువైనట్లు అనిపించేది. అందుకే దాన్ని తీసి తనకున్న మంచి చొక్కాలో చుట్టి ఒక మూల అరలో భద్రంగా దాచిపెట్టాడు.

"తింటానికి ఏముంది?" ఇంట్లో అటూ ఇటూ చూస్తూ అన్నాడు పిల్లోడు.

"కుండ నిండా పులిహోర ఉంది. చేపలు కూడా ఉన్నాయి. తింటావా?"

"వద్దు. నేను ఇంటికెళ్లి తింటా. పొయ్యి వెలిగించమంటావా?"

"వద్దు. నేను తర్వాత వెలిగించుకుంటా. లేకపోతే చల్లన్నమే తినేస్తా."

"సరే. నేను విసరు వల తీసుకెళ్లనా?"

"తీసుకెళ్లు."

అసలు ముసలోడి దగ్గర విసరు వలే లేదు. వాడు దాన్ని ఎప్పుడో అమ్మేశాడు. ఎప్పుడు అమ్మేశాడో పిల్లోడికీ తెలుసు. ఇంట్లో పులిహోర లేదని, చేపలు కూడా లేవనీ తెలుసు. కానీ వాళ్లు రోజూ ఇలాగే లేనిది ఉన్నట్టు మాట్లాడుకుంటారు.

"ఎనభై ఐదో నంబరు చాలా అదృష్టవంతమైన నంబరు" అన్నాడు ముసలోడు. "ఈసారి టన్ను బరువున్న చేపను పట్టుకొస్తా. చూస్తావా?"

"నేను విసరు వల తీసుకుని కవడ చేపల కోసం వెళతా. నువ్వు వాకిట్లో ఎండలో కూర్చుంటావా?"

"సరే. నా దగ్గర నిన్నటి పేపరుంది. దాంట్లో బేస్‌బాల్ గురించి చదువుతూ కూర్చుంటా."

ముసలోడి దగ్గర నిన్నటి పేపరు నిజంగా ఉందా లేకపోతే ఇది కూడా ఉత్తిమాటేనా అన్నది పిల్లోడికి తెలీదు. ముసలోడు మంచం కింద నుంచి పేపరు బయటకి తీశాడు.

"ఆ కొట్టు దగ్గర పెరికో ఇచ్చాడిది" చెప్పాడు ముసలోడు.

"నేను వెళ్లి కవడ చేపలు దొరికాక వస్తా. ఇద్దరివీ కలిపి ఐసులో పెట్టి ఉంచుతా. మనం పొద్దున్నే వాటిని పంచుకోవచ్చు. నేను తిరిగొచ్చాక నువ్వు బేస్‌బాల్ గురించి చెప్పు."

"అమెరికా వాళ్లు ఓడిపోరంటే ఓడిపోరు."

"ఆ క్లీవ్‌లాండ్ వాళ్ల గురించే నా భయమంతా."

"అమెరికా వాళ్లలో డిమాగియో మొనగాడు. ఒక్కసారి గుర్తుచేసుకో."

"డెట్రాయిట్ పులులు, క్లీవ్‌లాండ్ ఇండియన్లతోనే భయం."

"అలాగైతే సిన్సనాటి రెడ్స్‌ని, షికాగో వైట్ సాక్స్‌ని చూసి కూడా భయపడాల్సొచ్చిద్ది."

"నువ్వు చదివి నేను మళ్లీ వచ్చాక చెప్పు." అన్నాడు పిల్లోడు.

"రేపు ఎనభై ఐదో రోజు. ఎనభై ఐదో నంబరున్న లాటరీ టికెట్ కొందామంటావా?"

"కొనొచ్చు. కానీ నీకు పెద్ద రికార్డు ఎనభై ఏడు కదా? దాని సంగతి ఏమంటావ్?"

"అలా రెండుసార్లు జరగదు. ఎనభై ఐదో నంబరున్న లాటరీ టికెట్ ఎక్కడైనా దొరికిద్దేమో చూస్తావా?" అడిగాడు ముసలోడు.

"ఒకటి కొనొచ్చు."

"ఒక టికెట్. అంటే రెండున్నర డాలర్లు. అంత డబ్బు మనకెవరు అప్పిస్తారు?"

"చాలా తేలిక. నాకు రెండున్నర డాలర్ల అప్పు ఎప్పుడైనా దొరుకిద్ది."

"నాకు కూడా అప్పు దొరికిద్ది. కానీ అప్పు తీసుకోకూడదు. ఒకసారి అప్పు చేశామంటే ఆ తర్వాత అడుక్కోవాల్సి వస్తుంది."

"చలేస్తోంది. ఏదైనా కప్పుకో ముసలోడా" పిల్లోడు చెప్పాడు. "ఇది సెప్టెంబర్ నెల. తెలుసా?"

"అవును ఈ నెలలోనే పెద్దపెద్ద చేపలు వచ్చేది" ముసలోడు అన్నాడు. "మే నెలలో

ఎంత పనికిమాలిన వాడైనా చేపలు పట్టగలడు."

"సరే. ఐతే ఇక నేను కవడ చేపల కోసం వెళతా" అంటూ పిల్లోడు లేచాడు.

పిల్లోడు వచ్చేసరికి ముసలోడు కుర్చీలో నిద్రపోతూ ఉన్నాడు. చీకటిపడింది. మంచం మీద ఒక పాత దుప్పటి ఉంది. సైన్యంలో పనిచేసే వాళ్లకు ఇచ్చే దుప్పటి అది. దాన్ని తీసుకుని కుర్చీ వెనుకగా ముసలోడి భుజాల చుట్టూ కప్పాడు పిల్లోడు. ముసలోడి భుజాలు చాలా చిత్రంగా ఉన్నాయి. ముసలితనం వచ్చినా భుజాలు ఇంకా బలంగానే ఉన్నాయి. మెడ కూడా చాలా బలంగా ఉంది. ముసలోడు నిద్రలో ఉండి తల ముందుకు వాల్చటం వల్ల మెడ మీది ముడతలు కూడా కనిపించట్లేదు. ముసలోడి తెరచాపకు మల్లే అతడి చొక్కాకు కూడా చాలా మాసికలు ఉన్నాయి. ఎండలో మాడటం మూలంగా ఆ మాసికలు కూడా వెలిసిపోయి ఒక్కోటి ఒక్కో రంగులో కనపడుతోంది. ముసలోడి తల ముసలితనాన్ని పట్టిచూపుతోంది. కళ్లు మూసుకుని ఉండటంతో ముఖంలో జీవకళ మాయమైనట్లుంది. పేపరు చదువుతూ నిద్రలోకి జారుకున్నాడేమో అది అతడి మోకాళ్ల మీద పరచినట్లుగా ఉంది. ఆ సాయంకాలం గాలికి అది లేచిపోకుండా అతడి చెయ్యి ఆ పత్రికపై పెట్టి ఉంది. ముసలోడి కాళ్లకు చెప్పులు లేవు.

పిల్లోడు చేపల కోసం బయలుదేరిన వెంటనే ఇతడు నిద్రలోకి ఒరిగి ఉంటాడు. అప్పటి నుంచి నిద్రపోతూనే ఉన్నాడు.

"ముసలోడా లే" అతడి మోకాలు మీద తట్టి లేపాడు పిల్లోడు.

ఆ పిలుపుకు ముసలోడు కళ్లు తెరిచాడు. ఒక్క క్షణం వేరే ఏదో లోకం నుంచి తిరిగివస్తున్నట్లు అనిపించిందతడికి. ఈ లోకంలోకి వచ్చాక పిల్లోడ్ని చూసి నవ్వాడు.

"ఏం తెచ్చావు?" అనడిగాడు.

"అన్నం" పిల్లోడు చెప్పాడు. "మనిద్దరం కలిసి తిందాం".

"నాకు పెద్ద ఆకలిగా లేదు."

"వచ్చి తిను. లేకపోతే చేపలు పట్టలేవు. తినలేవు."

"నాకేం కొత్తకాదు" లేచి పేపరు మడత పెడుతూ అన్నాడు ముసలోడు. తర్వాత తన భుజాల చుట్టూ కప్పివున్న దుప్పటిని తీసి మడతపెట్టటం మొదలుపెట్టాడు.

"ఆ దుప్పటిని తీయొద్దు. అలాగే కప్పుకో" పిల్లోడు అతన్ని వారిస్తూ అన్నాడు. "నేను బతికుండగా నువ్వు కడుపు మాడ్చుకుని చేపలు పట్టాల్సిన ఖర్మ లేదు."

"అయితే నువ్వు కలకాలం మంచిగా బతుకు" నవ్వుతూ అన్నాడు ముసలోడు. "ఏం తెచ్చావ్?"

"నల్ల చిక్కుళ్లు, అరటికాయ వేపుడు, సూపు."

గొప్ప మేనేజర్ ఇంకెవడూ లేడంటాడు."

"వాడెప్పుడూ ఇక్కడికి వస్తూ పోతూ ఉండేవాడు కదా. అందుకని మీ అయ్య అలా అనుకునుంటాడు" ముసలోడు చెప్పాడు. "ఒకవేళ డ్యూరోకర్ ప్రతి ఏడూ ఇక్కడికి వస్తూ పోతూ ఉన్నట్లయితే ఇక వాడికంటే గొప్ప మేనేజర్ లేడని మీ అయ్య అనుకునుండేవాడు."

"అందరికంటే గొప్ప మేనేజరెవరు? ల్యూకా? మైక్ గొంజాలెజా?"

"నేననుకోవటం వాళ్లిద్దరూ ఒకరికొకరు తీసిపోరు."

"జాలర్లలో మాత్రం నువ్వే గొప్పోడివి" అన్నాడు పిల్లోడు.

"కాదు. నాకంటే గొప్పవాళ్లు చాలా మంది నాకు తెలుసు."

"అదేం కాదు" పిల్లోడు నిశ్చయంగా చెప్పాడు. "నువ్వు చెప్పినట్లు మంచి మంచి జాలర్లు చాలా మందే ఉన్నారు. కొంతమంది గొప్పోళ్లు కూడా ఉండొచ్చు. కానీ నీకు నువ్వే సాటి."

"నువ్వా మాట అంటుంటే నాకు చాలా సంబరంగా ఉంది. నేను పట్టలేనంత పెద్ద చేప ఎదురుపడకపోతే బాగుణ్ను."

"నువ్వు ఎప్పుడూ చెప్తావు కదా నీకు చాలా బలముందని. నువ్వు ఇంకా అంత బలవంతుడివే అయితే నువ్వు పట్టలేని చేపే ఉండదు."

"నేననుకుంటున్నంత బలం ఇప్పుడు నాకు లేదేమో" ముసలోడు అన్నాడు. "అయితేనేం. నాకు చాలా కిటుకులు తెలుసు. చెప్పలేనంత గుండె బలముంది. ఒకసారి పట్టుపట్టానంటే ఇక వదిలిపెట్టను."

"సరే ఇక పడుకో. పెందలాడే పడుకుంటే పొద్దుటికల్లా బడలిక దిగిపోతుంది. నేనీ క్యారేజీ తీసుకెళ్లి వాళ్లకిచ్చేస్తా."

"సరే. నువ్వు కూడా వెళ్లి పడుకో. పొద్దున్నే వచ్చి లేపుతాలే."

"నువ్వు నాకు అలారం లాంటోడివి" పిల్లోడు నవ్వుతూ అన్నాడు.

"నాకు నా వయసే అలారం" తిరిగి నవ్వుతూ అన్నాడు ముసలోడు. "అయినా ముసలోళ్లకు అంత తొందరగా మెలకువ ఎందుకొస్తుంది? రోజులో ఎక్కువ సేపు మేలుకుని ఉండాలనా?"

"నాకు తెలీదు" పిల్లోడు అనాసక్తిగా జవాబిచ్చాడు. "పిల్లలు ఆలస్యంగా పడుకుని, ఎక్కువసేపు నిద్ర పోతారన్నదే నాకు తెలుసు."

"నాకు గుర్తుంది" ముసలోడు అన్నాడు. "నిన్ను టైముకొచ్చి లేపుతాలే."

"వాడొచ్చి నన్ను లేపటం నాకిష్టముండదు. చిన్నతనంగా అనిపిస్తుంది."

"ఐనా ఏం ఫర్లేదు. డిమాగియో గెలిచాడు కదా."

"ఆ జట్టులో వేరే వాళ్లున్నారు."

"ఉండొచ్చు. కానీ వాడికెవరూ సాటిరారు. బ్రూక్లిన్ ఫిలడెల్ఫియాల మధ్య జరిగే పోటీలో నేను మాత్రం బ్రూక్లిన్ వైపే. ఇంకా పాత పార్కులో డిక్ సిస్లర్, మిగతా వాళ్ల ఆట చూడాలి. అద్భుతం" చెప్పాడు ముసలోడు.

"వాళ్లలా ఇంకెవరూ ఆడరు. ఇప్పటిదాకా నేను చూసిన వాళ్లలో బంతిని చాలా దూరం కొట్టింది వాడొక్కడే."

"వాడు ఇంతకుముందు ఇక్కడికి ఇసుక తిన్నెల మీదికి వచ్చేవాడు నీకు గుర్తుందా?"

"అవును. వాడ్ని నేను చేపల వేటకి నాతో పాటు వస్తాడేమో అడుగుదామనుకున్నా. కానీ సిగ్గేసింది. నువ్వెళ్లి అడగమని చెప్తే నువ్వు కూడా సిగ్గుపడి అడగలేదు."

"అవును. అది పెద్ద తప్పు. అప్పుడు అడిగితే వాడు మనతో పాటు వేటకు వచ్చేవాడేమో. అలా జరిగుంటే మనం ఎప్పుడూ మరచిపోలేని గుర్తుండేది."

"డిమాగియోను నాతోపాటు చేపల వేటకు తీసుకెళ్దామనుకుంటున్నా. వాడి అయ్య కూడా జాలరేనంట. మనలాగే వాడు కూడా అప్పుడు పేదోడై ఉంటాడు. కాబట్టి మనం అడిగితే వస్తాడు" ముసలోడు అన్నాడు.

"సిస్లర్ అయ్య మాత్రం పేదోడు కాదు. వాళ్లయ్యనా అంతప్పుడే పెద్ద లీగు పోటీల్లో ఆడుతుండేవాడు."

"నేను నీ అంతప్పుడు పెద్ద ఓడను నడుపుతుండేవాడ్ని. ఆ ఓడ ఆఫ్రికాకు వెళ్తొస్తుండేది. ఆఫ్రికాలో సాయంకాలం పూట సముద్ర తీరాల్లో సింహాలను చూశా."

"నాకు తెలుసు. చాలాసార్లు చెప్పావు."

"మనం ఆఫ్రికా గురించి మాట్లాడుకుందామా? బేస్‌బాల్ గురించి మాట్లాడు కుందామా?"

"బేస్‌బాల్ గురించి మాట్లాడుకుందాం" పిల్లోడు అన్నాడు. "జాన్ జె మెక్‌గ్రా గురించి చెప్పు" అనడిగాడు. "జె అంటే జోతా".

"ఆ రోజుల్లో వాడు కూడా అప్పుడప్పుడూ ఈ ఇసుక తిన్నెల మీదికి వస్తూండేవాడు. అబ్బో చాలా మొరటోడు. కొట్టినట్టు మాట్లాడేవాడు. ఇక తాగాడో మనిషే కాదు. వాడికి గుర్రప్పందాలన్నా, బేస్‌బాల్ అన్నా రెండూ ఇష్టమే. ఎప్పుడూ గుర్రాల పేర్లు కాగితం మీద రాసుకుని జేబులో పెట్టుకుని తిరుగుతుండేవాడు. ఫోన్లో గుర్రప్పందాల గురించి మాట్లాడుతుండేవాడు."

"వాడు చాలా మంచి మేనేజర్" పిల్లోడు అన్నాడు. "మా అయ్యయితే వాడికంటే

వాటన్నింటిని ఆ పిల్లోడు రెండు బాక్సులున్న క్యారేజీలో బయట ఇసుక తిన్నె దగ్గర నుంచి తీసుకొచ్చాడు. రెండు జతల కత్తులు, ఫోర్కులు, చెంచాలు వేటికవి పేపర్లో చుట్టి జేబులో పెట్టుకొచ్చాడు.

"ఇవన్నీ నీకెవరిచ్చారు?"

"మార్టిన్. మా పడవోడు"

"నేను వాడికి రుణపడి ఉన్నానని చెప్పాలి."

"నేను చెప్పానులే. మళ్లీ నువ్వు చెప్పక్కర్లేదు" పిల్లోడు కలగజేసుకుంటూ అన్నాడు.

"వాడికి పెద్ద చేప పొట్ట మాంసం ఇస్తా" ముసలోడు అన్నాడు. "వాడు ఇంతకుముందు కూడా అన్నం పంపించాడు కదా?"

"పంపించాడనుకుంటా."

"అలాగైతే పొట్ట మాంసం కన్నా మంచిది ఇంకేదైనా వాడికివ్వాలి. వాడు మన గురించి ఎప్పుడూ ఆలోచిస్తుంటాడు."

"వాడు రెండు బీరు సీసాలు కూడా పంపించాడు."

"క్యానుల్లో బీరంటే నాకు చాలా ఇష్టం."

"నాకు తెలుసు. కానీ ఇది సీసా బీరు. హటుయే బీరు. సరే వీటిని తీసుకెళ్లి వాడికి ఇచ్చేస్తా."

"నువ్వు చాలా మంచోడివి" అన్నాడు ముసలోడు. "ఇక తిందామా?"

"ఇందాకట్నుంచి అదే చెప్తున్నా" పిల్లోడు శాంతంగా అన్నాడు. "నువ్వు రెడీ అయ్యాకే క్యారేజీ తెరుద్దామనుకున్నా."

"నేను రెడీ" అన్నాడు ముసలోడు. "చేతులు కడుక్కోవటానికి ఆలశ్యమైంది."

నువ్వు చేతులు ఎక్కడ కడిగావు? మనసులో అనుకున్నాడు పిల్లోడు. మంచి నీటి కుళాయి రెండు వీధులకు అవతలెక్కడో ఉంది. ముసలోడికి నీళ్లు, సబ్బు, మంచి తుండు కూడా తెచ్చిపెట్టాల్సింది అనుకున్నాడు పిల్లోడు. ఈ మాత్రం ఆలోచన ఎందుకు రాలేదు? ఈ చలి కాలంలో ముసలోడికి మరో చొక్కా, ఒక జాకెట్, ఒక జత బూట్లు, ఒక దుప్పటి తీసుకురావాలి" అనుకున్నాడు.

"సూపు బ్రహ్మాండంగా ఉంది" అన్నాడు ముసలోడు.

"బేస్‌బాల్ గురించి చెప్పు" పిల్లోడు అడిగాడు.

"అమెరికన్ లీగ్‌లో నేను చెప్పినట్లు ఉత్తర అమెరికా వాళ్లే గెలిచారు" ముసలోడు ఆనందంగా చెప్పాడు.

"వాళ్లు ఈ రోజు ఓడిపోయారు" పిల్లోడు చెప్పాడు.

"నాకు తెలుసు."

"సరే ఇక పడుకో ముసలోడా."

పిల్లోడు బయటకు వెళ్లిపోయాడు. వాళ్లు తినేటపుడు గదిలో దీపం బుడ్డి కూడా లేదు. ముసలోడు ప్యాంటు విప్పేసి కుక్కి మంచం మీద పడుకున్నాడు. మంచం మీద చిరిగిపోయిన పరుపులో స్ప్రింగులు గుచ్చుకోకుండా వాటిమీద పేపర్లు పరిచాడు. ప్యాంటుని పేపర్లతో చుట్టచుట్టి తల కింద దిండులా పెట్టుకున్నాడు. దుప్పటి కప్పుకుని కళ్లుమూసుకున్నాడు.

ముసలోడు తొందరగానే నిద్రలోకి జారుకున్నాడు. కలలో అతడికి చిన్నప్పుడు ఓడలో ఆఫ్రికా వెళ్లటం, అక్కడ బంగారు రంగులో మెరిసే పొడవాటి బీచ్‌లు, తెల్లగా కళ్లు మిరిమిట్లు గొలిపే సముద్ర తీరాలు, సముద్రంలోకి పొడుచుకొచ్చిన ఎత్తయిన కొండలు, బూడిద రంగులో మెరిసిపోయే ఎత్తైన పర్వతాలు ఒకదాని వెంట ఒకటి కనిపించాయి. ఆ సముద్ర తీరం పక్కనే అతడు ప్రతిరాత్రీ అలల ఘోషను వింటున్నట్లు, ఆ అలల మీదుగా నాటు పడవలు వస్తున్నట్లు కలకన్నాడు. ఓడ గోడలకు పూసిన తారు వాసన నిద్రలోనే అతడి ముక్కు పుటాలను తాకుతుంది. పొద్దున్నే చల్లటి గాలి తనతో పాటు మోసుకువచ్చే ఆఫ్రికా నేల వాసన కూడా పీల్చాడు.

మామూలుగా ఆ పొద్దుటి గాలి మోసుకొచ్చే ఆఫ్రికా మట్టి వాసనతో ఆ ముసలోడు మేల్కొంటాడు. వెంటనే బట్టలేసుకుని, వెళ్లి పిల్లోడ్ని నిద్ర లేపుతాడు. కానీ ఈసారి మట్టి వాసన చాలా ముందే వచ్చింది. నిద్రలో ఉన్న ముసలోడికి అది తెలుసు. అందుకే నిద్ర లేవకుండా ఇంకా కలల్లో మునిగిపోయాడు. సముద్రంలో నుంచి ఉబికివచ్చినట్లున్న తెల్లటి దీవులు, రకరకాల ఓడరేవులు, కానరీ దీవుల్లో తీరం వెంట విశాలమైన రోడ్లు చూస్తున్నాడు.

ఆ ముసలోడు తుఫానుల గురించి కానీ ఆడోళ్ల గురించి కానీ గొప్ప విశేషాల గురించి కానీ పెద్దపెద్ద చేపల గురించి కానీ తగాదాల గురించి కానీ మల్లయుద్ధాల గురించి కానీ కనీసం తన భార్య గురించి కానీ కలలు కనటం మానేసి చానా ఏళ్లయింది. ఇప్పుడతడు సముద్ర తీరాలు, తీరంలోని కొండలు, తీరంలో తిరుగాడే సింహాల గురించే కలలు కంటున్నాడు. ఆ సింహాలు సాయంత్రం పూట పిల్లి పిల్లల్లా ఆడుకుంటున్నాయి. ముసలోడికి పిల్లోడంటే ఎంత ప్రేమో ఆ సింహాలన్నా అంత ప్రేమ. ఆ పిల్లవాడి గురించి ముసలోడు ఎప్పుడూ కలకనలేదు.

ముసలోడు నిద్ర నుంచి లేచాడు. తెరచి ఉన్న తలుపు గుండా చంద్రుడు కనిపిస్తున్నాడు. చుట్టచుట్టిన ప్యాంటు తీసి తొడుక్కున్నాడు. బయటకు వెళ్లి గుడిసె

పక్కనే మూత్ర విసర్జన చేశాడు. వెళ్లి పిల్లోడ్ని లేపటానికి బయల్దేరాడు. తెల్లవారుజామున చలికి అతడు వణికిపోతున్నాడు. నడుస్తూ నడుస్తూ ఉంటే చలి తగ్గిపోయి వంట్లో వేడి పుడుతుందని అతడికి తెలుసు.

పిల్లోడు పడుకుని ఉన్న ఇంటి తలుపుకు తాళం తీసి ఉంది. ముసలోడు తలుపులు తెరిచి ఉత్త కాళ్లతో చప్పుడు చేయకుండా లోపలికి వెళ్లాడు. పిల్లోడు ఇంట్లో ముందు గదిలో ఒక మంచం మీద నిద్రపోతూ ఉన్నాడు. కిందికి దిగిపోతున్న చంద్రుని కాంతిలో ఆ పిల్లోడి ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. నెమ్మదిగా పిల్లోడి పాదాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు ముసలోడు. వాడు లేచే వరకూ దాన్ని అలాగే పట్టుకున్నాడు. పిల్లోడు మేల్కొని తలతిప్పి ముసలోడ్ని చూశాడు. ముసలోడు నవ్వుతూ తల ఊపాడు. పిల్లోడు లేచి కూర్చుని, మంచం పక్కనున్న కుర్చీ నుంచి తన ప్యాంటు తీసుకుని కూర్చునే తొడుక్కున్నాడు.

ముసలోడు ఇంట్లో నుంచి బయటకొచ్చాడు. అతడి వెనకాలే పిల్లోడు కూడా వచ్చాడు. వాడు ఇంకా నిద్ర మత్తులోనే ఉన్నాడు. ముసలోడు తన చేతులను పిల్లోడి భుజాల చుట్టూ వేశాడు. "చాలా ముందే లేపానా?" అన్నాడు.

"అదేం కాదు" పిల్లోడు చెప్పాడు. "మగాళ్లు తొందరగా నిద్ర లేవాలి."

వాళ్లిద్దరూ ముసలోడి గుడిసె వైపుగా నడవటం మొదలుపెట్టారు. అప్పటికే చాలా మంది మగాళ్లు చీకట్లో రోడ్డు మీద ఉత్తకాళ్లతో తిరుగుతున్నారు. వాళ్లవాళ్ల పడవల తెరచాప స్తంభాలను మోసుకెళుతున్నారు.

ముసలోడి గుడిసెకి వెళ్లాక పిల్లోడు మోకుల చుట్టను తట్టలో వేసుకున్నాడు. దానితో పాటు ఈటె కర్ర, తెరచాప అడ్డకర్ర తీసుకున్నాడు. ముసలోడు తెరచాప చుట్టివున్న స్తంభాన్ని భుజాన వేసుకున్నాడు. ఇద్దరూ బయటకు నడిచారు.

"టీ తాగుతావా?" పిల్లోడు అడిగాడు.

"ఈ సామాను పడవలో వేశాక తాగుదాం."

తెల్లారుజామునే వేటకు వెళ్లే జాలర్ల కోసం అక్కడ ఒక చిన్న టీ కొట్టు ఉంటుంది. రాత్రి డబ్బాల్లో తెచ్చిపెట్టిన పాలతో చేసిన టీ అది. చెరో కప్పు టీ తీసుకుని తాగారు.

"ముసలోడా నీకు బాగా నిద్ర పట్టిందా?" పిల్లోడు అడిగాడు. వేడివేడి టీ చుక్కలు గొంతులో పడ్డాక పిల్లోడికి ఇప్పుడిప్పుడే నిద్ర మత్తు వదులుతోంది.

"హాయిగా నిద్రపోయా మనోలిన్" ముసలోడు చెప్పాడు. "ఈ రోజు నాకు చాలా ధీమాగా ఉంది."

"నేను కూడా బాగా నిద్రపోయా" పిల్లోడు అన్నాడు.

"నేను వెళ్లి మన కవడ చేపల్ని, నీకు తాజా ఎరల్ని తీసుకొస్తా. మా పడవ సామాను మా పడవోడే తీసుకొస్తాడు. వాడు ఎవర్నీ కూడా ఏదీ పట్టుకోనివ్వడు."

"మన విషయం వేరు" ముసలోడు అన్నాడు. "నీకు ఐదేళ్ల వయసప్పుడే నీ చేత సామాన్లు తెప్పించాను."

"నాకు తెలుసు" పిల్లోడు చెప్పాడు. "నేనిప్పుడే వస్తా. ఈ లోపు నువ్వు ఇంకో టీ తాగు. మనకిక్కడ ఖాతా ఉందిలే."

పిల్లోడు ఎరలను భద్రం చేసిన ఐస్ ఇంటివైపు ఉత్తకాళ్లతో గులకరాళ్ల మీదుగా నడుచుకుంటూ పోయాడు.

ముసలోడు తన టీని నెమ్మదిగా తాగాడు. ఇక ఆ రోజుకంతా ఆ గుక్కెడు టీ నీళ్లతోనే గడపాలి. ఆ విషయం అతడికి తెలుసు. అందుకే పిల్లోడు చెప్పగానే ఇంకో టీ తీసుకుని తాగాడు. చాలా కాలం నుంచి తిండి అంటే ముసలోడికి ముఖం మొత్తింది. మధ్యాహ్నం తినటం కోసం తన వెంట ఎన్నడూ తిండి తీసుకెళ్లలేదు. అతడి పడవ ముందు భాగంలో ఉన్న తొట్టెలో మంచి నీళ్ల సీసా ఉంటుంది. ముసలోడికి రోజంతటికీ ఆ నీళ్లు చాలు.

పిల్లోడు కవడ చేపలు, రెండు తాజా ఎరలు కాగితంలో చుట్టుకుని తీసుకొచ్చాడు. వాళ్లిద్దరూ కలిసి చిన్న తోవ వెంట గులకరాళ్లతో నిండిన ఇసుక మీదుగా పడవ దగ్గరకు వెళ్లారు. అక్కడ ఒడ్డున నిలిపి ఉన్న పడవను ఎత్తి నెమ్మదిగా నీళ్లలోకి నెట్టారు.

"జాగ్రత్త ముసలోడా."

"జాగ్రత్త" ముసలోడు చెప్పాడు.

తెడ్లు తీసుకుని పడవకున్న తెడ్ల గాళ్లలో పెట్టి తాళ్లు బిగించి కట్టాడు. ముందుకు వంగి తెడ్లు బలంగా వేస్తూ చీకట్లో రేవు నుంచి పడవను నడుపుకుంటూ బయల్దేరాడు. వేరే రేవుల నుంచి బయల్దేరిన పడవలు కూడా ఉన్నాయి. చంద్రుడు కొండల వెనక్కు వెళ్లిపోవటం వల్ల చీకట్లో ఆ పడవలు ముసలోడికి కనిపించట్లేదు. జాలర్లు తెడ్లు వేస్తున్నప్పుడు అవి నీళ్లలో చేసే చప్పుళ్లు అతడికి వినిపిస్తూనే ఉన్నాయి.

అప్పుడప్పుడు ఏదో ఒక పడవలోని వాళ్లు మాట్లాడుతున్నారు. చాలా పడవలు వాటి తెడ్ల చప్పుడు తప్ప నిశబ్దంగానే ప్రయాణిస్తున్నాయి. రేవు మొదలు దాటిన తర్వాత జాలర్లు తమ పడవలను తలో దిక్కుకు తీసుకెళ్తారు. ఆ మహా సముద్రంలో ఎక్కడ చేపలు పడతాయనిపిస్తే అక్కడకు వెళ్తారు. ముసలోడు నేల వెదజల్లే సువాసనలను విడిచి ఉదయ కాలపు స్వచ్ఛమైన సముద్ర వాసనలోకి పడవను నడుపుకుంటూ వెళ్లాడు. సముద్రంలో ఈ రోజు ప్రయాణం చాలా దూరం కొనసాగుతుందని అతడికి తెలుసు.

జాలర్లు పెద్ద అగాధమని పిలిచే ప్రాంతాన్ని దాటిపోతున్నప్పుడు సముద్రపు జల సంధిలో నాచు వెదజల్లే వెలుగులు కనిపించాయి. అక్కడ సముద్రం లోతు అకస్మాత్తుగా పెరుగుతుంది. నాలుగు వేల రెండు వందల అడుగుల లోతుంటుంది. నీటి ప్రవాహం సముద్రపు అడుగు భాగానికి నిటారుగా ఉన్న గోడలను గట్టిగా ఢీ కొట్టినపుడు ఆ ఉధృతికి అక్కడ నీళ్లు సుడులు తిరుగుతుంటాయి. ఈ సుడుల్లోకి అన్ని రకాల చేపలూ వస్తుంటాయి. ఇక్కడే రొయ్యలు, ఎరలుగా వాడే చిన్న చేపలు గుంపులు గుంపులుగా ఉంటాయి. నీటి అడుగు భాగంలో ఉండే పెద్ద పెద్ద బొరియల్లో స్క్విడ్ల మంద కూడా ఉంటుంది. ఇవన్నీ రాత్రిపూట సముద్రం పైభాగానికి దగ్గరగా వస్తుంటాయి. వాటిని అక్కడ తిరుగుతూ ఉండే పెద్ద చేపలు తింటుంటాయి.

ఇక తెలవారబోతున్నట్లు ముసలోడికి తెలుస్తోంది. చీకట్లో రెక్కల చేపలు నీళ్లలో నుంచి సర్రున గాల్లోకి ఎగిరి రెక్కలు కొట్టుకుంటూ మళ్లీ నీళ్ళలోకి దూకుతున్న చప్పుడు అతడికి వినిపిస్తోంది. ఆ పిచ్చుకమీనలంటే అతడికి చాలా ఇష్టం. సముద్రంలో ముసలోడికి మంచి మిత్రులు అవే. సముద్రం మీద ఎగిరే పిట్టల్ని చూస్తే, అందులోనూ చాలా చిన్నగా సుకుమారంగా ఉండే నల్ల పిచ్చుకల్ని చూస్తే ముసలోడికి జాలేస్తుంది. అవి సముద్రం మీద ఏదైనా దొరుకుతుందేమోనని ఎప్పుడూ వెదుకుతూనే ఉంటాయి. కానీ వాటికి ఏమీ దొరకనే దొరకదు. దోపిడి పక్షుల వంటి పెద్ద బలమైన పక్షులకు తప్పించి మిగిలిన పిట్టల జీవితం మనం ఊహించే దానికన్నా కష్టాలమయమని అనుకున్నాడు. సముద్రం ఇంత క్రూరంగా ఉంటే.. రామదాసు పిట్టల్లాంటివాటిని అంత సున్నితంగా, మెత్తగా ఎందుకు చేశారు? సముద్రం దయగలది. చాలా అందమైనది. క్రూరమైనది కూడా. అది అకస్మాత్తుగా కబళిస్తుంది. ఎగురుతూ చిన్న చిన్న చేపల కోసం అప్పుడప్పుడూ నీళ్లలో మునిగి వేటాడుతూ తమ చిన్ని చిన్ని ముక్కులతో విషాద గీతాలు ఆలపించే ఈ పిట్టలు చాలా సున్నితమైనవి. సముద్రం మీద అవి బతకలేవు.

సముద్రం దయగల తల్లి అని అతను ఎప్పుడూ అనుకునే వాడు. స్పానిష్ ప్రజలు 'లా మర్' అని ఆమెను ప్రేమగా పిలుచుకుంటారు. ఆమెను ప్రేమించే వాళ్ళలో ఇంకొందరు ఆమెను ఒక స్త్రీగా భావించి బూతులు తిడుతుంటారు కూడా. చేపల వేటకు మర పడవలు, బోట్లు వాడే కొత్త తరం జాలర్లు సముద్రాన్ని పురుషుడుగా భావించి 'ఎల్ మర్' అని సంబోధిస్తారు. వీరు సొర చేపల కాలేయాలు అమ్మి సంపాదించిన డబ్బుతో మర పడవలు కొనుక్కున్నారు. వాళ్లు సముద్రాన్ని ఒక పోటీదారుగానో ఒక స్థలంగానో ఒక శతృవుగానో భావించి మాట్లాడుతుంటారు. అయితే ఈ ముసలోడు మాత్రం సముద్రాన్ని గొప్ప మేలు చేసిన, మేలు చేయకుండా బిగపట్టిన

స్త్రీమూర్తిగానే భావిస్తాడు. ఎప్పుడైనా ఆమె క్రూరంగా నిర్దయగా ప్రవర్తించిందంటే కారణం ఆమె అశక్తత వల్లే. చంద్రుడు స్త్రీ మీద ఎలా ప్రభావం చూపుతాడో ఈమె మీద కూడా అలానే ప్రభావం చూపుతాడని ముసలోడు అనుకున్నాడు.

అతడు నింపాదిగా పడవ నడుపుతున్నాడు. తను అనుకున్నంత వేగంగా పడవను నడపటంలో పెద్దగా ప్రయాసపడటం లేదు. అప్పుడప్పుడూ ప్రవాహం మూలంగా కలిగే సుడులు తప్ప సముద్ర ఉపరితలం మీద నీరు స్థిరంగా ఉంది. పడవ నడపటంలో మూడొంతుల పనిని ప్రవాహానికే వదిలిపెట్టాడు. వెలుతురు వచ్చేటప్పటికి తను అనుకున్న దానికన్నా ఎక్కువ దూరమే వచ్చినట్లు అతడికి కనిపించింది.

పెద్ద పెద్ద అగాధాల్లో వారం రోజులు గాలమేసినా కానీ లాభం లేకపోయిందని అనుకున్నాడు ముసలోడు. బొనిటో చేపల గుంపులు అల్బకోర్ చేపల గుంపులు ఉండే చోట పెద్ద చేప కూడా ఉండొచ్చేమో. ఈ రోజు అక్కడ వేటాడాలి అని నిర్ణయించుకున్నాడు.

ఇంకా మసక మసకగా ఉన్నప్పుడే అతడు పెట్టెలో నుంచి ఎరలు బయటకు తీశాడు. వాటిని గాలాలకు తగిలించి ప్రవాహానికి వాలుగా నీటిలో వేశాడు. వాటిలో ఒక గాలం రెండు వందల నలభై అడుగుల లోతుకు వెళ్ళింది. రెండోది నాలుగు వందల యాభై అడుగుల లోతుకు పోయింది. మూడోది, నాలుగోది సముద్రం అడుగు భాగంలో నీలిరంగు నీటి పొరల్లోకి చేరాయి. ఒకటి ఆరు వందల అడుగుల లోతుకి, రెండోది ఏడు వందల ఇరవై అడుగుల లోతుకి వెళ్లాయి. ప్రతి ఎరనూ గాలం కొక్కేనికి తల కిందులుగా గట్టిగా గుచ్చాడు. బయటకు కనిపించే మిగిలిన కొక్కెం మొనను కవడ చేపలతో కప్పేశాడు. ఇలా కవడ చేప కళ్ళ మధ్య నుంచి కొక్కేన్ని దండలా గుచ్చాడు. ఈ ఎరల నుంచి వచ్చే తీయటి వాసనకు పెద్ద చేపలు మైమరచిపోయి వచ్చి గాలానికి చిక్కుకుంటాయి.

పిల్లోడు అతడికి ట్యూనా చేపలో అల్బకర్ చేపలో కానీ రెండు కొత్త చేపలను ఎరలుగా వాడుకోవటానికి ఇచ్చాడు. ముసలోడు వీటిని బాగా లోతుకు వేసిన రెండు గాలం కొక్కేలకు తూనిక రాళ్ళలాగా తగిలించాడు. మిగిలిన గాలాలకు ఇంతకు ముందు వాడిన ఒక పెద్ద నీలిరన్నర్‌ను ఇంకొక పసుపు జాక్‌ను గుచ్చాడు. ఇంతకు ముందు వాడినవైనా గానీ అవి పాడవకుండా బాగానే ఉన్నాయి. ప్రతి గాలం తీగ ఒక పెద్ద పెన్సిల్ మందాన ఉంది. ఆ తీగను విరగకుండా తేలికగా ఒంగే పేనుగర్రకు ఒక కన్నం చేసి దానిలోపలి నుంచి గట్టిగా కట్టివుంది. ఏ చేపొచ్చి ఎరను లాగినా లేక ముట్టుకున్నా ఈ కర్ర తీగతో పాటుగా నీళ్ళలోకి మునుగుతుంది. ప్రతి గాలానికీ అవసరమైతే వాడటం కోసం మరో రెండు వందల నలభై అడుగుల పొడవున్న రెండు

తీగ చుట్టలు సిద్ధంగా ఉన్నాయి. ఏదైనా చేప గాలానికి చిక్కుకుని పద్దెనిమిది వందల అడుగుల లోతుకు లాక్కెళ్ళినా సరిపోయే తీగ అది.

మూడు గాలం కర్రలు పడవ పక్కనే నీళ్లలో మునుగుతుండటాన్ని చూశాడు ముసలోడు. గాలం తీగలు నీటిలోపల నిటారుగా ఉండేలా చూస్తూ పడవను నెమ్మదిగా నడుపుతున్నాడు. ఇప్పుడిప్పుడే వెలుతురు అలముకుంటోంది. ఇక ఏక్షణంలోనైనా సూర్యుడు ఉదయిస్తాడు.

సూర్యుడు సముద్రం నుంచి పలుచగా పైకి లేస్తున్నాడు. ఆ వెలుతురులో సముద్రం మీద తేలియాడుతూ తీరానికి మరలుతున్న మిగతా పడవలు కనపడుతున్నాయి. కొద్ది సేపటికే సూర్యుడు మరింత ప్రకాశవంతమయ్యాడు. కళ్ళు మిరుమిట్లు గొలిపే సూర్యకిరణాలు నీటి మీద పడి పరావర్తనం చెంది ముసలోడి కళ్ళలోకి సూటిగా గుచ్చుకుంటున్నాయి. ముసలోడు వాటిని చూడకుండా పడవను నడపటంలో నిమగ్నమయ్యాడు. అతడు పడవ మీద నుండి నీటిలోకి వంగి చీకటిగా ఉన్న నీటి అట్టడుగు భాగానికి చేరిన గాలం తీగలను చూశాడు. తీగలను నీటిలో అంత నిటారుగా అంత నేర్పుగా పెట్టగలిగే జాలరి మరొకడు లేడు. నీటి అడుగు పొరల్లో చేపలు ఎక్కడెక్కడ ఉంటాయని అతడు అనుకుంటాడో ఖచ్చితంగా ఆ స్థలంలోనే ఎరలు ఉండేలా అతడు గాలాన్ని పట్టి ఉంచగలడు. మిగతా వాళ్ళయితే తమ గాలాలను ప్రవాహానికి అనుగుణంగా ఉంచుతారు. లేదంటే చేపలు ఆరు వందల అడుగులకన్నా కింద ఉండొచ్చనుకుని గాలాలు వేస్తే అవి మూడు వందల అరవై అడుగుల లోతు దాటి కిందకు వెళ్లవు. కానీ తాను మాత్రం గాలాన్ని ఖచ్చితంగా ఎక్కడ చేపలుంటాయని అనుకుంటానో అక్కడే వేయగలనని ముసలోడు తనలో తాను అనుకున్నాడు. అయితే తనకు అదృష్టం కలిసిరావట్లేదు. కానీ ఎవరికి తెలుసు? ఈ రోజు చేప దొరికుతుందేమో. ప్రతి రోజూ కొత్త రోజే. అదృష్టం కలిసి వస్తే బాగానే ఉంటుంది. కానీ అదృష్టం మీద ఆధారపడటం కన్నా ఖచ్చితమైన చోట గాలాలు వేయటమే తనకు ముఖ్యం. ఎందుకంటే అదృష్టం తలుపు తట్టినప్పుడు అందుకు సిద్ధంగా ఉండాలి కదా.

పొద్దు పొడిచి రెండు గంటలయ్యింది. ఇప్పుడు సూర్యకిరణాలు అతడి కళ్లను అంతగా ఇబ్బంది పెట్టటం లేదు. తూర్పు వైపుకు కూడా చూడగలుగుతున్నాడు. కనుచూపు మేరలో మూడు పడవలు మాత్రమే ఉన్నాయి. అవి కూడా ఒడ్డుకు చాలా దగ్గరగా వెళ్లినట్టున్నాయి.

"నా జీవితం మొత్తం సూర్యుడి తొలి కిరణాలు నా కళ్ళకు గుచ్చుకుంటూనే ఉన్నాయి. అయినా అది బాగానే ఉంటుంది. సాయంకాలాల్లో నేను కళ్లకు చీకట్లు

కమ్మకుండా నేరుగా సూర్యుడ్ని చూడగలను. సాయంత్రం కూడా సూర్యుడు చాలా ప్రకాశంగానే వెలుగుతూ ఉంటాడు. కానీ పొద్దునపూట చూడాలంటేనే ఆ వెలుతురు బాధిస్తుంది."

ఇట్లా ముసలోడు తనలో తాను అనుకుంటుండగానే తనకు కొంచెం ముందుగా ఆకాశంలో నల్లటి రెక్కలతో గిరికీలు తిరుగుతున్న ఒక గద్ద కనిపించింది. అది తన రెక్కలను వెనకకు మడచి పెట్టి వేగంగా కిందికి దిగి మళ్ళీ గిరికీలు కొట్టటం ప్రారంభించింది.

"దీనికి ఏదో దొరికింది. ఊరికే చూడటానికి రాలేదది" ముసలోడు బిగ్గరగా అన్నాడు.

ఆ పక్షి గిరికీలు కొడుతున్న దిశగా ముసలోడు తన పడవను నెమ్మదిగా నడిపాడు. అతడు ఏమాత్రం తొందరపడలేదు. గాలాలు నీటిలో నిటారుగానే ఉండేట్లు చేసుకున్నాడు. నీళ్ళలో తెడ్లు వేస్తూ పడవను ముందుకు పోనిచ్చాడు. ఇంతకు ముందు కంటే పడవ వేగం కొంచెం పెరిగింది. ఒక వేళ పక్షి తన ప్రయత్నంలో పెద్దగా ఉపయోగపడక పోయినా అతనికి వచ్చే నష్టం ఏమీ లేదు.

పక్షి గాలిలో కొంచెం పైకెళ్ళి మళ్ళీ గిరికీలు కొట్టటం మొదలుపెట్టింది. ఇప్పుడు దాని రెక్కలు నిశ్చలంగా ఉన్నాయి. అది మళ్ళీ అకస్మాత్తుగా కిందికి దూకింది. ముసలోడు అప్పుడు చూశాడు నీళ్ళను చీల్చుకుంటూ పైకెగిరి అంతే వేగంగా మళ్ళీ నీటి ఉపరితం మీద పడి ఈదటం మొదలు పెట్టిన పిచ్చుకమీనను.

"డాల్ఫిన్. పెద్ద డాల్ఫిన్" బిగ్గరగా అరిచాడు ముసలోడు.

పడవ ముందు భాగంలో ఉన్న ఒక చిన్న గాలం తీగను తన చేతిలో ఉన్న తెడ్డుతో అందుకున్నాడు. దానికి ఒక మధ్యరకం సైజులో ముల్లు కూడా ఉంది. ఆ ముల్లుకు ఒక కవడ చేపను ఎరగా గుచ్చాడు. దాన్ని పక్క నుంచి నీళ్లలోకి జారవిడిచి పై కొనను పడవ వెనుక భాగంలో ఉన్న ఒక రింగుకు ముడివేశాడు. ఇంకో తీగ చుట్టను తీసుకుని దానికి కూడా ఒక ఎరను తగిలించి పడవ ముందు పెట్టాడు. మళ్ళీ వెనక్కు వెళ్ళి తెడ్డు వెయ్యటం మొదలుపెట్టాడు. ఇప్పుడు ఆ పెద్ద రెక్కల నల్ల గద్ద నీటి ఉపరితలానికి అతి సమీపంగా వచ్చి నీటి వైపు తదేక దృష్టితో చూస్తోంది.

ఒక పక్క ముసలోడు ఆ పిచ్చుక మీనను అనుసరించి తన పడవను పోనిస్తున్నాడు. మరో పక్క చూస్తూ ఉండగానే ఆ గద్ద మళ్ళీ దాని రెండు రెక్కలను వంచి సర్రున కిందకు దూకి వెంటనే మళ్ళీ రెక్కలను ఆడిస్తూ ముక్కును హడావిడిగా నీటిలో ముంచింది. ఆ ముసలోడు, గద్ద తమ నుంచి తప్పించుకుపోతున్న ఆ పిచ్చుకమీనను తరుముకుంటూ వెళుతున్నారు. ఇంతలో ఒక పెద్ద డాల్ఫిన్ నీళ్ళలో కొంచెం పైకి లేస్తున్న దానికి గుర్తుగా

నీటి పైన అతనొక ఉబ్బును చూశాడు. ఆ పిచ్చక మీనలు పైన గాలిలోకి లేచినప్పుడు వాటిని అమాంతం నోట కరుచుకోవటానికి డాల్ఫిన్లు వాటి కింద నీళ్ళ మీద తేలియాడుతూ ఈదుతున్నాయి. ఆ చేపలు నీళ్ళలో పడీ పడగానే వాటికి కనిపించకుండా ఈ డాల్ఫిన్లు వేగంగా తప్పుకుంటున్నాయి. డాల్ఫిన్లు పెద్ద పెద్ద గుంపులుగా తిరుగుతున్నాయని ముసలోడు అనుకున్నాడు. ఇవి నీళ్ళలో చాలా దూరం విస్తరించి ఉన్నాయి. కాబట్టి ఈ పిచ్చక మీనలు వీటికి ఆహారం కాక తప్పదు. మరోవైపు ఆరాటపడుతూ అలసి ఉన్న గద్దకు వాటిని పట్టి తినే అదృష్టం లేకపోయింది. ఈ పిచ్చక మీనలు గద్ద తన ముక్కుతో పట్టుకోలేనంత పెద్దవే గాక దానికంటే వేగంగా పరుగెత్తగలవు.

ఒకపక్క పిచ్చకమీనలు గద్ద నుంచి, డాల్ఫిన్ల నుంచి, ముసలోడి నుంచి తప్పించుకోవటం కోసం చేసే విన్యాసాలను.. మరోపక్క పాపం గద్ద వృథాగా చేస్తున్న ప్రయాసను ముసలోడు గమనిస్తున్నాడు. ఇక ఈ చేపల గుంపు తనకు అందకుండా దూరంగా వెళ్లిపోయింది అని నిరాశగా అనుకున్నాడు ముసలోడు. అవి తన నుంచి చాలా దూరం వాయువేగంతో వెళ్లిపోతున్నాయి. బహుశా గుంపుకు బయటున్న వాటిని పట్టుకోగలనేమో. బహుశా పెద్ద చేప వాటికి దగ్గరలో ఉండి ఉండొచ్చేమో. లేదు లేదు, నా పెద్ద చేప మాత్రం వేరే ఎక్కడో ఉంది.. ఇలా సాగాయి అతడి ఆలోచనలు.

భూమి మీద పరచుకుని ఉన్న మేఘాలు ఇప్పుడు పైకి లేచి పెద్ద పర్వతాల మాదిరిగా రూపుదాల్చాయి. బూడిదరంగు నీలిరంగులు కలిసిన మిశ్రమవర్ణంలో ఉన్న కొండల ముందు ఒక పచ్చటి గీత గీసిన చందంగా సముద్ర తీరం కనపడుతోంది. నీరు ఇప్పుడు ముదురు నీలం రంగులోకి మారింది. ఈ నీలం రంగు ఎంత ముదురుగా ఉందంటే నీరు దాదాపు వంగ వన్నెలో కనిపిస్తోంది. అతడు వంగి నీటిలోకి చూసినప్పుడు ఆ ముదురు నీలం రంగులో నీటి పైన తేలియాడుతున్న చెత్తా చెదారం నుంచి ఒక ఎరుపు రంగు వెలుగు రేఖ వెలువడుతూ ఉంది. పైన సూర్యుడి నుంచి కూడా ఒక వింత కాంతి ప్రసరిస్తోంది. గాలం తీగలు చూపుకు అందనంత లోతుకు తిన్నగా నీటి అడుగుకి చేరిపోవటం ముసలోడికి కనిపించింది. పెద్ద గుట్టగా పోగు పడి ఉన్న చెత్తాచెదారాన్ని చూస్తుంటే అతడికి చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈ చెత్తా చెదారానికి దగ్గర్లోనే చేపలు ఉండొచ్చు. అనుకూలమైన వాతావరణానికి సూచనగా నడినెత్తి మీదకు చేరిన సూర్యుడి నుంచి వింత కాంతి ఒకటి నీళ్ళలోకి ప్రసరిస్తోంది. భూమి మీద మేఘాలు ఆకాశమంతెత్తు లేచాయి. గద్ద ఇప్పుడు కనుచూపు మేరలో కనిపించకుండా మాయమయింది. ఇప్పుడు ఆ నీటి ఉపరితలంలో పడవ పక్క నుంచి వెళుతున్న పసుపురంగులో, ఎండకు ఎండి కళావిహీనంగా కనిపిస్తున్న సర్గాస్సో నాచు,

దానితో పాటు జెల్లీ ఫిష్ లాంటి ఒక ఆకృతిని దాల్చి వింత రంగుల్లో కనిపిస్తున్న గాలితిత్తి లాంటి ఒక చెత్త పోగు మాత్రమే కనపడుతున్నాయి. అలా వెళుతూ వెళుతూ అది ఒక్కసారి పక్కకు తిరిగి మళ్ళీ వెంటనే యధా స్థితికి చేరింది. వంగ వన్నెలను వెదజల్లే మెరుపుతీగలా ఒక బుడగలా అమితమైన ఆనందంతో తేలియాడే ఒక యువరాణిలా హొయలు పోతోంది.

"ఒసేయ్ జెల్లీ చేపా. తిరుగుబోతా" ముసలోడు అరిచాడు.

ముసలోడు ముందుకు తెడ్ల వైపుకు కొంచెం వంగి చూశాడు. నీటిలో జెల్లీ చేప వెనుక భాగాన మెరుపుతీగలా వరుసలో వెళుతున్న చిన్ని చిన్ని చేపలు కనిపించాయి. జెల్లీ చేప బుడగలాగా మారినప్పుడు దాని నీడలో నుంచి ఈ బుల్లిచేపలు పోతున్నాయి. ఆ జెల్లీ చేప విషం ఆ బుల్లిచేపలను ఏం చేయదు. కానీ మనిషికి ఆ విషం ప్రమాదకరమే. అప్పుడప్పుడు చేపల వలలో ఈ జెల్లీ చేపలు పడుతుంటాయి. జిగటగా వంగ పండు రంగులో ఉండే జెల్లీచేప కోరలు ముసలోడి చేతులకు తగిలితే.. అతడి ముంజేతులు, చేతుల నిండా బొబ్బలు, పుళ్ళు లేస్తాయి. తాకీ తాకగానే కొరడాతో చెళ్ళు మనిపించినట్టు చాలా వేగంగా విషం పాకుతుంది.

తళుకు బెళుకుల బుడగల్లాంటి జెల్లీ చేపలను చూడటం ముసలోడికి ఇష్టంగానే ఉంటుంది. సముద్రంలో ఉండే జీవులన్నింటిలోకీ అతి కృత్రిమమైనవి ఇవి. అప్పుడప్పుడు తాబేళ్ళు వీటిని తింటుంటాయి. ఆ దృశ్యం చూస్తే ముసలోడికి చాలా సంతోషం వేస్తుంది. తాబేళ్లు ఎదురుగా వచ్చి జెల్లీ చేప కోరలు తమ కళ్ళకు తగలకుండా కళ్లు మూసుకుని వాటిని అమాంతం మింగేస్తాయి. తుఫాన్ల సమయంలో ఒడ్డుకు ఇసుకలోకి కొట్టుకొచ్చే తాబేళ్ల మీద తన పగుళ్ళు పడిన మడాలేసి తొక్కినప్పుడు తాబేళ్లు చేసే శబ్దం కూడా అతడికి చాలా ఇష్టం.

ఎంతో అందంగా మైమరిపిస్తూ వేగంగా ప్రయాణించగల చాలా విలువైన పచ్చ తాబేళ్ళన్నా, డేగ ముక్కు సముద్ర తాబేళ్ళన్నా అతడికెంతో ఇష్టం. పెద్దగా, గట్టి పసుపు డెక్కల శరీరాలతో ఒక అసహజమైన పద్ధతిలో ప్రేమించుకునే ఈ తాబేళ్లు.. కళ్ళు మూసుకుని సముద్ర రాకాసులైన జెల్లీ ఫిష్‌లను తింటాయి. ఇవంటే ముసలోడికి ఒక రకమైన చులకన భావం.

ముసలోడు చాలా సంవత్సరాల పాటు తాబేళ్ళ డెక్కలతో చేసిన పడవల్లో ప్రయాణించినప్పటికీ తాబేళ్ళ పట్ల అనురాగ బంధం లాంటిదేమీ అతడికి లేదు. తాబేళ్లంటే అతడికి విపరీతమైన జాలి మాత్రం ఉంది. ఒక టన్ను బరువుండే తాబేళ్ళ డొప్పలను పడవలుగా వాడుకునేవాళ్లు. చాలా మంది మనుషులు తాబేళ్ళ పట్ల నిర్దయగా

ప్రవర్తిస్తారు. ఎందుకంటే తాబేలును కోసి ముక్కలు చేసిన తర్వాత కూడా దాని గుండె గంటల తరబడి కొట్టుకుంటూనే ఉంటుంది. నాకు కూడా అలాంటి గుండే ఉందని అనుకున్నాడు ముసలోడు. నా చేతులు, కాళ్ళు కూడా వాటికి లాగే ఉంటాయి. ముసలోడు బలం కోసమని తెల్లగుడ్లు తినేవాడు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో దొరికే పెద్ద చేపలను పట్టటానికి అవసరమైన బలం తెచ్చుకోవటం కోసం మే నెల మొత్తం అతడు ఈ గుడ్లు తినేవాడు.

చాలా మంది జాలర్లు తమ సామాను పెట్టుకునేందుకు ఉమ్మడి గుడిసె ఒకటి ఉండేది. దానిలో ఒక పెద్ద డ్రమ్ములో సొర చేప కాలేయం నుంచి తీసిన నూనె ఉంచేవాళ్ళు. ముసలోడు ఆ నూనెను కూడా ప్రతి రోజూ క్రమం తప్పకుండా రోజుకొక కప్పు చొప్పున తాగేవాడు. అక్కడున్న జాలర్లందరూ ఎవరైనా ఈ సొరచేప నూనె తాగొచ్చు. అయితే చాలా మందికి ఆ రుచి సహించేది కాదు. అర్ధరాత్రని అపరాత్రని లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు లేచి పరుగులెత్తే వారి రుచీ పచీ లేని జీవితాలతో పోలిస్తే ఈ నూనె తాగటం ఏమంత పెద్ద విషయం కాదు. అంతే కాదు ఈ నూనె జలుబు, విషజ్వరాలను నయం చేయటానికి చాలా చక్కగా పని చేస్తుంది. కళ్ళకు కూడా ఇది చాలా మంచిది.

ముసలోడు తల పైకెత్తి ఆ పక్షి మళ్ళీ గిరికీలు కొడుతుండటాన్ని చూశాడు.

"అదిప్పుడు చేపలను చూసినట్టుంది" పెద్దగా అన్నాడు. పిచ్చుక మీనలు నీటి ఉపరితలంలో తిరుగుతున్న ఆనవాళ్లు లేవు. పైగా ఎర కోసం ఉపయోగించే బుడ్డి చేపలు కూడా అక్కడ తచ్చట్లాడుతున్నట్టు కనిపించ లేదు. ముసలోడు చూస్తుండగానే ఒక చిన్న ట్యూనా పైకి గాలిలోకి లేచి తిరిగి తల కిందులుగా మళ్ళీ నీళ్ళలోకి పడింది.

అలా ఎగిరి దూకిన ట్యూనా సూర్యుని కాంతికి వెండి రంగులో మెరిసింది. ఈ ట్యూనా తర్వాత ఒకొక్కటిగా చాలా ట్యూనాలు పైపైకి లేచి తలో దిక్కుకూ దూకుతూ ఎర కోసం నీళ్ళను చీల్చుకుంటూ గెంతాయి. ఇవి ఈ విధంగా ఆ ఎర చుట్టూ మూగి దానిని తరుముతున్నాయి.

ఈ చేపలు వేగం తగ్గించి కొంచెం నెమ్మదిస్తే వాటి మధ్యలోకి వెళ్లి కొన్నింటిని పట్టుకోవచ్చు అనుకున్నాడు ముసలోడు. ఈ ట్యూనాల గుంపు ఇలా ఎగరటం దూకటం, ఎరను చుట్టుముట్టి తరమటం మూలంగా నీళ్లలో ఆ చోటంతా తెల్లబుడగలతో నిండిపోయింది. వీటికి భయపడి నీటి పైన తేలియాడుతున్న బుడ్డి చేపలను ముక్కున కరుచుకోవటానికి ఇదే అదునుగా భావించి ఆ పక్షి అంతకంతకు కిందకు వస్తోంది.

"ఈ పక్షి చాలా సాయం చేస్తోంది" ముసలోడు అన్నాడు. అదిగో అప్పుడే పడవ

వెనుక ఉన్న గాలం తీగ గట్టిగా నిటారుగా అయ్యింది. సముద్రంలో దానిని ఏదో లాగుతోంది. ఈ తీగ చుట్ట ముసలోడి కాలి కింద ఉంది. వెంటనే తన చేతిలోని తెడ్లను వదిలేసి ఆ గాలం తీగను గట్టిగా పట్టుకుని పైకి లాగటం మొదలుపెట్టాడు ముసలోడు. ట్యూనా ఇలా తీగను కిందకు లాగటం మూలంగా అది ఒక రాయి బరువును కట్టి వేలాడదీసిన తీగకు మల్లే కదులుతోంది. అతడు తీగను పైకి లాగుతున్న కొద్దీ దాని గుంజుడు ఎక్కువయ్యింది. ట్యూనా చేప నీలపు రంగు వీపు, బంగారు రంగులో ఉన్న పక్క భాగాలు అతడికి నీళ్ళలో కనపడుతూనే ఉన్నాయి. ముసలోడు ఆ చేపను కింద నుంచి పక్కకు తోసి పడవలోకి లాగేశాడు. ఈ చేప గాబరాపడిపోయి బుల్లెట్ లాగా గట్టిగా అయిపోయింది. ఎండలో అలా పడవ వెనుక పడి బెరుకు బెరుకుగా చూస్తోంది. తన శక్తి కొద్దీ పడవ బల్లకేసి కొట్టుకుంటూ ఇంతింత తెలివి తక్కువ కళ్ళేసుకుని చూస్తూ చక్కటి తన తోకను అటూ ఇటూ ఆడిస్తోంది. అలా వణుకుతున్న ఆ చేపను చిన్నగా తన్ని భయపడొద్దన్నట్టుగా దాని తల మీద చెయ్యి పెట్టి ప్రేమగా దువ్వాడు ముసలోడు. అయినా ఇంకా అది పడవ వెనుక నీడలో పడి భయంతో వణుకుతూనే ఉంది.

"ఇది అల్బకోర్. పది పౌండ్ల బరువున్న ఈ చేప చాలా మంచి ఎరగా పనికొస్తుంది" అతడు పెద్దగా అనుకున్నాడు.

ముసలోడు ఒంటరిగా ఉన్నప్పుడు అలా తనకు తానే పెద్దగా మాట్లాడుకోవటం ఎప్పటి నుంచి మొదలైందనే విషయం అతడికి గుర్తేలేదు. ఇంతకు ముందు రోజుల్లో ఓడలను నడుపుతూ డ్యూటీలో ఉన్నప్పుడు గానీ, తాబేళ్ళ పడవల్లో ఒంటరిగా ప్రయాణించేటప్పుడు గానీ అతను పాటలు పాడుతూ ఉండేవాడు. బహుశా ఆ పిల్లోడు తనను వదిలిన తర్వాత నుంచి ఒంటరిగా ఉన్నప్పుడు ఇలా తనలో తాను మాట్లాడుకునే అలవాటు మొదలయ్యిందేమో. అయితే అతడికి ఇదంతా గుర్తులేదు. అతడు, ఆ పిల్లోడు ఇద్దరూ కలసి చేపలు పట్టేటప్పుడు అవసరం ఉంటేనే మాట్లాడేవారు. రాత్రి పూట కానీ లేదా తుఫాను వాతావరణం ఉన్నప్పుడు కానీ వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండేవాళ్ళు. సముద్రంలో ఉండగా అవసరం లేనప్పుడు మాట్లాడకుండా ఉండటం అనేది ఒక మంచి పద్ధతని అనుకుంటారు. ముసలోడు దీన్ని గౌరవించి తుచ తప్పకుండా ఆచరిస్తాడు. కానీ అక్కడ తన మాటలు విని ఆట పట్టించే వాళ్ళు ఎవరూ లేకపోవటంతో తనలో మెదిలే ఆలోచనలను, తన భావాలను ముసలోడు చాలా సార్లు పెద్దగా పైకి అనేవాడు.

"ఒక్కడినే ఇలా పెద్దగా మాట్లాడటం ఎవరన్నా వింటే నన్ను పిచ్చివాడి కింద లెక్కేస్తారు" పెద్దగా అన్నాడు. "కానీ నేను పిచ్చివాడ్ని కాననే నిజం నాకు తెలుసు కాబట్టి ఎవరేమన్నా

నేను పట్టించుకోను. ధనవంతులు పడవల్లో బేస్ బాల్ గురించి వినటానికి, ఇతర అవసరాల కోసం రేడియోల్లో మాట్లాడుతుంటారు."

బేస్ బాల్ గురించి ఆలోచించటానికి ఇది సమయం కాదని అనుకున్నాడు. ఇది ఒకే ఒక విషయాన్ని గురించి ఆలోచించాల్సిన సమయం. నా పుట్టుక ఉద్దేశమే అది. ఆ కనబడే చేపల గుంపు దగ్గరలో ఒక పెద్ద చేప ఉండి ఉండొచ్చు అని అనుకున్నాడు ముసలోడు. అలాంటి పెద్ద చేప ఈ గుంపును తింటూ ఉండి ఉండొచ్చు. తను పట్టిన ఈ అల్బాకోర్ దాని బారి నుంచి తప్పించుకోటానికి దారి తప్పి తనకు చిక్కింది. బుడ్డి చేపలు వేగంగా చెదిరి పోయాయి. ఈ రోజు ఏమిటో నీళ్ళ ఉపరితలం మీద కనబడే ప్రతిదీ కూడా చాలా వేగంగా ఈశాన్యం వైపు మరలి వెళుతోంది. రోజూ ఈ సమయానికి ఇలానే ఉంటుందేమో లేదా ఇదంతా వాతావరణానికి సంబంధించి నాకు తెలియని ఏదైనా ఒక సూచనా?

ఇంతకు ముందు పచ్చటి గీతలా కనబడుతూ ఉన్న తీరం ఇప్పుడు తనకు కనపడటం లేదు. తెల్ల దుప్పటి కప్పుకొన్నట్లు మంచుతో కప్పబడి ఉన్న నీలి కొండల శిఖరాలు, మంచు పర్వతాలకు మల్లే వాటి పైన నిలిచిన మేఘాలు మాత్రమే ఇప్పుడు అతని కళ్ళకు కనపడుతున్నాయి. సముద్రాన్ని చీకటి అలుముకుని ఉన్నట్లు అగపడుతోంది. నీటి మీద పడిన కాంతి రంగురంగుల పట్టకాలుగా కనిపిస్తోంది. నీటిలో మైలు దూరం లోతుకు చేరిన తన గాలాల తీగలను ముసలోడు తదేకంగా చూడసాగాడు. ఇంతకు ముందు కనబడుతుండిన నాచు, చెత్త చెదారం తాలూకు లెక్కలేనన్ని రూపాలు అంతకంతకు పెరుగుతున్న సూర్యుని కాంతి మూలంగా తమ తాత్కాలిక మెరుపుల ఉనికిని కోల్పోయాయి. వాటి స్థానంలో ఇప్పుడు కేవలం చిక్కని నీలి వర్ణంలో ఉన్న నీటిలో కేవలం చాలా లోతు దాకా పట్టకాలే కనబడుతున్నాయి.

జాలరులు ట్యూనా జాతికి చెందిన అన్ని చేపలను ట్యూనా చేపలనే వ్యవహరించేవారు. వాటిని బయట మార్కెట్టులో అమ్మేటప్పుడో లేదా ఎరల నిమిత్తం మరో రకం చేపలతో వాటిని ఇతరులతో మారకం చేసేటప్పుడో వాటి అసలు పేర్లతో పిలిచేవారు. అలాంటి ఈ ట్యూనాలన్నీ కూడా మళ్ళీ ఇప్పుడు నీటి అడుగు భాగానికి చేరిపోయాయి. సూర్యుడు అంతకంతకు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఆ ఎండకు ఏ ఆచ్ఛాదనా లేని ముసలోడి మెడ కాలిపోతోంది. తెడ్లు వేస్తూ పడవను నడుపుతున్న ఆ ముసలోడికి పైనుంచి కింది దాకా చెమట ధారలుగా కారుతోంది.

ఈ ఎండలో ఇంకా ఈ పడవను నెట్టటం తన వల్ల కాదేమో. పడవను అలా నీళ్ళ వాటుకి వదిలేసి కొంచెం సేపు నిద్రపోతే బాగుంటుంది. గాలం తీగను ఒకదాన్ని తన

బొటన వేలికి చుట్టుకుని పడుకుంటే ఒక వేళ ఏదన్నా చేప పడితే తనకు మెలకువ వచ్చేస్తుంది. ఇలా అనుకోసాగాడు ముసలోడు. అయితే అంతలోనే తట్టింది ఇది ఎనభై ఐదో రోజని, ఈ రోజు తాను చేపలు పట్టటం మీదే దృష్టి పెట్టాలని.

అలా తన గాలాల మీద దృష్టి పెట్టి చూస్తున్న అతడు అంత దాకా పైకి కనబడుతూ ఉన్న ఈటె కర్ర పచ్చ రంగు కొన గబుక్కున మునిగినట్టు చూశాడు.

"ఆ.. అదీ..." అనుకుంటూ ముసలోడు తన చేతిలోని తెడ్లను పడవ మీద పడేసి ఒక తీగను తన కుడి చేతి బొటన వేలుకు, చూపుడు వేలుకు మధ్యలో మృదువుగా పట్టుకున్నాడు. అయితే ఆ తీగ బరువుగా ఉన్నట్లు గానీ కింద నుంచి దాన్ని లాగుతున్నట్టుగా గానీ అతనికి అనిపించలేదు. దాన్ని అతను అలానే పైపైన పట్టుకుని ఉన్నాడు. కర్ర పచ్చ కొన మళ్ళీ కొంచెం పైకి తేలింది.

ఈసారి అంత పెద్దగా గట్టిగా లేదు కానీ లాగుదామా వద్దా అని లాగినట్లు అనిపించింది. ఆ లాగుడుకు అర్థమేమిటో అతడికి తెలుసు. ఆరు వందల అడుగుల లోతున గాలం ముల్లు మధ్య భాగాన గుచ్చబడిన చిన్న ట్యూనా తలని, ముల్లు చివరి కొసన గుచ్చి ఉంచిన కవడ చేపలను ఒక మార్లిన్ తింటోంది.

ముసలోడు తన ఎడమ చేత్తో ఆ తీగను నెమ్మదిగా మృదువుగా పట్టుకుని దాన్ని కర్ర నుంచి వేరు చేశాడు. తీగ ఊగుతున్నట్టుగా కింద ఉన్న చేపకు ఏ మాత్రం అనిపించకుండా ఉండేలా దాన్ని ఇప్పుడు ముసలోడు తన వేళ్ళ మధ్య నుండి కొంచెం కొంచెం నీళ్ళలోకి వదులుతున్నాడు.

ఈ నెలలో ఇప్పటి దాకా కూడా ఇదే పెద్ద చేప అయి ఉంటుంది, ముసలోడు అనుకున్నాడు. "ముల్లుకున్న పిల్లకాయలను తినేసెయ్ మార్లిన్, నీ కడుపారా ఆరగించేసెయ్" ముసలోడు తనలో తాను అనుకుంటున్నాడు. "చీకటిమయంగా ఆరు వందల అడుగుల లోతున ఉన్న చల్లటి నీళ్ళలో నువ్వు చాలా తాజా చేపలను తినేసెయ్. ఒక్కసారి వాటిని వదిలి మరు నిముషంలో మరలిరా వాటిని కొరికేసుకుందువుగాని."

మరొక్కసారి చిన్నగా లాగుతున్నట్టు అతడికి అనిపించింది. మళ్ళీ వెంటనే ముల్లుకు చుట్టుకుని తొందరగా రాకుండా ఉన్న కవడ చేప తలను చాలా గట్టిగా లాగినట్టు అనిపించింది. ఆ తర్వాత ఏ కదలికా లేదు.

"మళ్ళీ కదిలించు" ముసలోడు పెద్దగా అన్నాడు. "మళ్ళీ ఇంకోసారి ముల్లుకేసి చూడు. దానిని వాసన చూసినా సరిపోద్ది. అవి రుచిగా లేవూ? ముందా కవడ చేపను తినేయ్. దాని తర్వాత ట్యూనా ఉంది. గట్టిగా, చల్లగా చూడచక్కగా ఉంటుంది. ఏ మాత్రం సిగ్గు పడొద్దు, మార్లిన్. బుగ్గనిండా కొరుక్కో."

ఆ తీగను తన వేళ్ళ మధ్య పట్టుకుని మధ్య మధ్యలో ఏవన్నా చేపలు ఇతర తీగలను లాగుతున్నాయేమోనని వాటి మీద కన్నేసి వేచి చూడసాగాడు. అప్పుడు మళ్ళీ చిన్న పాటి లాగుడు మొదలయ్యింది.

"ఈ సారి మాత్రం మొత్తం తినేస్తుంది" ముసలోడు ఆశగా బిగ్గరగా అరిచాడు. "దేవుడా మొత్తం తినేసేలా దానికి సహాయం చెయ్యి."

తన ప్రార్థన ఫలించలేదు. దానిని ముట్టినట్టు లేదు. ఆ చేప వెళ్ళిపోయింది. ముసలోడు శూన్యంలోకి చూశాడు.

"అది అలా గాలాన్ని ముట్టకుండా వెళ్ళి ఉండదు" నమ్మలేనట్టుగా అనుకున్నాడు ముసలోడు. "క్రీస్తుకు తెలుసు అది వెళ్ళి ఉండదు. ఊరికే గాలి పీల్చుకోవటానికి వదిలి ఉండొచ్చు. బహుశా ఇంతకు ముందు తాకిన ఎరలే కాబట్టి వాటికి సంబంధించి ఏదో గుర్తుకొచ్చి ఆలోచిస్తూ ఉండి ఉంటుంది."

ఇంతలోనే తీగను మృదువుగా లాగుతున్నట్టు అనిపించి చాలా ఆనందపడ్డాడు.

"మళ్ళీ తిరిగి వచ్చేసింది" పరవశంతో అన్నాడు ముసలోడు.

అలా చిన్న చిన్నగా లాగుతుండటంతో ముసలోడికి చాలా సంతోషం వేసింది. ఇంతలోనే చాలా గట్టిగా నమ్మశక్యం కానంత బరువుగా లాగుతున్నట్టు అనిపించింది. అది ఖచ్చితంగా గాలానికి చిక్కుకున్న చేప బరువే. అత్యవసరంలో ఉపయోగించటం కోసం తీగకు కట్టి ఉంచిన రెండు తీగచుట్టల పొడవును అలా నీళ్ళలోకి వదిలేశాడు.

అతడు చాలా గట్టిగా తన శక్తినంతా కూడగట్టుకుని ఆ తీగను పట్టుకుని ఉన్నాడు. అయినా అతని వేళ్ళ మధ్య నుంచి ఆ తీగ జారటం ఆ చేప బరువును, సైజుని సూచిస్తోంది.

"ఆహా ఏం చేప" అతను సంభ్రమంగా అన్నాడు. "ముల్లు ఇప్పుడు దాని నోట్లో దవడల మధ్య ఉంది. ఇప్పుడు అది దవడల నుంచి జారి ఉంటుంది."

మళ్ళీ దాన్ని తిరిగి మింగుతుంది అని అనుకున్నాడే గానీ ఆ మాటను పైకి అనలేదు. మంచి మాటలను పైకి అంటే అవి జరగకపోవచ్చు అనే నానుడి అతనికి తెలుసు. అది ఎంత పెద్ద చేప అయి ఉంటుందో తనకు తెలుసు. ట్యూనాను నోట కరచుకుని అది ఆ చిమ్మ చీకట్లో నీటి అడుగున దూరంగా వెడలిపోతుంది అని అతను అనుకున్నాడు. ఆ క్షణంలో వెంటనే దాని కదలికలను ఆపాలనుకున్నాడు. కానీ అది ఇంకా చాలా బరువుగా ఉంది. అలా ఆ బరువు పెరుగుతూ పోతోంది. ఇతను తీగను మరింతగా వదులుతూ పోతున్నాడు. ఒక్క క్షణం పాటు అతను తన రెండు వేళ్ళతో తాడును అదిమి పట్టాడు. బరువు అంతకంతకు పెరిగి తీగ లోపలకు కిందకు వెళ్ళిపోతోంది.

"గాలం ముల్లు మొత్తాన్ని నోట పెట్టుకుంది" అతను అన్నాడు. "దానిని నింపాదిగా చక్కగా తిననిద్దాం."

కుడి చేతి వేళ్ళ మధ్యలో ఉన్న తీగను కొంచెం వదులు చేసుకుని ఎడమ చేయి చాపి అల్లంత దూరంలో పడి ఉన్న రెండో తీగ చివర ముడేసి ఉన్న రెండు ఖాళీ తీగ చుట్టలను అందుకున్నాడు.

ఇప్పుడు ముసలోడు రెట్టింపు జాగ్రత్తతో సిద్ధంగా ఉన్నాడు. ప్రస్తుతం తను ఉపయోగిస్తున్న చేతిలోని తీగే కాకుండా అదనంగా ఇంకా రెండు వందల నలభై అడుగులేసి పొడవున్న మూడు తీగ చుట్టలు అతని దగ్గర ఉన్నాయి.

"ఇంకా కొంచెం తిను" అతను లాలనగా అన్నాడు.

తిను తిను అట్లా తింటేనే గాలం ముక్కు చక్కగా నీ గుండెల్లో దిగి నిన్ను చంపేస్తుంది అని అనుకున్నాడు. అలా చచ్చి నింపాదిగా పైకి వస్తే నీలోకి బల్లేన్ని చక్కగా దింపొచ్చు. సరే. ముగించేశావా? నోరారా కడుపారా తిన్నావా?"

"ఇక కాచుకో" అని బిగ్గరగా అంటూ ముసలోడు తన శరీరంలోని శక్తినంతా రెండు చేతుల్లోకి తెచ్చుకుని పడవ అంచుకు వంగి చేతులను మార్చి మార్చి తీగను పైకి లాగటం మొదలు పెట్టాడు.

ఇంత కష్టపడినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆ చేప నింపాదిగా పక్కకు జరిగింది. ముసలోడు ఒక్క అంగుళం కూడా దాన్ని పైకి లేపలేకపోయాడు. ఆ గాలం తీగ కూడా పెద్ద చేపలను పట్టటం కోసం తయారు చేసిందే. చాలా గట్టిది. అతను కూడా ఆ తీగను చాలా గట్టిగా బిగించి పట్టి లాగాడు. ఆ బిగింపుకు తాడుతో పాటుగా పైకి లేచిన నీళ్ళు ధారా పాతంగా కిందకు పడిపోయాయి.

అతడి లాగుడికి ఆ తీగ నీళ్ళలో సుయ్‌మని శబ్దం చేయటం మొదలుపెట్టింది. అతను దాన్ని ఇంకా గట్టిగా కాళ్ళు బిగించి వెనక్కు వాలి పట్టి లాగుతున్నాడు. పడవ నెమ్మదిగా ఈశాన్యం వైపు కదలటం మొదలయ్యింది.

ఆ చేప క్రమంగా నిశ్చలంగా నిశ్శబ్దంగా ఉన్న నీటిలోకి కదలిపోతోంది. గాలం కొక్కేనికి ఉన్న వేరే ఎరలు నీళ్ళలో అలానే ఉన్నాయి. వీటి వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదు.

"ఇలాంటి పరిస్థితిలో పిల్లోడు నాతో ఉండి ఉంటే ఎంత బాగుండేదో" అతను నిరాశగా పెద్దగా అన్నాడు. నేను చేపను పైకి లాగుదామనుకుంటే అది నన్ను లాక్కుపోతోంది. గాలం తీగను గట్టిగా బిగించి కట్టి ఉంచగలను. కానీ చేప దాన్ని తెంపుకుని వెళ్ళగలదు. ఇప్పుడు నేను చేయాల్సింది.. దాన్ని పట్టుకుని ఉండటమే.

దానికి కావలసినంత తీగను ఇవ్వటమే. ఇంకా నయం ఆ చేప అలా సమతలంగా ప్రయాణిస్తూ వెళుతోంది కానీ నీళ్లలో కిందకు వెళ్ళలేదు."

"ఆ చేప అలా తీగను నోట కరుచుకుని కిందికి వెళ్ళాలనుకుని ఉంటే నేను ఏం చేయగలిగి ఉండేవాడ్నో నాకు తెలియదు. అది ఒక వేళ పెద్దగా అరిచి చచ్చిపోయినా నేను ఏం చేయగలిగి ఉండేవాణ్నో కూడా తెలియదు. కానీ నేను ఏదో ఒకటి చేయాలి. నేను చేయగలిగే పనులు చాలా ఉన్నాయి."

అతడు తన చేతిలోని తీగను అలా పట్టుకుని నీళ్ళలోపల భాగంలో ఉన్న తీగ వంపును చూస్తూ ఉన్నాడు. ఆ విధంగా పడవ ఈశాన్యం వైపు నెమ్మదిగా కదలిపోతోంది.

ఇలా పడవను లాక్కెళ్లే పని ఆ చేపను చంపేస్తుందని ముసలోడు అనుకున్నాడు. ఆ చేప ఎంతోసేపు ఇలా లాక్కెళ్లలేదనుకున్నాడు. కానీ నాలుగు గంటల తర్వాత కూడా ఆ చేప తన పడవని సముద్రంలో లాక్కెళుతూ అలుపు లేకుండా స్థిరంగా ఈదుతూనే ఉంది. ముసలోడు ఇంకా ఆ గాలాన్ని తన వీపు చుట్టూ చుట్టుకుని అలా గట్టిగా పట్టుకునే ఉన్నాడు.

"ఎప్పుడో మధ్యాహ్నం అనగా ఆ చేప నా గాలానికి చిక్కింది. అయినా అది ఇంకా నాకు కనిపించలేదు" అతను అనుకున్నాడు.

ఆ చేప గాలానికి చిక్కక ముందు ముసలోడు ఎండ నుంచి తప్పించుకోవటానికి తన ఈనల టోపీని గట్టిగా నొసలు మీదకు లాక్కున్నాడు. అది కోసుకుని దాని తాలూకు నొప్పి ఇప్పుడు తెలుస్తోంది. అతడికి దాహం కూడా వేస్తోంది. ఒక చేత్తో అలా తీగను పట్టుకునే దాని మీద కాలుపడి జారి పడకుండా జాగ్రత్తగా ఎంతవరకు పోగలదో అంతవరకు తన రెండో చేతిని చాపి పడవ వెనుక పక్కన ఉన్న మంచి నీళ్ళ సీసాను అందుకున్నాడు. మూత తీసి కొంచెం తాగాడు. తర్వాత పడవ వెనుక బల్లకు ఆనుకున్నాడు. ఇంకా కిందే పడి ఉన్న చాప కర్ర మీద కూర్చున్నాడు. ఏ ప్రాపంచిక విషయాన్ని గురించి లేదా స్వీయ జీవిత అనుభవాల గురించి గానీ ఆలోచించకుండా అలా తనకు ఎదురవుతున్న ప్రతి బాధను కష్టాన్ని భరించగలిగే ఒక అనిశ్చల మనో స్థితిని, స్థితప్రజ్ఞతను సాధించే పనిలో నిమగ్నమై ఉన్నాడు.

అలా నిమగ్నమై ఉన్న అతడు ఒక్కసారి వెనక్కు తిరిగి తన చూపు ఆనినంత మేర భూప్రాంతం కనపడక పోవటాన్ని గమనించాడు. భూమి కనబడినా కనబడకపోయినా తన వరకు పెద్ద తేడా ఏమీ లేదనుకున్నాడు. "నేను ఎప్పుడూ కూడా హవానా వెలుగులు విరజిమ్మే సమయానికి వెనక్కు చేరుకోగలను" ముసలోడు అనుకున్నాడు. "సూర్యాస్తమయానికి ఇంకా రెండు గంటల సమయం ఉంది. బహుశా ఈ లోపే చేప

పైకి రావచ్చు. ఒక వేళ ఈ లోపు కనబడకపోతే చంద్రుడితో పాటుగా బయటకు రావొచ్చు. అప్పుడు కూడా రాకుంటే బహుశా తర్వాతి రోజు సూర్యోదయంతో పాటుగా రావొచ్చు. నాకు తిమ్మిర్లు నొప్పులేమీ లేవు. వేచి చూసే ఓపిక ఇంకా ఉంది. నాకేం పర్లేదు. నోట్లో గాలం ఇరుక్కున్నది చేపకే. కానీ అంత గట్టిగా లాగేస్తోంది.. ఎలాంటి చేప అది! తీగను తన నోటిలోకి లాక్కున్న వెంటనే గట్టిగా నోరు మూసుకుని బిగబట్టి ఉండి ఉండాలి. అది అలా నేర్పుగా ఎలా చేయగలుగుతుందో నేను కూడా చూడగలిగితే ఎంత బాగుండు. అలా ఒక్కసారి దానిని నేను చూడగలిగితే.. నేను దేనితో పోరాడుతున్నానో తెలిసేది."

ముసలోడు నక్షత్రాలను అనుసరించి వేసిన అంచనా ప్రకారం.. ఆ రాత్రంతా కూడా ఆ చేప గమనంలో గానీ దిశలో గానీ ఎలాంటి మార్పులేదు. సూర్యుడు కొండల మాటుకు దిగిపోయిన తర్వాత కొంచెం చలి మొదలయ్యింది. ఆ చలికి తన వీపు మీద, చేతుల మీద, వడిలిపోయిన తోటకూర కాడల మాదిరిగా ఉన్న తన కాళ్ళ మీద ఇంతకు ముందు పట్టిన చెమటంతా మేట వేసిన ఉప్పులాగా ఆరిపోయి ఎండిపోయింది. పొద్దుట్నుంచి ఎరల పెట్టె మీద కప్పి ఉంచిన గోతాం పట్టాను మధ్యాహ్నం తీసి ఎండలో ఆరేశాడు. దాన్ని తన భుజం మీద ఉన్న గాలం తీగను తప్పించి పైకి తీసి జాగ్రత్తగా తన భుజాల మీదుగా వీపు నిండా కప్పుకున్నాడు. ఇప్పుడు గోతాం పట్టా భుజం మీద గాలం తీగ ఒరిపిడికి మంటెత్తకుండా మెత్తగా దాని కింద దిండులా ఉంది. కాబట్టి ఈటె కర్రను పట్టుకుని ముందుకు ఒంగేటప్పుడు కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది కానీ ఏళ్ళ తరబడి తనకు అలవాటైన పని కాబట్టి అతనికి దాదాపు సౌకర్యవంతంగా ఉన్నట్లు తోస్తోంది. తను పైకి ఎర దగ్గరకు రాకుండా ఉన్నంత సేపూ నేను ఆ చేపను కానీ ఆ చేప నన్ను కానీ ఏమీ చేయలేం.

ముసలోడు ఒక్కసారి పైకి లేచి పడవ అంచు వెంట నుంచుని ఒంటేలు పోసుకుని అలా నక్షత్రాల వైపు చూసి మళ్ళీ తన పడవ వాటి దిశను అనుసరించి వెళుతోందో లేదోనని తరచి చూసుకున్నాడు. తన భుజాల నుంచి నీటిలోకి వేలాడుతున్న గాలం తీగ ఒక ప్రకాశవంతమైన మెరుపు తీగలా కనపడుతోంది. ఇంకా హవానా కాంతులు తన కళ్ళ కనబడలేదంటే పడవ చాలా నెమ్మదిగా కదులుతున్నట్టు అతడికి అనిపించింది. అంటే దీనర్థం సముద్ర ప్రవాహం తనను తూర్పు దిక్కుగా తీసుకెళుతోంది. ఈ దరి దాపుల్లో కూడా హవానా వెలుగులు కనబడకపోతే మరింత ఎక్కువగా తన పడవ దిశ తూర్పు దిక్కుకు మరలుతోందని అతను అనుకున్నాడు. ఎందుకంటే చేప తాను ఊహించిన దిశలోనే గంటల కొద్దీ ప్రయాణిస్తూ ఉంటే అది నాకు కనబడుతూ

ఉండాలి. ఈ రోజు గ్రాండ్ లీగుల్లో బేస్ బాల్ ఆటలో విజయం ఎవరిని వరించి ఉంటుందో. తనకు కూడా రేడియో ఉండి ఉంటే ఈ పాటికి ఆట గురించిన వివరాలు తనకు తెలిసి ఉండేవి. ముసలోడి ఆలోచనలు ఇలా కొనసాగాయి. ఇంతలోనే తనకు గుర్తుకు వచ్చింది. "ఇప్పుడు నేను చేస్తున్న పని మీదే ఏకాగ్రత నిలవాలి. నా ఆలోచనలన్నీ దాని చుట్టే తిరుగుతుండాలి. అంతకు మించి వేరే పిచ్చి ఆలోచనలు ఉండకూడదు" అని అనుకున్నాడు.

"పిల్లోడు ఇక్కడ ఇప్పుడు నాకు తోడుగా ఉండి ఉంటే బాగుండేది. నాకు సహాయంగా ఉండటమే కాక ఇక్కడ ఏమేం జరుగుతోందో చూసి ఉండేవాడు" అని పెద్దగా అన్నాడు ముసలోడు.

అతడికి అనిపించింది, జీవితం ఆఖరి చరమాంకంలో ఎవ్వరూ కూడా ఒంటరిగా మిగిలిపోకూడదు. వారికి తోడుగా ఎవరో ఒకరు ఉండాలి. కానీ పరిస్థితులు మన చేతిలో ఉండవు. ఎలా జరగాలో అలా జరిగి తీరుతుంది. కొంచెం ఓపిక తెచ్చుకోవటం కోసం పొద్దున తాను పట్టుకున్న ట్యూనా చేపను తినాలి అనే విషయాన్ని మరచిపో కూడదు. లేకపోతే అది ఎందుకూ పనికిరాకుండా పాడవుతుంది. పొద్దున్నే లేచి తాను తినగలిగినంత ఎంతో కొంత తినాలి. ఈ విషయం మర్చిపోకూడదు అని ఇలా తనలో తాను అనుకున్నాడు.

రాత్రి వేళ రెండు తూరమీనలు తన పడవ చుట్టూ చేరి దొర్లటం, బుసలు కొట్టటం ముసలోడు విన్నాడు. మగ తూరమీను బుసలు కొట్టటం ద్వారా చేసే శబ్దాలు, ఆడ తూరమీను విడిచే నిట్టూర్పుల శబ్దాల మధ్య తేడాను ముసలోడు చాలా సులువుగా గుర్తించగలడు.

"ఇవి చాలా మంచివి. అవి ఎప్పుడూ ఒక దానితో ఒకటి ఆడుకుంటూ, సరసమాడుకుంటూ, ప్రేమించుకుంటూ ఉంటాయి. పిచ్చక మీనలకు మల్లేనే ఇవి కూడా మన సహోదరులు" ముసలోడు అన్నాడు.

తర్వాత తన గాలానికి చిక్కిన పెద్ద చేప మీద జాలి పడటం మొదలుపెట్టాడు. దాని వయసెంతో తెలీదు కానీ అది మాత్రం చాలా అద్భుతమైనది. చాలా శక్తి కలిగినది కూడా. ఇంత శక్తి ఉండి ఈ విధంగా వింతగా ప్రవర్తించిన చేపను తను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. బెదిరిపోయి ఎగరకుండా తెలివిగా ఎలా తప్పించుకోవాలో బహుశా దానికి బాగా తెలుసు. ఒక వేళ ఆ చేప కనుక బలం కొద్దీ వేగంగా దూకి ఉన్నట్లయితే తను నాశనం అయిపోయి ఉండేవాడు. కానీ బహుశా ఇదంతా ఆలోచిస్తోంటే ఇంతకు ముందు చాలా సార్లు కొక్కేలకు చిక్కి తప్పించుకున్న అనుభవం ఈ చేపకు

ఉన్నట్లు తోస్తోంది. తను చిక్కకుండా తప్పించుకుని కొత్త పద్ధతుల్లో ఎదుటి వాళ్ళను ముప్పుతిప్పలు ఎలా పెట్టాలో దానికి మాబాగా తెలుసు. కానీ దాన్ని పట్టుకోవాలని ప్రయత్నం చేస్తున్నది ఒకే ఒక్క మనిషని అది కూడా ఒక ముసలి అర్భకుడని దానికి తెలిసే పరిస్థితి లేదు. కానీ అబ్బా అదెంత గొప్ప చేప. ఒక వేళ దాని మాంసం బాగుంటే మాత్రం మార్కెట్లో దాని విలువ ఎంతుంటుందో ఊహించటం కష్టం. గాలం కొక్కేనికున్న ఎరను ఒక మగాడికి మల్లే కొరికింది, తాడుని నోటిలో పెట్టుకుని మగాడికి లానే లాగింది అలాగే దానిది అదురు బెదురు లేని పోరాటం. కొక్కేన్ని తెంచుకుని పోవటం వెనుక దానికి ఏమన్నా ప్రత్యేకమైన ప్రణాళికలు ఉన్నాయా లేక కేవలం నాకు మల్లేనే దొరికిందానితో సరిపుచ్చుకుందాం అనుకునే ఒక నిరాశా పూరితమైన ఆలోచనా?

ఒకసారి మార్లిన్ జంటలో ఒక దాన్ని ఎలా గాలం వేసిపట్టాడో తనకు గుర్తొచ్చింది. ఎప్పుడు కూడా మగ చేప ఆడ చేపను ముందు తిననిస్తుంది. ఆ విధంగా ఈ ఆడ చేప ఆహారం కోసం వచ్చి పాపం గాలం ముల్లుకు చిక్కుకుంది. ఇక చూడు దాని తిప్పలు వర్ణనాతీతం. ఎంతో భయపడింది. గాభరాపడింది. అటు ఇటు కొట్టుకుని అలసిపోయింది. ఇది జరుగుతున్నంత సేపు ఆ మగ చేప దానితో పాటే దొర్లుతూ, తిరుగుతూ, కిందకు పైకి కదులుతూ దానిని అంటి పెట్టుకుని ఉంది. ఆ ఆడ చేపతో పాటే అలా ఉన్న ఆ మగ చేప గాలం తీగను కొరికేస్తుందేమోనని తను తెగ భయపడ్డాడు. ఎందుకంటే దాని తోక కొడవలి ఆకారంలో దాదాపు అంతే పరిమాణంలో అంతే పదునుగా ఉంది. అలా ఆ ఆడ చేపను ముసలోడు బల్లెంతో పొడిచి, దుడ్డు కర్రతో మోదాడు. మెరుగు కాగితంతో రంపం పైన పట్టుకుని దానితో దాని తల మీద కొట్టాడు. చేప అసలు రంగు నుంచి అద్దం వెనుక పూసే ముదురు ఎరుపు రంగులోకి మారే దాకా కొట్టాడు. తర్వాత పిల్లోడి సాయంతో దాన్ని పడవ మీద కొయ్యకు వేలాడదీశాడు. ఇది జరుగుతున్నంత సేపు పాపం ఆ మగ చేప పడవ పక్కనే బాధా తప్త హృదయంతో తల్లడిల్లుతూ చూస్తూ ఉండిపోయింది. తర్వాత ముసలోడు తీగలను సరి చేస్తూ ఈటె కర్రను తుడుస్తున్నాడు. ఇంతలో మగ చేప నీటిలో నుంచి పడవ పక్కగా పైకి ఎగిరి ఆడ చేపను ఎక్కడ పెట్టారో చూసి మళ్ళీ అంతే వేగంగా నీటిలోకి తన వంగపండు వన్నెలో ఉన్న రెక్కలను విప్పార్చి జుయ్యిమని వెళ్ళిపోయింది. అది అలా తన రెక్కలను విప్పార్చినప్పుడు కనిపించిన వాటి లోపలి భాగాన ఉన్న ధూమ్ర వర్ణ చారలను చూసి ముసలోడు ఆహా చాలా అందంగా ఉంది అనుకున్నాడు.

చేపలను పట్టే విషయంలో అది తన మనసును చాలా కలచివేసిన సంఘటన అనుకున్నాడు ముసలోడు. అది జరిగినప్పుడు పిల్లోడు కూడా చాలా బాధపడ్డాడు.

ఇద్దరూ కూడా జరిగిన దానికి తమను క్షమించమని ఆ చేపను వేడుకున్నారు. తర్వాత ఆ ఆడ చేపను చక్కగా కోసుకుని కడుపారా తిన్నారు.

"పిల్లోడు ఇప్పుడు ఇక్కడ ఉండి ఉంటే ఎంత బాగుండేది" అని ముసలోడు పెద్దగా అనుకుని పడవ వెనుక పెట్టి ఉన్న గుండ్రని పలకలకు ఆనుకుని కూర్చున్నాడు. చేప గాలం తీగను ఎంత బలంగా లాగుతుందో, తాను అనుకున్న పద్ధతిలోనే ఎలా కదులుతుందో తన భుజాల మీద పెట్టుకున్న గాలం కర్ర మూలంగా ముసలోడికి తెలుస్తోంది.

"ఇప్పుడు ఈ నా కుయుక్తుల మూలంగా దానికి దాని ఇష్టప్రకారం చేయటానికి వీలు లేదు. దాని ముందుంది ఒకే ఒక మార్గం" అని ముసలోడు తలచాడు.

"నా రకరకాల ఎత్తుగడలు, పన్నాగాల నుంచి తనను తాను రక్షించుకోవటానికి దాని ముందున్న ఒకే ఒక మార్గం చిమ్మచీకట్లు ముసురుకున్న నీటి అట్టడుగు భాగంలో మిగిలిపోవటం. అలాగే నాకున్న ఒకే ఒక మార్గం, బాహ్య ప్రపంచానికి సుదూరంగా ఉన్న దాని దగ్గరకు ఎలాగోలా చేరుకోవటం. మొత్తం ప్రపంచం నుంచి మేమిద్దరం విడిపోయాం. మధ్యాహ్నం నుంచి బాహ్య ప్రపంచంతో ఏ మాత్రం సంబంధం లేకుండా ఒకరికొకరం మరింత దగ్గరయ్యాం. మరో విషయం ఏమిటంటే, మా ఇరువురికి కూడా సహాయం చేయటానికి ఎవ్వరూ లేరు."

"బహుశా నేను జాలరి వృత్తిని ఎంచుకుని ఉండాల్సింది కాదు" అని అనుకున్నాడు. "కానీ చేసేదేముంది, నా పుట్టుక పరమార్థం చేపలు పట్టటమే. తెల్లారక ముందే ట్యూనాను తినేసెయ్యాలి. ఈ విషయం ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోకూడదు."

తెల్లారక మునుపే ఎప్పుడో కానీ తన వెనకున్న ఎరలలో నుండి ఒక దాన్ని ఏదో లాగేసింది. గాలం కర్ర విరిగిన శబ్దంతో పాటు పడవ అంచు మీద నుండి తీగ సర్రున జారి క్రింద పడినట్టుగా అతను విన్నాడు. ఆ చీకట్లో ఒక పక్క గాలం తీగకు వేలాడుతున్న చేప తాలూకు బరువును తన ఎడమ చేతి భుజం మీద మోస్తూనే కొంచెం వెనక్కు వంగి అతను పిడిలో నుంచి కత్తి బయటకు తీసి పడవ అంచు చెక్కకు ఆనించి తీగను కోశాడు. దగ్గరగా ఉన్న మరొక తీగను దొరకబుచ్చుకుని దాన్ని కూడా కోసేశాడు. ఆ చీకట్లోనే తముడులాడుకుంటూ విడిగా ఉన్న తీగలను దగ్గరకు తీసుకుని కాలితో అదిమి పెట్టి ఎంతో నేర్పుగా అదీ ఒక్క చేత్తోనే అతను గట్టిగా ముడేశాడు. ఇప్పుడు తన దగ్గర అదనంగా మరో ఆరు తీగలు ఉన్నాయి. తన దగ్గర తాను తెంపిన గాలాల తాలూకు రెండు, ఇంతకు ముందు చేప లాక్కెళ్ళిన ఎరల తాలూకు మరో రెండు తీగలు అన్నీ కలిపి కట్టేసి ఉన్నాయి.

తెల్లారిన తర్వాత రెండు వందల నలభై అడుగుల లోతునున్న ఎరకు కట్టేసి ఉన్న గాలం తీగను కూడా తెంపేసి అదనంగా ఉన్నతీగకు జత చెయ్యాలనుకున్నాడు. కొక్కేలు, మునుగర్రలతో పాటుగా పన్నెండు వందల అడుగుల మంచి ఖాటాలన్ తాడును తాను పోగొట్టుకోవలసి వచ్చింది. వాటినయితే తాను ఎలాగోలా సమకూర్చుకోగలడు. కానీ తీగను కొరికేసి పారిపోయిన చేపలను మళ్ళీ ఎలా సంపాదించుకోగలడు? ఇప్పుడు ఎరను కొరుక్కుని వెళ్ళిన చేప ఏ రకం చేప అయి ఉంటుందో తనకు అర్థం కావటం లేదు. అది మార్లిన్ అయి ఉండొచ్చు లేదా దూడబాతు లాంటి పెద్ద చేప కావొచ్చు లేదా సొర చేప అయినా అయ్యుండొచ్చు. అయితే దాని కదలికలకు సంబంధించిన స్పర్శ కూడా నాకు కలగలేదు. ఏదైతేనేం దానిని ఎలాగోలా సాధ్యమైనంత త్వరగా వదిలించుకోవాలి.

"పిల్లోడు నాతో పాటు ఉండి ఉంటే ఎంత బాగుండేదో" ముసలోడు మరోసారి గట్టిగా అన్నాడు. ఉంటే బాగుండేది అనేది వింటానికి బాగుంటుంది కానీ వాస్తవంలో అతను ఈ క్షణం ఇక్కడ ప్రత్యక్షం కావటం సాధ్యం కాదు కాబట్టి ప్రస్తుతం నువ్వొక్కడివే ఈ పనంతా చేసుకోవాలి. నీ ఈ పని చేసుకోవటానికి చీకట్లో ఏం చేస్తాం వెలుతురు వచ్చిన తర్వాత చేద్దాం అనుకోవటానికి కూడా వీలు లేదు. ముందు ఆఖరు గాలం తీగ మీద ధ్యాస పెట్టు. దాన్ని తెంపేసి అదనంగా ఉన్న రెండు తీగలకు కొక్కేలు తగిలించు. ఇలా సాగాయి ముసలోడి ఆలోచనలు.

అనుకున్నట్టుగానే పని మొదలుపెట్టాడు. ఇంత చీకటిలో పని చెయ్యటం కష్టమే. ఇంతలో చేప గాలం కొక్కేన్ని నోట్లో కరుచుకుని గట్టిగా లాగింది. ఆ ఉదుటుకు ముసలోడు బోర్లాపడ్డాడు. పడవ చెక్క ముఖానికి తగిలి కంటి కింద గాయమయ్యింది. రక్తం చెంపల మీదుగా చిన్న ధారలాగా కారింది. అయితే ఆ రక్తం ధార గడ్డం దాకా చేరేటప్పటికల్లా గాలికి గడ్డకట్టి పోయింది. ముసలోడు కొంచెం తెప్పరిల్లి నిదానంగా లేచి వెనక్కు వెళ్ళి దిమ్మకు ఆనుకుని కూలబడ్డాడు. భుజం మీద తీగ మూలంగా ఒరిపిడి తగలకుండా పెట్టుకున్న గోతాం పట్టాను ఒక సారి సర్దుకుని తీగను కొంచెం మెడ వైపుకు సరి చేసుకున్నాడు. మెడను కొంచెం భుజం వైపు వంచి తీగను గట్టిగా పట్టుకున్నాడు. ఇలా చేయటం మూలంగా చేప లాగుడు స్థాయి ఇప్పుడు కొంచెం బాగా అర్థం అవుతోంది. అంతే కాకుండా పడవ వెళ్ళే వేగం కూడా కొంచెం తెలుస్తోంది.

"ఆ చేప అలా ఎందుకు అకస్మాత్తుగా పక్కకు ఒరిగి తాడును అంత గట్టిగా లాగిందో అర్థం కావటం లేదు" అనుకున్నాడు ముసలోడు. "పెద్ద కొండ లాగా ఉండే చేప వీపు మీద నుంచి తీగ జారి పోయి ఉంటుంది. అయితే తీగ అలా జారటం మూలంగా నా

వీపు మండినంతగా తన వీపు మండి ఉండదు. ఈ చేప ఎంత బలంగలదైనప్పటికీ, గొప్పదైనప్పటికీ ఈ విధంగా పడవను ఎల్లకాలం లాగ లేదు. సముద్రంలో నన్ను ఇబ్బంది పెట్టగల వేరే తీగలను శుభ్రం చేశాను. ఇప్పుడు అవసరానికి మించినంత తీగ నా దగ్గరుంది. ఓ చేపా! నేను చచ్చే దాకా నిన్ను వదలను" అతను మెత్తని గొంతుతో బిగ్గరగా కేకేశాడు.

అది కూడా నాలానే భావిస్తూ ఉండొచ్చు అని అనుకుని ఉదయించే సూర్యుడు మోసుకొచ్చే నులి వెచ్చని లేలేత కిరణాల కోసం వేచి చూస్తున్నాడు. వేకువ జాము పిల్ల తెమ్మెరలు చలిని వెదజల్లుతున్నాయి. వెచ్చదనం కోసమని అతను చెక్కకు ఆనుకున్నాడు. చేప ఎంతసేపు ఓపికగా ఎదురు చూడగలదో నేను కూడా అంతసేపు వేచి చూడగలను అనుకున్నాడు. సూర్యుడి తొలి వెలుతురు భూమిని చేరే సమయానికి మొదటి గాలం తీగను నీళ్ళ లోపలికంటా చేరేలా దించాడు. పడవ మాత్రం నిమ్మళంగా నీటిపై వెళుతోంది. ఈ విధంగా మొదటిగా వదిలిన గాలం తీగ భానుని తొలి అంచు పైకి లేచే సమయానికి ముసలోడి కుడి భుజం మీద ఉంది.

"ఈ చేప ఉత్తర ముఖంగా సాగుతోంది" ముసలోడు అన్నాడు. నీటి ప్రవాహం తమ ప్రయాణాన్ని తూర్పుకు మళ్ళించొచ్చు. ఈ చేప కూడా తన గమనాన్ని మార్చుకుని ప్రవాహం వెంబడి కొనసాగితే బాగుంటుంది. అలా జరిగితే అది ఈది ఈది అలసిపోయిందని అర్థం. తర్వాత నా పని తేలికవుతుంది.

మరింత పొద్దెక్కే కొద్దీ తాను అనుకున్నట్లు ఆ చేప అలసిపోవటం లేదని ముసలోడికి అర్థమయ్యింది. అయితే అతడికి అనుకూలంగా ఉన్న ఒకే ఒక్క సూచన చేప మరీ లోతున కాకుండా నీటిలో పైపైనే ఈదుతున్నట్లు సూచిస్తున్న గాలం తీగలో వచ్చిన వంపు. దాని అర్థం అది తప్పకుండా పైకి వచ్చేస్తుందని కాదు గానీ అలా జరగటానికి అవకాశం మెండుగా ఉందని.

"దేవుడా! అది నీటిపైకి ఎగిరేలా చెయ్యి. దాన్ని అదుపులో ఉంచటానికి నా దగ్గర చాలినంత తీగ ఉంది" ముసలోడి మనసు ఉద్విగ్నతతో నిండిపోయింది.

బహుశా నేను తీగను కొంచెం పైకి బిగించి పట్టుకుంటే అది ఒరుచుకుని నొప్పికి పైకి ఎగురుతుందేమో అని అనుకున్నాడు. చీకటి తెరలు ఎప్పుడో చీల్చుకుపోయాయి. ఇప్పుడు ధారాళమైన వెలుగులు ప్రసరిస్తున్న పగలు. ఇప్పుడు ఈ చేప పైకి వస్తే అది మళ్లీ కిందకు వెళ్లకుండా గోతాములను గాలితో నింపి దాని వీపుకి తగిలిస్తా.

ఒక చివర చేప పట్టుకుపోయిన గాలం తీగను మరి కొంచెం గట్టిగా లాగటానికి అతడు ప్రయత్నించాడు. కానీ అప్పటికే బాగా బిగుతుగా తయారైన తీగ ఇంకేమాత్రం

లాగినా తెగిపోయేలా ఉంది. వెనక్కు వంగి తీగను లాగి పట్టుకున్న అతను ఇంకా చీమ తలంత గట్టిగా కూడా దానిని లాగలేనని అనుకున్నాడు. తన పట్టును ఏ మాత్రం సడలించినా మొదటికే ప్రమాదమని అతను అనుకున్నాడు. అలా సడలించినప్పుడల్లా చేప నోట్లో పట్టిన గాలం కొక్కెం మూలంగా ఏర్పడిన గాటు కొంచెం కొంచెం పెద్దదై చేప ఎగిరినప్పుడు తీగ జారి పోతుంది. ఇక చేప దానిని తోసేసి పారిపోవచ్చు. ఏదయితే ఏం కానీ ఎండ మూలంగా నాకు చాలా బాగుంది. నా ధ్యాసంతా చేప మీదే ఉండటం మూలంగా సూర్యుడి వైపు తిరిగి ఒక్కసారి కూడా చూడలేకపోయాను. ఈ విధంగా ముసలోడి ఆలోచనలు కొనసాగుతున్నాయి.

తీగకు చిన్న పసుపు రంగు నాచు కుప్ప పట్టుకుపోయి ఉండటం చూశాడు. ఈ నాచు కూడా తన స్థాయిలో చేపను పట్టి లాగటంలో తనకు సహాయం చేస్తుందనుకుని సంతోషించాడు. రాత్రంతా మెరుస్తూ ఉన్న పసుపు రంగు అఖాతపు నాచే ఇది.

"ఓ చేపా! నా బంగారు తల్లీ. నువ్వంటే నాకు చాలా ఇష్టం. ప్రేమ. గౌరవం కూడా. అయినా ఈ రోజు గడిచే లోపు నిన్ను చంపి తీరుతా" ముసలోడు ఇష్టంతో కూడిన కసితో అన్నాడు.

"అలా జరగాలని ఆశిద్దాం" కొంచెం నిరాశ ధ్వనించే స్వరంతో అన్నాడు ముసలోడు.

ఇంతలో ఉత్తరం వైపు నుంచి ఒక చిన్న పక్షి పడవ వైపు దారి తీస్తూ వచ్చింది. అది పాటలు నేర్చిన పక్షి. నీళ్ళ పైన తక్కువ ఎత్తులో ఎగురుకుంటూ వచ్చింది. ఆ పక్షి చాలా అలసిపోయినట్టుగా ముసలోడు గమనించాడు.

అలా వచ్చిన పక్షి పడవ చివర వాలింది. వెంటనే అక్కడ నుంచి లేచి ముసలోడి తల చుట్టూతా ఎగిరి తను పట్టుకుని ఉన్న తీగ మీద వాలింది. అక్కడ దానికి మరింత సౌకర్యవంతంగా అనిపించింది.

"నీ వయసెంత? సముద్రం మీదకు ఇలా రావటం మొదటి సారా?" ఆ పక్షిని ముసలోడు గోముగా అడిగాడు.

అలా అతడు తనతో మాట్లాడేటప్పుడు అది అతడినే చూస్తూ ఉంది. అది చాలా అలసిపోయి పడుతూ లేస్తూ వచ్చి హడావిడిగా వాలటం మూలంగా పట్టుకుదరక ఆ తీగ మీద తటపట లాడుతోంది.

"మరేం ఫర్లేదు ఈ తీగ గట్టిగానే ఉంది, చాలా గట్టిగా ఉంది. రాత్రంతా గాలి కూడా వీయలేదు. ఎదురు గాలికి ఎగిరొచ్చినట్టుగా నువ్వంత అలసిపోకూడదు. అయినా పక్షులు ఎందుకు సముద్రం మీదకు ఇలా ఎగురుకుంటూ వచ్చేది?" ముసలోడు ప్రేమగా అడిగాడు.

ఇలాంటి చిన్న పక్షుల కోసమే డేగలు సముద్రం మీదకు వస్తుంటాయి అనుకున్నాడు. ఈ విషయానికి సంబంధించి అతడు ఆ పక్షితో ఏమీ అనలేదు. అలా చెప్పినా ప్రయోజనం లేదు. ఎందుకంటే తానేం చెప్తున్నాడో అర్థం చేసుకోగల స్థితి గానీ వయసు గానీ ఆ పక్షికి లేవు. పోను పోను డేగలను గురించిన జ్ఞానం దానికి అనుభవం ద్వారా తెలిసి వస్తుంది అనుకున్నాడు.

"పిచ్చి పిట్టా, చక్కగా విశ్రాంతి తీసుకో. తర్వాత అందరు మనుషుల్లాగా లేదా పక్షుల్లా కాదంటే చేపల్లా నీ జీవన యానంలో నువ్వు కూడా నీ అదృష్టాన్ని పరీక్షించుకో" జ్ఞాన సారాన్ని ఉగ్గు పోస్తున్నట్టుగా చెప్పాడు ముసలోడు.

రాత్రి తన వీపు పట్టుకు పోయినప్పుడు మొదలైన నొప్పి ఇప్పుడు అతడిని మరింత బాధిస్తోంది. అయితే ఇలా బుల్లి పిట్టతో మాట్లాడటం తనకు ఉపశమనంగా అనిపిస్తోంది.

"పిట్టా, నీకిష్టమైతే నువ్వు మా ఇంట్లోనే ఉండు" అన్నాడు. "అయితే ఇప్పుడు వెంటనే తెర చాపను ఎగరేసి అమిత వేగంతో పడవను నడిపి చల్లగా వీస్తూ హాయిని గొలిపే చిరు గాలుల మధ్య నిన్ను తీసుకుపోలేను. ఎందుకంటే ఇప్పుడు ఒక ముఖ్యమైన స్నేహితుడితో ఉన్నా" ప్రియురాలితో తీపి కబుర్లు వల్లించే ప్రియునికి మల్లే చెప్పుకు పోతున్నాడు.

అకస్మాత్తుగా అప్పుడే చేప ఒక పక్కకు ఒత్తిగిల్లటంతో తీగ తన భుజాన వేసుకుని పరధ్యానంగా ఉన్న ముసలోడు ఆ లాగుడికి తూలి పడవ మీద ముందు భాగంలో పడిపోయాడు. ఇంకా నయం పడినప్పుడు తన భుజాన ఉన్న తీగను కొంచెం సళ్ళొదిలి పడవ అంచుని గట్టిగా పట్టుకోబట్టి బతికిపోయాడు. లేకుంటే జారి నీళ్ళలో పడిపోయేవాడు.

తీగ కదలటం మూలంగా అంత వరకు దాని మీద వాలి ఊపిరి పీల్చుకుంటూ ఉన్న పక్షి ఎగిరి వెళ్ళిపోయింది. ప్రమాదం అంచు దాకా వెళ్ళి మరలొచ్చిన ముసలోడు ఆ పక్షి ఎప్పుడు వెళ్ళిపోయిందో కూడా గమనించలేదు. కొంచెం వదులైన తీగను తన కుడి చేత్తో మళ్ళీ కొంచెం కొంచెం పైకి లాగుతున్న ముసలోడు చెయ్యి రక్తం కారటం చూశాడు.

"చేతికి ఏదో దెబ్బ తగిలినట్టుంది" అని పైకి అనుకున్నాడు. అటు వైపుకు దొర్లిన చేపను మళ్ళీ ఇటు వైపు దొర్లించటానికి వీలవుతుందేమో చూద్దామనుకుని తీగను పట్టుకుని లాగటం మొదలుపెట్టాడు. అలా లాగుతూ ఇక ఏ మాత్రం వదులు లేకుండా మరింత లాగితే తెగుతుంది అనిపించినప్పుడు దాన్ని అలానే గట్టిగా పట్టుకుని వెనక్కు వాలినట్టుగా కూర్చున్నాడు.

"చేపా ఇప్పుడు దొరికి పోతానేమో అని నీకు అనిపిస్తోందనుకుంటా. దేవుడి తోడు. నాకు కూడా అలానే అనిపిస్తోంది" రొప్పుతూ అన్నాడు ముసలోడు.

ముసలోడికి లేచి పోయిన పక్షి ఇప్పుడు గుర్తొచ్చి దానితో మళ్ళీ కబుర్లు కొనసాగించటానికి ఉద్యుక్తుడై అటు ఇటు చూశాడు. అది వెళ్ళిపోయి చాలాసేపయ్యింది.

వచ్చినంత సేపు కూడా ఉండకుండా వెళ్ళిపోయింది అని అనుకున్నాడు. అయితే తీరాన్ని సమీపించే దాకా నువ్వు వెళ్ళే మార్గం సరళంగా ఉండదు. నా చేతిలోని తీగకున్న చేప గుంజకుండా నేను ఎలా నియంత్రించ లేకపోయాను. అది ఒక్కసారి గుంజినందుకే నాకు ఇంత పెద్ద గాయమయ్యింది. రాను రాను నేను పనికి మాలినోడిలా తయారవుతున్నాను. లేదంటే బహుశా నా దృష్టి బుల్లి పిట్ట మీదకు మరల్చి దాని గురించిన ఆలోచనలో పడిపోయి నా కర్తవ్యాన్ని విస్మరించానేమో. అందుకే ఇలా అయ్యుంటుంది. ఇప్పుడు నా ఏకాగ్రతంతా నా పని మీదే నిలపాలి. తర్వాత ట్యూనాను కూడా తినాలి. తింటే కనీసం నాలోని శక్తి క్షీణించకుండా ఉంటుంది.

"పిల్లోడు ఇప్పుడు ఇక్కడ ఉండి ఉంటే ఎంత బాగుండేది. ఈ పచ్చి చేపను రుచీ పచీ లేకుండా తినలేక పోతున్నాను, కొంచెం ఉప్పు కూడా ఉండి ఉంటే నంచుకుని తినే పని" పెద్దగా అరిచాడు ముసలోడు.

తీగ బరువును ఎడమ భుజానికి మార్చుకుని అలానే మోకాళ్ళ మీద కొంచెం ముందుకు వంగి తన చేతులను సముద్రపు నీటిలో కడుక్కున్నాడు. వెంటనే తన చేతులను తీయకుండా అలానే ఒక నిముషం పాటు నీటిలో ఉంచి పడవ కదులుతూ ఉన్నప్పుడు తన చేతులను నెట్టుకుంటూ నిబ్బరంగా వెళుతున్న నీళ్ళ వాటుగా తన చేతి గాయం నుండి చిన్న ధారగా వెళుతున్న రక్తాన్ని నిశ్చలంగా చూస్తూ ఉన్నాడు.

"చేప కొంచెం నెమ్మదించింది" అన్నాడు.

ఇంకొంచెం సేపు అలా తన చేతులను ఉప్పు నీళ్ళలో పెట్టి ఉంచాలనుకున్నాడు. కానీ ఈ మాయదారి చేప అకస్మాత్తుగా అటు ఇటు దొర్లి మళ్ళి తనను ఎక్కడ పడదోస్తుందో అని భయపడ్డాడు. తనను తాను పడకుండా నిలదొక్కుకుంటూ పైకి లేచి ఎండకు అడ్డంగా తన చేతిని పెట్టుకున్నాడు. తీగ ఒరుసుకు పోవటం మూలంగా కలిగిన గాయం ఇది. అయితే తీగ పట్టు సడలకుండా ఎక్కడయితే ఒత్తి పడతాడో సరిగ్గా చేతిలో అక్కడే కోసుకుపోయింది. ఈ పని దిగ్విజయంగా పూర్తయ్యే వరకు ఈ చేతులతో నాకు ఎంతో అవసరం ఉంది. అసలు పని సరిగ్గా మొదలు కాక ముందే చేతులు ఇలా కోసుకుపోయి గాయాల పాలవ్వటం నాకు ఏ మాత్రం నచ్చలేదు.

తన చేతుల తడి ఆరిపోగానే అతడు "ఇప్పుడు నేను ఈ పిల్ల ట్యూనాను తింటాను.

అక్కడకు ఏం వెళతాం దాన్ని బల్లెంతో అందుకుని ప్రశాంతంగా ఇక్కడే కూర్చుని తింటాను" అన్నాడు.

అతడు అక్కడే తన మోకాళ్ళ మీద కూర్చుని బల్లెంతో తీగ చుట్టలను తప్పిస్తూ పడవ ముందు లోపల పెట్టి ఉన్న ట్యూనాను తన ముందుకు లాక్కున్నాడు. తీగను మళ్ళీ తన ఎడమ భుజం మీద పెట్టుకుని ఆసరా కోసం ఎడమ చేతిని కింద ఆనించి పెట్టి బల్లెం ముక్కు నుండి ట్యూనాను తప్పించి మళ్ళీ బల్లేన్ని యథాస్థానంలో ఉంచాడు. ఒక మోకాలిని చేప మీద పెట్టి తల వెనుక భాగం నుండి తోక దాకా ముదురు ఎరుపు రంగు మాంసాన్ని నిట్ట నిలువు ముక్కలుగా కోశాడు. ఆ విధంగా అతను దాన్ని ఆరు ముక్కలుగా కోసి వాటిని పడవ ముందు భాగంలో ఉన్న చెక్క మీద పరిచాడు. కత్తిని తాను తొడుక్కున్న షరాయికి తుడిచాడు. తర్వాత చేప తోకను తీసి నీళ్ళలోకి విసిరేశాడు.

"ఒక ముక్క మొత్తం నేను తినలేను" అని కత్తితో ఒక ముక్కను అడ్డంగా కోశాడు. చేప తీగను గట్టిగా పట్టి లాగటం తనకు తెలుస్తోంది. తన ఎడమ చేయి తిమ్మిరి పుడుతోంది. తాడును గట్టిగా పట్టి ఉంచటం మూలంగా అది మొద్దుబారినట్టు కదప లేకుండా ఉంది. అట్లా తయారైన తన చేతి వైపు ఈసడింపుగా చూశాడు.

"ఏమి చెయ్యిది? నీకు అంత ఇదిగా ఉంటే అలాగే తిమ్మిరెక్కి పులి పంజాకు చిక్కిన పిల్ల కుందేలులా మారు. దాని వల్ల నీకేమీ ప్రయోజనం లేదు."

తొందరగా కానివ్వు అనుకుని నీటిలో మునిగి ఏటవాలుగా కనిపిస్తున్న తీగ దగ్గర చీకటిగా ఉన్న నీటి లోతులకేసి చూశాడు. కోసుకున్న ముక్కలను తొందరగా తినేస్తే చెయ్యికి శక్తి వస్తుంది అనుకున్నాడు. తిమ్మిరెక్కి నొప్పిపుట్టే విషయంలో చెయ్యి తప్పేం లేదు. చేప దొరుకుతుందేమోననే గంపెడు ఆశతో కాలం, కన్ను, కడుపుల గురించి పూర్తిగా మార్చిపోయి నా శరీరం మొత్తాన్ని మేకులా మార్చుకుని గాలం తీగను గంటల తరబడి మెలేసుకుని ఉండటమే ఈ తిమ్మిరికి కారణం. ఈ నొప్పి నన్నేం చేస్తుంది? చేపతో అయితే ఈ జీవిత కాలం మొత్తాన్ని ఆనందంగా గడిపేయగలను. ఇప్పుడు ముక్కలను తినేస్తాను. ఇలా రకరకాలుగా ముసలోడు ఆలోచిస్తున్నాడు.

అలా ఒక ముక్క తీసుకుని తన నోట్లో పెట్టుకుని నెమ్మదిగా నమిలాడు. ఫర్లేదు మరీ అంత దరిద్రంగా ఏం లేదు అనుకున్నాడు.

ముక్క ఎంత బాగా నమిలితే ముక్క నుండి అంత మంచి రసాలు ఊరుతాయి. కొంచెం ఉప్పు కల్లు గానీ, నిమ్మతొక్క గానీ ఉంటే ఇక ఎంత బాగుంటుందో. తినటంలో కష్టం తెలిసేది కాదు అనుకుంటూ ఆరగించసాగాడు.

"ఓ చెయ్యా, నీకేమనిపిస్తోంది? నీ కోసం ఇంకొంచెం తింటాను" శవంగా మారిన తర్వాత మనుషుల యొక్క అవయవాలు ఎంత గట్టిగా బిగదీసుకుపోతాయో అంత గట్టిగా బిగదీసుకు పోయిన తన తిమ్మిరెక్కిన చేతిని చూస్తూ అన్నాడు.

రెండుగా కోసిన ముక్కలోని రెండో భాగాన్ని ముసలోడు తినేశాడు. దాన్ని అతను జాగ్రత్తగా శ్రద్ధగా నమిలి తోలుని బయటకు ఊసేశాడు.

"చెయ్యా, ఈ తిమ్మిరి నిన్ను వదిలి ఎలా వెళుతుంది? ఈ విషయం తెలుసుకోవటానికి నీకింకా సమయం పడుతుందా?"

అతడు ఇంకో పెద్ద ముక్క తీసుకుని నమిలాడు.

"ఇది కల్తీ లేని జన్మ గల మాంచి గట్టి చేప" అన్నాడు ముసలోడు. "డాల్ఫిన్‌కు బదులుగా నాకు ఇది చిక్కటం నా అదృష్టం. డాల్ఫిన్ మరీ వెగటు కలిగించేంత తియ్యగా ఉంటుంది. దీనిలో అయితే తియ్యదనమే లేదు. అయితేనేం శక్తినిచ్చే అన్ని రకాలు దీనిలో ఉన్నాయి."

ఏ విషయమైనా అనుభవంలో, స్వయంగా ఆచరణలో తెలియకపోవటం అర్థ రహితం అనుకున్నాడు. కొంచెం ఉప్పు ఉండి ఉంటే చాలా బాగుండేది. ఇక నా కడుపు నిండి పోయింది. మిగిలిన ముక్కలు ఈ ఎండకు బాగుంటాయో కుళ్ళి పోతాయో తెలియదు. కనుక మొత్తం తినెయ్యటమే మంచిది. లోపలి చేప నిశ్చలంగా, నిమ్మళంగా ఉంది. మిగిలిన ముక్కలను కూడా అవజేసి దాని పని పడతాను అనుకున్నాడు ముసలోడు.

"చెయ్యా, కొంచెం సహనం కలిగి ఉండు, ఇదంతా నీ కోసమే తింటున్నాను" తన చేత్తో అన్నాడు.

ఈ బుడ్డి చేపను చంపకుండా పెంచుదామని అనుకున్నాను. ఇది నా తమ్ముడు. అయితే దాన్ని మేపాలంటే నాకు వేటాడే శక్తి కావాలి. ఆ శక్తి కావాలంటే దీన్ని చంపి తినక తప్పదు. మిగిలిన ఆకు ఆకృతిలో ఉన్న అన్ని ముక్కలనూ ముసలోడు నెమ్మదిగా, మనసు లగ్నం చేసి తినేశాడు.

చక్కగా చెయ్యిని షరాయికి తుడుచుకుంటూ నిటారుగా కూర్చున్నాడు. "చెయ్యా, ఇప్పుడు నువ్వు తీగ సంగతి చూడు. నీ తిమ్మిరి జబ్బు తగ్గే దాకా నేను నా కుడి చేత్తోనే ఆ చేప సంగతి చూస్తాను" అనుకుంటూ అతను తన ఎడమ పాదాన్ని అంత దాకా ఎడమ చేత్తో పట్టుకుని ఉన్న గాలం తీగ మీద పెట్టి తన వెనక్కు లాగి వేసుకున్నాడు.

"దేవుడా నా ఈ చెయ్యిని పట్టిన తిమ్మిరి దెయ్యం వదిలిపోయేలా నాకు సాయం చెయ్యి. ఎందుకంటే ఈ చేప ఇప్పుడు ఎన్ని వేషాలు వెయ్యబోతుందో నాకు తెలియదు" అని ప్రార్థించాడు.

"ముందే తాను వేసుకున్న ప్రణాళిక కొద్దీ అది నడుస్తోంది, ఇంతకీ దాని ప్రణాళిక ఏమై ఉంటుందో అనుకున్నాడు. అది సరే ఇంతకీ నా ప్రణాళిక ఏమిటి? ఏదేమైనా అది చాలా పెద్ద సైజులో ఉంటుంది కాబట్టి తదనుగుణంగా తన ప్రణాళికలోని మెలుకువలకు మెరుగులు దిద్దుకోవాలి. ఒక వేళ అది గనుక పైకి లేవటం అంటూ జరిగితే దాన్ని చంపేస్తాను. కానీ అది నాకు అంత అవకాశం ఇవ్వకుండా ఎప్పుడూ నీళ్ళ లోపలే ఉంటోందే. ఇది ఇలాగే కొనసాగితే నేను కూడా దానితో పాటు కిందే ఉండిపోతాను. ఈ విధంగా ఆలోచిస్తున్నాడు ముసలోడు."

తిమ్మిరెక్కిన తన చేతిని షరాయి మీద పెట్టి రుద్దుకుంటూ వేళ్ళను సాగదీస్తున్నాడు. ఎంత సవర దీసినా మూసుకున్న వేళ్ళు సరిగ్గా తెరుచుకోవడం లేదు. బహుశా సూర్యోదయంతో పాటుగా ఈ వేళ్ళు కూడా విప్పుకోవచ్చు అని అనుకున్నాడు. "బహుశా ఇప్పుడు నేను తిన్న మందపాటి ట్యూనాను నా పొట్ట అరాయించుకున్నాక తెరుచుకోవచ్చేమో. అయితే ముసుకుపోయిన ఈ గుప్పిటను విప్పాల్సిన అవసరం వస్తే ఖచ్చితంగా విప్పుతాను, ఏమన్నా కానీ. అయితే బలవంతానా దీన్ని ఇప్పుడు విప్పను. దాని ఇష్టానుసారం దానంతట అదే విప్పుకునే దాకా చూద్దాం. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. రాత్రంతా చాలా తీగలను కోయటం, ముళ్ళు విప్పటం, అటు ఇటు వేయటం కోసం పాపం దాన్ని విపరీతంగా ఇష్టం వచ్చినట్టు వాడేశాను."

ఒక్కసారి సముద్రాన్ని తేరి పార చూసి ఈ సమయంలో తాను ఇంత విశాల ప్రపంచంలో ఎంత ఒంటరి వాడనయ్యానో గద, అనుకున్నాడు ముసలోడు. అయినప్పటికీ కింద లోతైన జలాల్లో సుడులు తిరుగుతున్న పట్టకాలను, వాటిని దాటుకుని మరింత ముందుకు పోయిన గాలం తీగ వీటన్నింటిని మించి అలలవలే వింత సోయగాలతో అలరారుతూ అగాధం అంచుల్లో సంచరిస్తున్న ఒక ప్రశాంతతను అతను చూడగలుగు తున్నాడు.

తూర్పు నుంచి పశ్చిమానికి వీచే వాణిజ్య పవనాల కోసం మేఘాలు పరుచుకుంటూ ఉన్నాయి. వాటికి కొంచెంపైన సముద్రం మీద కనిపించినట్టే కనిపించి అంతలో మేఘాల మాటున మాయమవుతున్న దూడబాతులను చూశాడు. అవి మాటిమాటికీ కనిపిస్తూ మళ్ళీ మాయమవుతున్నాయి. ముసలోడు అప్పుడు అనుకున్నాడు సముద్రంలో మనిషి ఎప్పుడూ ఒంటరి కాదని ఏదో ఒక జీవి అతనికి నిరంతరం తోడు ఉంటుందని.

నేల కనిపించనంత దూరం, అదీ వాతావరణం అకస్మాత్తుగా ప్రతికూలంగా మారిపోయే కాలంలో చిన్న చిన్న పడవల్లో సముద్రం మీద వేటకు వెళ్ళటానికి కొంత మంది జాలర్లు ఎలా భయపడతారో అతనికి గుర్తొచ్చింది. అయితే ఇప్పుడు హరికేన్

తుఫాన్లు వచ్చే కాలం. ఈ కాలంలో ఒక వేళ హరికేన్ తుఫాన్లు కనుక రాకుండా ఉంటే ఏడాది మొత్తంలోకి వాతావరణ పరంగా ఇంతకు మించిన మంచి కాలం ఉండదు.

ఈ కాలంలో ఒక వేళ హరికేన్ తుఫాన్ వచ్చేలా ఉంటే దానికి సంబంధించిన సూచనలు కొన్ని రోజుల ముందు నుంచే సముద్రం దగ్గర కనిపిస్తాయి. సముద్రంలో ఉండి తీరం వైపు చూసినప్పుడు ఆ సూచనలు అంతగా కనిపించవు. ఏవైనా సూచనలు కనిపించినప్పుడు వాటిని సరిగ్గా గుర్తించటం కూడా తెలియదు. సూచనలు కనిపించకుండా ఉండటంలో మేఘాలు కూడా తమ పాత్రను పోషిస్తాయి. ప్రస్తుతం మాత్రం తుఫాను వచ్చే సూచనలు లేవు.

అతడు ఆకాశం వైపు తేరిపార చూశాడు. ఐస్‌క్రీం పొరలు ఒక దాని మీద ఒకటి సుందరంగా పోగు పడినట్లు గుండ్రంగా పొరలు పొరలుగా పోగుబడ్డ తెల్లటి మబ్బులు కనిపించాయి. సెప్టెంబరు నెలలో ఆకాశం నిండా పరుచుకుని ఉన్న ఆ తెల్లటి మేఘాల కిరీటంలో పొదగబడిన పల్చని తురాయి లాంటి ఆకారాలు అందంగా మనోహరంగా కనిపిస్తున్నాయి.

"ఓ చేపా, చల్లని పిల్లగాలి వీస్తోంది. ఈ వాతావరణం నీ కంటే కూడా నాకు అనుకూలమైనది" ముసలోడు ఆనందంగా అన్నాడు.

అతడి ఎడమ చేయి ఇంకా తిమ్మిరిగానే ఉంది కానీ అతడు దానిని మెల్లమెల్లగా విప్ప గలుగుతున్నాడు.

ఈ తిమ్మిరి గిమ్మిరి అంటేనే నాకు అసహ్యం అనుకున్నాడు ముసలోడు. ఇది తన సొంత శరీరమే తన మాట వినకుండా ఒక రకంగా మోసం చేస్తున్నట్టే. పాచిపోయిన తిండి తిని బయటివాళ్ల ముందు వాంతులు, విరేచనాలు చేసుకోవాల్సి వస్తే చాలా అవమానంగా అనిపిస్తుంది. కానీ ఇసుమంతైనా ఉపశమనం లభించపోగా అంతకంతకూ పెరుగుతున్న ఈ తిమ్మిర్లు అంతకంటే ఎక్కువ బాధపెడుతున్నాయి. ఇప్పుడు ఒంటరిగా ఉండటంతో ఈ బాధాకరమైన అవమానం రెట్టింపవుతోంది. పిల్లోడు ఉండి ఉంటే చక్కగా భుజం దగ్గర నుంచి ముంజేతి దాకా మర్దన చేసి చక్కగా పామి ఈ చేతిని మళ్లీ మామూలుగా చేసి ఉండేవాడు. కానీ ఏం చేస్తాం? మరి కాసేపట్లో చేయి దానంతట అదే సరవ్వాలి. చూద్దాం.

చేప గాలం తీగను లాగటం వల్ల నీటి కదలికలో వచ్చిన మార్పును చూడక ముందే తన కుడి చేతిలో ఉన్న తీగ కదలికను బట్టి చేప లాగుతున్నట్టు అతడికి అర్థమయ్యింది. తీగను గట్టిగా పట్టి లాగుతున్న తాను ఎడమ చేతితో తొడ మీద చాలా వేగంగా గట్టిగా కొట్టుకున్నాడు. నీటిలోని తీగ నెమ్మదిగా ముందుకు కదలటం చూశాడు.

"చేప పైకి వచ్చేస్తోంది" ఆనందంగా అరిచాడు. "ఒసేయ్ నా చెయ్యీ, నీకు పుణ్యముంటుంది. దయచేసి నువ్వు కూడా సరవ్వు" బతిమిలాడుతున్నట్లుగా అన్నాడు.

తీగ నెమ్మదిగా స్థిరంగా కొంచెం కొంచెంగా పైకి లేచింది. పడవ ముందు సముద్రం కొంచెం ఉబ్బుగా అయింది. అంతే చేప బయటకు వచ్చేసింది. చేప ఎంత పైకి లేస్తున్నా ఇంకా కొంత లోపల మిగిలిపోయినట్లు అనిపిస్తుంది. అంత పెద్దగా ఉందది. అది అలా పైకి లేస్తున్నప్పుడు దాని రెండు పక్కల నుంచీ నీరు కిందకు జలపాతాల్లా జారుతోంది. చేప మీద ఎండపడుతుండటంతో అది మెరిసిపోతోంది. దాని తల, వీపు భాగాలు ముదురు వంగ రంగులో ఉన్నాయి. దానికి రెండు పక్కలా ఉన్న చారలు విశాలంగా లేత వంగ పండు రంగులో ఉన్నాయి. దాని ముక్కు బేస్ బాల్ బ్యాట్ అంత పొడవుంది. రెండంచులా పదును తేలిన కత్తిలా మొదలు లావుగా చివర సన్నగా ఉంది. చేప నీళ్లలోంచి ఒకసారి పూర్తిగా పైకి లేచి మళ్లీ మెత్తగా నీటిలో గజ ఈతగాడు కదిలినట్లుగా నీళ్లలోకి వెళ్లిపోయింది. అలా వెళ్తున్న ఆ చేప తోక చాలా పెద్ద కొడవలిలా కనిపిస్తోంటే ముసలోడు నోరెళ్ళబెట్టి చూస్తున్నాడు. గాలం తీగ మళ్లీ వేగంగా ముందుకు కదలింది.

"అబ్బో. ఇది నా పడవ కన్నా ఇంకో రెండడుగులు పొడవు ఉంది" అన్నాడు ముసలోడు. చేప మాత్రం ఏ మాత్రం గాభరాపడకుండా నిమ్మళంగా ఉంది. అయితే గాలం తీగను చాలా వేగంగా నిలకడగా కిందకు లాగుతోంది. తీగ చేప లాక్కెళ్లకుండా మరీ తెగేంత గట్టిగానూ లాగకుండా ముసలోడు నానా పాట్లు పడుతున్నాడు. కొంచెం కొంచెంగా తీగను అదిమి పెట్టి ఉంచనట్టైతే చేప అమాంతంగా తీగ మొత్తాన్ని లాక్కెళ్ళి తెంపేస్తుందనే సంగతి అతడికి తెలుసు.

ఇది అల్లాటప్పా చేప కాదు. దీన్ని ఎలాగోలా మాయచేసి దారికి తెచ్చుకోవాలి అనుకున్నాడు. నా శక్తిసామర్థ్యాల గురించి చేపకు తెలిసే అవకాశాన్ని మాత్రం నేను ఇవ్వకూడదు. అంతే కాదు దానికి తప్పించుకునే అవకాశం దొరికితే ఏం చేయగలదో దానికి అర్థమయ్యేలా కూడా నేను చెయ్యకూడదు అనుకున్నాడు. నేనే గనుక చేపనై ఉండి ఉంటే అన్ని పనులను పక్కన పెట్టేసి ఏదో ఒకటి తేలిందాకా అంతు చూసి ఉండే వాడ్ని. దేవుడి దయ వలన చేపలకు అపారమైన శక్తి సామర్థ్యాలున్నా కూడా వాటిని చంపే మనుషులకు ఉన్నంత తెలివి వాటికి లేదు.

ముసలోడు చాలా గొప్ప గొప్ప చేపలను చూశాడు. టన్ను కంటే ఎక్కువ బరువుగల చేపలను చాలా చూశాడు. తన జీవితంలో ఇంతవరకు అలాంటి వాటిని రెంటిని పట్టాడు. కానీ ఇదంతా అతడు ఒంటరిగా ఉన్నప్పుడు జరగలేదు. ఎవరో ఒకరు తోడు

ఉండే వాళ్ళు. కానీ ఇప్పుడు అతడు నేలకు దూరంగా సముద్రంలో ఒంటరిగా ఉన్నాడు. ఇప్పటివరకు అతడు చూసిన దానికన్నా విన్న దానికన్నా కూడా చాలా పెద్ద చేప గాలానికి దొరికింది. ఆ గాలం మరో చివర పట్టుకుని ఒంటరిగా దానితో పోరాటం చేస్తున్నాడు. పైగా అతడి ఎడమ చెయ్యి బిగించి పట్టిన గద్ద పంజాలంత గట్టిగా బిగదీసుకుపోయి ఉంది.

ఈ తిమ్మిరి నిదానంగా తగ్గుతుంది. తన కుడి చేతికి సాయం చేయటం కోసం తిమ్మిరి తప్పకుండా నయమవుతుంది. ఆ చేప, నా రెండు చేతులూ అన్నదమ్ముల లాంటివి. ఈ తిమ్మిరి తప్పకుండా తగ్గాలి. తిమ్మిరి అనేది అవమానకరమైన విషయం. చేప కొంచెం నెమ్మదించింది. అది తన మామూలు వేగంతో ప్రయాణం చేస్తోంది.

"అది అసలు అలా నీటిపైకి ఎందుకు దూకిందో నాకు అర్థం కాలేదు" అనుకున్నాడు ముసలోడు. "అదెంత పెద్దదో నాకు చూపించటానికి పైకి దూకినట్టు ఉంది. మొత్తానికి అదెంత పెద్దదో నాకిప్పుడు అర్థమయ్యింది అనుకున్నాడు. నేను కూడా ఎలాంటి మనిషినో అనే విషయం దానికి చూపించి ఉంటే బాగుండేది. మంచిదయ్యింది, అలా చేసి ఉంటే నా తిమ్మిరెక్కిన చేతిని అది చూసి ఉండేది. నేను ఇప్పుడు ఉన్న దాని కంటే బలంగా ఉన్నానని దానిని అనుకోనివ్వు. నష్టమేమీ లేదు. నేను అలానే ఉండటానికి ఇష్టపడతాను. అసలు నేను చేపనై ఉండి ఉంటే ఎంత బాగుండేది. ఇప్పుడు నాకున్న తెలివితేటలు, గుండె బలంతో పాటుగా చేపకున్న గాంభీర్యం, శక్తిసామర్థ్యాలు కూడా తోడయ్యేవి" అని అనుకున్నాడు.

తన బాధను అలానే పంటి బిగువున భరిస్తూ చెక్కకి ఆనుకుని నుంచున్నాడు. ఆ చిక్కని నీళ్ళను చీల్చుకుంటూ పడవ నెమ్మదిగా కదులుతోంది. చేప నిమ్మళంగా ఈదుతూ ఉంది. తూర్పు నుంచి వీచే గాలి మూలంగా సముద్రం మీద అలజడి పెరిగింది. మధ్యాహ్నానికల్లా ముసలోడి ఎడమ చెయ్యి తిమ్మిరి కూడా తగ్గింది.

తీగను భుజం మీద గోతాంపట్ట ఉన్న చోటుకు సర్దుకుంటూ అన్నాడు "చేపా! నీకొక దుర్వార్తను మోసుకొచ్చాను."

అతడు నిమ్మళంగా ఉన్నట్టు కనిపిస్తున్నా లోపల మాత్రం బాధపడుతున్నాడు. అయితే తను బాధపడుతున్నట్టు ఒప్పుకోలేదు.

"నాకు మతం మీద నమ్మకం లేదు" అన్నాడు. "కానీ ఇప్పుడు నాకు ఆ చేప దొరికే విధంగా సాయం చేస్తే పరిశుద్ధుడైన తండ్రిని, మేరి మాతను పది పది సార్లు ప్రార్థిస్తా. అంతేకాదు మేరి మాతను దర్శించుకుంటానని కూడా ఒట్టు వేస్తున్నా. అవును. ఒట్టు."

అతననుకున్న విధంగా యాంత్రికంగా ప్రార్థించటం మొదలు పెట్టాడు. కొన్నిసార్లు

ఆ ప్రార్థనలు గుర్తుకు రాక సతమతమయ్యి అలసిపోయాడు. గబగబా చదివితే వాటంతట అవే గుర్తొకొస్తాయనుకుని చదివేశాడు. ఏదేమైనా ప్రభువైన తండ్రికి చేసే ప్రార్థనలకన్నా మేరి మాతకు చేసే ప్రార్థనలు సులువుగా ఉంటాయి అనుకున్నాడు.

"దయామయురాలయిన మేరీ మాతా, పరిశుద్ధ ప్రభువు నీకు తోడై ఉన్నాడు. స్త్రీలందరిలోకి నువ్వు ఆశీర్వదింపబడిన దానవు. నీ గర్భ ఫలమైన ఏసు ఆశీర్వదించబడిన వాడు. దేవునికి తల్లివైన పరిశుద్ధ మేరి మాతా పాపులమైన మా గురించి కూడా ఇప్పుడే కాదు. ఎల్లప్పుడూ మా మరణాంతం వరకూ నిరంతరమూ ప్రార్థించు. ఆమెన్" అన్నాడు. ఆ ప్రార్థనకు కొనసాగింపుగా "ఓ మేరీ మాతా, ఈ చేప చనిపోయేలా కూడా నువ్వు భగవంతునికి మొరపెట్టు. ఇది చాలా అద్భుతమైన చేపైనప్పటికీ మరి తప్పదు" అని చెప్పాడు.

ఇలా ప్రార్థించిన తర్వాత అతడికి కొంత నెమ్మదయితే కలిగింది కానీ అతడి బాధ మాత్రం తగ్గలేదు. బహుశా ఇంకా ఎక్కువయ్యిందనే చెప్పాలి. అలా అతడు యాంత్రికంగా పడవ ముందు భాగంలోని చెక్కకు ఆనుకుని తన ఎడమ చేతి వేళ్ళను నిమురుకున్నాడు.

చల్లటి పిల్ల గాలుల వేగంతో పాటుగా సూర్యుడి ప్రతాపం కూడా పెరుగుతోంది.

"పడవ వెనుక వైపు ఉన్న చిన్న గాలం తీగకు మళ్లీ ఎర గుచ్చి వేస్తే మంచిది" అన్నాడు. "ఒకవేళ ఈ చేప ఉలక్కుండా పలక్కుండా ఈ రాత్రంతా అలానే ఉండిపోవాలని నిశ్చయించుకుంటే మళ్ళీ నాకు బలం రావటానికి తిండి తినాలి. పైగా నీళ్ళ సీసా కూడా ఖాళీ అయిపోయింది. నేననుకోవటం ఇప్పుడిక్కడ డాల్ఫిన్ తప్ప వేరే ఏదీ దొరికేలా లేదు. కానీ దాన్ని కొంచెం తాజాగా ఉన్నప్పుడే తినేస్తే దాని రుచి మరీ అంత దరిద్రంగా అనిపించదు. ఈ రాత్రికి ఒక పిచ్చుక మీనన్నా వచ్చి పడవ మీద పడితే బాగుంటుంది. అయితే వాటిని ఆకర్షించటానికి నా పడవ మీద వెలుతురే లేదు. పచ్చి వాటిని తినాలంటే పిచ్చుక మీననే తినాలి. చాలా బాగుంటుంది. పైగా దాన్ని ముక్కలు ముక్కలుగా కోయాల్సిన అవసరం లేదు. ఇప్పుడు నా బలాన్ని ఖర్చుచేయకుండా దాచుకోవాలి. ఏసయ్యా, అది అంత పెద్ద చేపని నాకు అస్సలు తెలియదు."

"అది ఎంత పెద్దది ఎంత గొప్పదైతే ఏంటి? నేను దానిని చంపి తీరతాను."

ఇలా చేయటం ధర్మం కాకపోవచ్చు కానీ తప్పదు, అనుకున్నాడు ముసలోడు. ఒక మనిషి ఏం చేయగలడో, ఎంత కష్టాన్ని భరిస్తాడో నేను దానికి చూపిస్తా.

"నేనో చిత్రమైన ముసలోడ్నని ఆ పిల్లోడితో చెప్పా" అన్నాడు.

"దాన్ని నిరూపించి తీరాల్సిన సమయమిదే."

ఇంతకుముందే ఈ విషయాన్ని వెయ్యిసార్లు నిరూపించినా అదంతా ఇప్పుడనవసరం.

ఇప్పుడు మళ్లీ నిరూపించబోతున్నాడు. ప్రతిసారీ దేనికదే కొత్త. ఇలా ప్రతిసారీ పని చేసేటప్పుడు గతానికి సంబంధించి ఆలోచించేవాడే కాదు.

"ఆ చేప కొంచెం సేపు నిద్రపోతే బాగుండు. నేను కూడా రెప్పవాల్చొచ్చు. సింహాల గురించి కలలు కనొచ్చు. ఇప్పుడు చేతిలో ఉన్న పనిని వదిలి పెట్టి సింహాల గురించి ఎందుకు ఆలోచిస్తావు? ముసలోడా ఎక్కువగా ఆలోచించకు. ఏమీ ఆలోచించకుండా ఆ చెక్కకు ఆనుకుని కొంచెం సేపు విశ్రమించు. చేప ఖాళీగా కూర్చోలేదు. అది తన పని తాను చేస్తోంది. నువ్వు కూడా చిన్నగా నీ పని చేసుకో."

మధ్యాహ్నం కావస్తోంది. పడవ ఇంకా నిదానంగా, నిటారుగా కదులుతోంది. తూర్పు దిక్కు నుంచి వీస్తున్న చల్లగాలి సముద్రంలో ముసలోడి పడవ ప్రయాణిస్తున్న వేగాన్ని కొంచెం పెంచుతోంది. దాంతో.. ముసలోడి వీపుకి గాలం తీగ ఒరుసుకుపోవటం కొంచెం తగ్గుతోంది.

మధ్యాహ్నం మరోసారి గాలం తీగ పైకి లేవటం మొదలైంది. చేప ఇంతకు ముందున్న లోతు నుంచి మరి కొంచెం ఎత్తులోకి వచ్చి ఈదుతోంది. సూర్యుడి ఎండ ముసలోడి ఎడమవైపు పడుతోంది. చేప ఉత్తర దిక్కుగా వెళ్ళి తూర్పు వైపుకు తిరిగిందని అతడికి తెలుస్తోంది.

"ఆ చేపను ఒక్కసారి చూసిన తర్వాత అది వంగపండు రంగులోని తన రెక్కలను పక్షి రెక్కలకు మల్లే విప్పార్చి నిక్కబొడుచుకున్న తన తోకతో నీటి లోపల చీకటిని చీల్చుకుంటూ ఎలా ఈదుతుందో ముసలోడు ఊహించగలుగుతున్నాడు. అంత లోతులో దానికి ఎంత కనిపిస్తుందో అనుకున్నాడు. ఆ చేప కన్ను చాలా పెద్దగా ఉంది. దానికంటే చిన్న కళ్లు ఉన్న గుర్రం చీకట్లో కూడా బాగా చూడగలదు. ఆ రోజుల్లో నేను కూడా చీకట్లో చాలా చక్కగా చూడగలిగేవాడ్ని. చీకటంటే మరీ కటిక చీకటి కాదు. పిల్లి చూడగలిగినంత చీకట్లో చూడగలిగేవాడ్ని."

ఎండ మూలంగా, చాలా సేపటి నుంచి వేళ్ళను కదిలిస్తూ ఉండటం మూలంగా అతడి ఎడమ చెయ్యి ఇప్పుడు పూర్తిగా స్వాధీనం లోకి వచ్చింది. తీగ బరువును ఇప్పుడు ఎక్కువగా ఎడమ వైపే ఉంచుతున్నాడు. తీగను వీపుకు చుట్టుకున్న చోట నొప్పి చేస్తుంటే.. భుజం కండరాలను విదిల్చి తీగను ఎడమవైపుకు జరుపుకున్నాడు.

"ఒసే చేపా! నీకు ఇంకా అలుపు రాలేదా? చాలా వింత చేపలా ఉన్నావే!" ముసలోడు పెద్దగా అన్నాడు.

అతడు చాలా అలసిపోయాడు. ఇంకొంచెం సేపట్లో చీకటి పడుతుందని అతడికి తెలుసు. వేరే ఏవో విషయాల గురించి ఆలోచించటానికి ప్రయత్నించాడు. పెద్ద పెద్ద

బేస్ బాల్ లీగుల గురించి ఆలోచించాడు. అతడికి మాత్రం వాటిని మించిన పెద్ద లీగు మ్యాచ్‌లు ఉండవు. న్యూయర్క్ అమెరికన్లు, డెట్రైట్ పులుల జట్ల మధ్య పోటీ జరుగుతుందని అతడికి తెలుసు.

"ఇది రెండో రోజు. ఆటలో ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో నాకు తెలీదే!" అని అనుకున్నాడు. కానీ నా మీద నేను నమ్మకం పెంచుకోవాలి. కాలి మడమలో ఎముక చిట్లినా కూడా లెక్కచేయకుండా డిమాగియో ఎలా వీర విహారం చేశాడో నాకు తెలుసు. వాడిలాగా ఉండాలి. ఇంతకీ ఎముక చిట్లటం అంటే ఏంటి? తనను తానే ప్రశ్నించుకున్నాడు ముసలోడు. మనకు అలాంటిదెప్పుడూ జరగలేదే. కాలిలో కత్తి దిగబడిన పందెం కోడికి ఉన్నంత నొప్పిగా ఉంటుందా? అంత నొప్పినైతే నేను తట్టుకోలేను. పందెం కోళ్లలాగా ఒక కన్నుపోయినా, రెండు కళ్లూ పోయినా కూడా పోట్లాడుతూనే ఉంటం నా వల్ల కాదు. అలాంటి గొప్ప గొప్ప పక్షులు, జంతువులతో పోలిస్తే మనిషి ఎందుకూ సరిపోడు. అయినా నేను ఆ నీళ్లలో ఈదుతున్న చేపనైతే బాగుండు. "అప్పుడు సొరచేపలొస్తే నాకు మూడినట్టే" అతడు పెద్దగా అన్నాడు. "ఇప్పుడే కనక సొరచేపలొస్తే నన్ను, ఆ చేపను ఇక ఆ దేవుడే కాపాడాలి."

నేను ఈ చేపను పట్టుకుని వేళ్లాడుతున్నంత సేపు డిమాగియో ఒక చేపను పట్టుకుని ఉంటాడంటావా? ముసలోడు అనుకున్నాడు. ఖచ్చితంగా ఉండగలడు. ఇంక ఎక్కువసేపే ఉండగలడు. ఎందుకంటే వాడు కుర్రోడు, నాకంటే బలమెక్కువ. పైగా వాడి నాన్న కూడా ఒక జాలరే. కానీ చిట్లిన ఎముక వాడికి బాగా నొప్పి చేస్తుందా?

"నాకేం తెలుసు. నాకు ఇంతవరకు ఒక్క ఎముక కూడా చిట్లలేదు" అతడు పెద్దగా అన్నాడు. సూర్యుడు అస్తమిస్తూ ఉండగా తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ గతంలోని ఒక సంఘటనను గుర్తుచేసుకున్నాడు. కాసాబ్లాంకాలోని ఒక బార్‌లో సీన్ ఫీగస్ ప్రాంతానికి చెందిన ఒక నల్లవాడితో చేతిపట్టు పందెం వేశాడు తను. బల్ల మీద మధ్యలో చాక్‌పీస్‌తో గీత గీసి దానికి రెండు వైపులా తమ ఇద్దరి మోచేతులు బల్ల మీద ఉంచి ఒకరి చేతులు మరొకరు గట్టిగా పట్టుకున్నారు. ఆ పందెంలో వాళ్లిద్దరూ ఒకడి చేతిని మరొకడు కిందకు వంచటానికి పోటీ పడ్డారు. ఆ పోటీ ఒక పగలూ ఒక రాత్రీ కొనసాగింది. ఎవరూ వెనక్కు తగ్గలేదు. రాత్రంతా కిరోసిన్ బుడ్ల వెలుతురులో పోటీ కొనసాగింది. ఆ పోటీని చూడటానికి జనం తండోపతండాలుగా ఆ గదిలోకి వచ్చి వెళ్లేవారు. ఇద్దరి మీదా జోరుగా పందేలు కాశారు. ఆ దీపపు కాంతిలో ముసలోడు తన ప్రత్యర్థి చేతి వైపు, వాడి ముఖంలోకి చూశాడు. ఆ పోటీ జరిగేటప్పుడు మొదటి ఎనిమిది గంటలపాటు ఒకడు రిఫరీగా ఉన్నాడు. కానీ అది ఎంతకీ తెగకపోవటంతో ఆ తర్వాత రిఫరీలు

నిద్రపోవటానికి వీలుగా నాలుగు గంటలకోసారి రిఫరీని మార్చారు. పోటీలో గంటలతరబడి చేతిపట్లు బిగించి పట్టుకున్న తమ ఇద్దరి చేతి వేళ్ల గోళ్ళ నుంచీ రక్తం కారింది. ఇద్దరూ ఒకరి కళ్ళలోకి మరొకరు తీక్షణంగా చూసుకున్నారు. ఒకరి చేతులు, ముంజేతుల వైపు మరొకరు చూశారు. పందెగాళ్ళు, మామూలుగా చూడటానికి వచ్చినవాళ్లు కాసేపు గది లోపలా బయటా అటూ ఇటూ తిరుగుతూ కాసేపు గోడవారగా ఉన్న ఎత్తు కుర్చీల్లో కూర్చుంటూ చాలా ఉత్కంఠగా చూసేవాళ్లు. చెక్కతో చేసిన ఆ గది గోడలకు నీలం రంగు వేశారు. రాత్రిపూట వాటి మీద కిరోసిన్ దీపాల నీడలు పడుతుండేవి. బయట చిన్న గాలి వీచినప్పుడెల్లా దీపపు వత్తుల మంట కదలాడేది. ఆ కదలాడే కాంతి మూలంగా నల్లవాడి వెడల్పాటి నీడ గోడ మీద పడి కదలాడుతుండేది.

పందెగాళ్ళు రాత్రంతా కొంచెంసేపు తన మీద, కొంచెంసేపు నీగ్రో మీద పందేలు కాస్తూ అటూ ఇటూ మారుతుండేవాళ్లు. వాళ్లు ఆ నీగ్రోకి రమ్ము పోసి సిగరెట్లు వెలిగించి ఇస్తూ ఉండేవాళ్ళు.

రమ్ము తాగిన తర్వాత నల్లవాడికి తనమీద తనకి నమ్మకం పెరిగేది. పట్టులో బిగింపు పెరిగేది. ఇలా ఒకసారి ముసలోడి (అప్పుడు అతడు ముసలోడు కాదు. యువకుడైన శాంటియాగో ఎల్ కాంపియన్) చేతిని మూడు అంగుళాలు వంచాడు. కానీ ముసలోడు తక్కువ తినలేదు. నరాలు తెగే దాకా శక్తిని కూడగట్టుకొని ఒరిగిన తన చేతిని మళ్ళీ నిలబెట్టాడు. నల్లవాడు మంచి శరీర ధారుఢ్యమున్నోడు. మంచి ఆటగాడు. అలాంటి వాడ్ని కూడా ఎలాగైనా ఓడించి తీరగలననే నమ్మకం ముసలోడిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుండేది. తెల్లారిన తర్వాత పందెగాళ్ళంతా ఒక అంగీకారానికి వచ్చినట్టు.. ఈ పోటీ ఎటూ తేలేలా లేదని కాబట్టి డ్రాగా ప్రకటించాలని అడుగుతున్నారు. వాళ్ల మాటకు రిఫరీగా ఉన్నోడు అలాగే చేద్దామన్నట్టు తలూపుతున్నాడు. సరిగ్గా అప్పుడే శాంటియాగో తన వంట్లోని శక్తినంతా చేతిలోకి తెచ్చుకుని ఒక్క ఉదుటున నల్లవాడి చేతిని బలంగా కిందకు వంచాడు. వాడి చెయ్యి బల్లకు ఆనుకునే వరకూ అదిమాడు. ఆదివారం పొద్దుటి పూట మొదలైన ఈ పోటీ సోమవారం పొద్దుటికి కానీ ముగియలేదు. పందెం కాసిన వాళ్ళంతా కార్మికులు. వాళ్ళంతా నౌకాశ్రయంలో బస్తాల్లోకి పంచదార నింపే పనికో హవానా బొగ్గు కంపెనీలోకో వెళ్ళాల్సి ఉంది కాబట్టి ఆ పోటీని డ్రాగా ప్రకటించాలని అడిగారు. లేకపోతే గెలుపు ఎవరిని వరిస్తుందో తేలే దాకా చూడాలనే అనుకున్నారు. పోటీ అంత తీవ్రంగా ఉత్కంఠ పూరితంగా ఉంది. అయితే అందరూ కోరుకున్నట్టుగానే వాళ్ళు పనిలోకి బయలుదేరక ముందే శాంటియాగో గెలుపుతో పోటీ ముగిసింది.

ఈ గెలుపు తర్వాత ముసలోణ్ణి అందరూ చాలా కాలం పాటు 'చాంపియన్' అని పిలిచారు. దీని తర్వాత వసంత ఋతువులో ఆ నల్లవాడితోనే మరొక మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో పెద్దగా పందేలు కాయలేదు. అంతకు మునుపే ఒకసారి అతడిని ఓడించి వాడి ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసి ఉండటంతో రెండోసారి వాడ్ని సులువుగానే ఓడించగలిగాడు. ఆ తర్వాత అతడు కొన్ని పోటీల్లో మాత్రమే పాల్గొన్నాడు. నెమ్మది నెమ్మదిగా అవి కూడా లేకుండా పోయాయి. నేను ఎవరినైనా కొట్టాలి అని స్థిరంగా నిశ్చయించుకుని రంగంలోకి దిగితే కనుక మాత్రం ఎవరినైనా ఉతికి ఆరేయగలను అని అనుకున్నాడు ముసలోడు. ఎవరినైనా సవాలు చేసి ఢీ కొట్టి గెలవగల తన కుడి చేతిని చేపలు పట్టటానికే ఉపయోగించాలని నిశ్చయించుకున్నాడు. తన ఎడమ చేతితో కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడాడు. అయితే ఈ చెయ్యి అతడి మాట వినకుండా అతడి ఆజ్ఞకు లోబడకుండా ఒక ద్రోహిలా ప్రవర్తించేది. దాంతో ఆ చేతిని అతడు నమ్మలేదు.

ఇప్పుడు ఎండకు మాడితే అదే బాగవుతుంది అనుకున్నాడు ముసలోడు. రాత్రి చలికి మరీ చల్లబడితే తప్పించి ఇది మళ్ళీ తిమ్మిరెక్క కూడదు. అసలీ రాత్రి ఏం జరుగుతుందో? తల పైకెత్తి తన మీదుగా మియామీ వెళ్తున్న విమానాన్ని చూశాడు. అట్లా వెళుతున్న దాని నీడ నీటిలోని పిచ్చుక మీనల గుంపు మీద పడటంతో తమకు ఏదో ముప్పు సంభవించబోతోందని అవి భయపడిపోయాయి.

"ఇంత పెద్ద పిచ్చుకమీనల గుంపు ఉందంటే ఇక్కడ తప్పకుండా డాల్ఫిన్ ఉండి తీరాలి" అన్నాడతడు. తన చేప ఏమైనా దారికొచ్చిందా అని చూడటానికి వెనక్కు వాలాడు. కానీ అలాంటి పరిస్థితేమీ కనిపించలేదు. చేప చిక్కుకున్న గాలం తీగ బిగుతుగా మారి దానిమీద ఉన్న నీళ్ళు పోయాయి. ఇంకొంచెం లాగితే తెగిపోవటమే మిగిలింది. పడవ నెమ్మదిగా ముందుకు కదులుతూనే ఉంది. పైన వెళుతున్న విమానం వైపు మోర చాపి అది కనుమరుగయ్యేదాకా అలా చూస్తూనే ఉన్నాడు ముసలోడు.

విమానంలో అంతా చాలా చిత్రంగా ఉండి ఉండాలి అనుకున్నాడతడు. విమానంలో పోతూ అంత ఎత్తు నుంచి చూస్తే సముద్రం ఎలా కనిపిస్తుందో తలుచుకుంటేనే ఆశ్చర్యం కలుగుతుంది. మరీ అంత ఎత్తులో పోకుండా కొంచెం కింద నుంచి పోతుంటే మాత్రం విమానంలో నుంచి సముద్రంలో కదలాడే చేపల్ని చూడొచ్చు. "నేనే గనక విమానంలో వెళ్ళటం జరిగితే మాత్రం నెమ్మదిగా పన్నెండు వందల అడుగుల ఎత్తులో వెళుతూ సముద్రంలో కదలాడే చేపల్ని చూస్తా. పావురం ఆకారంలో ఉండే ఒక మాదిరి సైజు గల పడవల్లో తెర చాపంత ఎత్తున ఉండే చెట్ల పక్కగా దీవుల ఒడ్డు నుంచి వెళ్ళేటప్పుడు కింద నీళ్ళలో రకరకాల వింతలు చూసేవాడ్ని. పై నుంచి చూస్తే డాల్ఫిన్లు పచ్చ రంగులో

కనపడేవి. వాటి పైన పక్కల ఉండే చారలు వంగ రంగులో మచ్చలు చాలా చక్కగా కనిపించేవి. అవి గుంపులు గుంపులుగా ఈదుకుంటూ పోవటం అద్భుతంగా తోచేది."

సముద్రం లోపల ప్రవాహంలో వేగంగా కదిలే చేపలన్నింటి వీపులూ వంగ పండులో ఉండి వాటి మీద అవే రంగు చారలో మచ్చలో ఉంటాయి ఎందుకు? డాల్ఫిన్ పచ్చ రంగులో కనబడటంలో అర్థముంది. ఎందుకంటే అది నిజంగా బంగారమే కనుక. కానీ అది నిజంగా ఆకలితో ఉండి ఏదైనా తినటానికి వచ్చినప్పుడు చూస్తే మాత్రం మార్లిన్‌కు మల్లేనే దాని పక్కల వంగ పండు రంగులో చారలు కనబడతాయి. ఈ చారలు దేనికి సూచికలు? దాని కోపానికి సూచనా? లేదంటే అమితమైన వేగంతో అది ప్రయాణించటం మూలంగా అవి బయటకు వస్తాయా?

ఇంకా కొంచెం సేపట్లో చీకటి పడుతుంది. పెద్ద దీవంత ఉన్న సర్గాసో నాచుకుప్పను పడవ దాటుతూ ఉంది. ఆ నాచుకుప్ప పైకి ఉబికి.. సముద్రం పచ్చటి దుప్పటి కింద పడుకుని ఎవరితోనే ప్రేమకలాపాల్లో మునిగిపోయిందనిపించేలా కనిపిస్తోంది. అంతలో చిన్న గాలం తీగను ఒక డాల్ఫిన్ పట్టుకుంది. అది మొదటిగా గాల్లోకి ఎగిరినప్పుడు ముసలోడు దాన్ని చూశాడు. పొద్దుగూకుతున్న వెలుతురులో అది నిజంగా బంగారంలానే మెరుస్తోంది. గాలిలో వంపులు తిరుగుతూ మళ్లీ నీళ్లలో పడుతోంది. భయంతో అది మళ్లీమళ్లీ నీళ్లలో నుంచి పైకెగిరి పడుతోంది. ముసలోడు నెమ్మదిగా వంగి పడవ ముందుకు వెళ్ళి కుడి చేత్తో పెద్ద గాలం తీగను గట్టిగా పట్టుకుని, ఎడమ చేత్తో డాల్ఫిన్ పట్టుకున్న గాలం తీగను పైకి లాగుతూ, లాగిన తీగను ఎడమ పాదం కింద తొక్కి పెడుతున్నాడు. ఏంచేయాలో పాలుపోని స్థితిలో ఆ చేప పైకి దూకుతూ, లేచి అటూ ఇటూ పడుతోంది. పడవ అంచు దాకా వచ్చిన ఆ చేపను ముసలోడు పడవ మీద నుంచి ముందుకు వంగి పట్టుకుని పైకి ఎత్తి పడవలో వేశాడు. గాలం ముల్లును కొరకాలని దాని మొప్పలను తెరచి మూస్తూ గిలగిల కొట్టుకుంటోందా చేప. చేప ఎగిరెగిరి పడుతూ బల్ల పరుపుగా ఉన్న తన పొడవాటి శరీరంతో, తలతో, తోకతో ఎలా వీలయితే అలా పడవ అడుగు భాగాన్ని తపతపా కొడుతోంది. ముసలోడు దుడ్డుకర్ర తీసుకుని దాని తల మీద మోదాడు. ఆ దెబ్బలకు చేప దూకుడు తగ్గిపోయి సన్నగా వణుకుతూ కదలకుండా పడిపోయింది.

ఆ చేప నోట్లో నుంచి గాలం ముల్లును తీసి మరొక కవడ చేపను దానికి ఎరగా గుచ్చి తీగను నీళ్ళలోకి విసిరేశాడు ముసలోడు. తర్వాత నెమ్మదిగా పడవ ముందుకు చేరాడు. మొదట తన ఎడమ చేతిని శుభ్రం చేసుకుని దాన్ని తన షరాయికి తుడుచుకున్నాడు. తర్వాత తన కుడి చేతిలో ఉన్న బరువాటి పెద్ద గాలం తీగను

ఎడమ చేతిలోకి మార్చుకుని కుడి చేతిని సముద్రం నీళ్ళతో కడుక్కుంటూ సముద్రంలోకి జారుకుంటున్న సూర్యుడ్ని చూశాడు. తల కొంచెం కిందకు దించి నీళ్ళ లోపల వంగి పోయినట్టు కనబడుతున్న తన చేతిలోని తీగను చూశాడు.

"ఇది ఏ మాత్రం మారలేదు" అన్నాడు ముసలోడు. చేతిని నీటి ప్రవాహానికి ఎదురుగా పెట్టి చూస్తే.. నీటి ఒరవడి ఇంతకుముందుకంటే నెమ్మదిగా ఉండటం గమనించాడు.

"రెండు తెడ్లను కలిపి పడవ వెనుక అడ్డంగా పడేస్తా. దాంతో రాత్రిపూట చేప వేగం కొంచెం తగ్గుతుంది. రాత్రివేళ చేప బాగా పనిచేస్తుంది. నేను కూడా బాగానే పనిచేస్తా" ముసలోడు అన్నాడు.

డాల్ఫిన్‌ని ఇప్పుడే కోస్తే దాని రక్తమంతా కారిపోతుంది. కొంచెం సేపాగి కోస్తే మంచిది, మాంసంలోని రక్తం గడ్డకట్టి అంతా కారిపోకుండా ఉంటుంది అని అనుకున్నాడు. తెడ్లను అడ్డం వేసే పని ఈ పనీ రెండూ కలిపి కొంచెం సేపాగి చేస్తాను. సూర్యుడు అస్తమించే సమయంలో చేపను మరీ ఇబ్బంది పెట్టకూడదు. ప్రస్తుతానికి దాన్ని ప్రశాంతంగా ఉండనిద్దాం అనుకున్నాడు. సూర్యాస్తమయ సమయం చేపలన్నింటికీ కూడా గడ్డు సమయమే. తడిచిన తన చేతిని కొంచెం సేపు గాలిలో ఆరబెట్టుకుని దానితో తీగను గట్టిగా పట్టుకుని పడవ మీద నుంచి తాను వంగ గలిగినంత మేర ముందుకు వంగాడు. దాని వల్ల పడవ కూడా కొంచెం వెనక్కు కదిలింది.

ఈ పని ఎలా చేయాలో నేను నేర్చుకుంటున్నా అనుకున్నాడు ముసలోడు. పాపం ఈ చేప ఎరకు చిక్కినప్పటి నుంచీ ఏమీ తినలేదు. అసలే అది చాలా పెద్దది దానికి చాలా తిండి కావాలి. నేనైతే తెల్లారిన తర్వాత మొత్తం బానిటో చేపను తినేశాను. రేపు డాల్ఫిన్‌ను తింటా. దాన్ని కోసినపుడు కొంచెం తింటే బాగుంటుందేమో. డాల్ఫిన్ మాంసం చాలా గట్టిగా ఉంటుంది. తినటం కొంచెం కష్టం. అదే బానిటో అయితే నమలటానికి చాలా మెత్తగా ఉంటుంది. అయితే ప్రపంచంలో ఏ పనీ తేలిక కాదు. ప్రతి దాని కోసం ఎంతో కొంత కష్టపడాల్సిందే.

"ఒసే చేపా! నీకిప్పుడు ఎలావుంది?" ముసలోడు పెద్దగా అరిచి అడిగాడు. "నేను బాగానే ఉన్నా. నా ఎడమ చెయ్యి కూడా బాగయ్యింది. పైగా ఒక రాత్రికి, పగలుకు సరిపోయే తిండి కూడా ఉంది. నువ్వు పడవను లాగవే చేపా."

నిజానికి అతడికి అంత బాగుండలేదు. ఎందుకంటే, అతడి వీపు మీద తీగ మూలంగా మొదలైన నొప్పి కొంచెం తగ్గినట్టు అనిపించినా ఇప్పుడు ఆ భాగమంతా మొద్దుబారినట్టు అనిపిస్తోంది. అయితే జీవితంలో ఇంతకంటే దారుణమైన అనుభవాలను చవి చూశాను అనుకున్నాడతడు. దీనిదేముంది చెయ్యి తెగి కొంచెం గాయమయ్యింది. ఇంకో చేతిని

బాధిస్తున్న తిమ్మిరి తగ్గిపోయింది. నా కాళ్ళు చాలా చక్కగా పనిచేస్తున్నాయి. ఆకలి తీర్చుకోవటానికి తిండి కూడా దొరికింది. ఆ చేపకా భాగ్యం లేదు.

ఇప్పుడు పూర్తిగా చీకటి కమ్మేసింది. సెప్టెంబరు మాసంలో సూర్యుడు త్వరగా అస్తమిస్తాడు కాబట్టి త్వరగా చీకటి పడుతుంది. ముసలోడు పడవ వెనుక పడేసి ఉన్న చీకిపోయిన పాత చెక్క మీద నడుం వాల్చాడు. రాత్రి పూట ఆకాశంలోని నక్షత్ర మండలంలో అత్యంత ప్రకాశవంతంగా మెరిసే నక్షత్రం పేరు రైజల్ అని అతడికి తెలియదు కానీ దాన్ని ప్రతి రాత్రీ చూస్తాడు. దానితో పాటు దాని స్నేహితులైన మిగతా చుక్కలు కూడా బయటికి వస్తాయి.

"ఈ చేప కూడా నా స్నేహితుడే" ముసలోడు పెద్దగా అన్నాడు. "ఇలాంటి చేప గురించి ఇప్పటిదాకా నేను వినలేదు. చూడలేదు. ఏం చేస్తాం దాన్ని చంపక తప్పదు. సంతోషించదగ్గ విషయం ఏమిటంటే దూరాన ఆకాశంలో మెరిసే నక్షత్రాలను చంపాల్సిన అవసరం మనుషులకు లేదు."

మనుషులు రోజుకొక చందమామను చంపాల్సి వస్తే ఎలా ఉంటుంది అని అనుకున్నాడు. అలాంటి పరిస్థితే వస్తే చందమామ మనుషులకు అందనంత దూరం పారిపోతుంది. కానీ సూర్యుడ్ని చంపటానికి ప్రతి ఒక్క మనిషి ఇట్లా ఒక రోజు ప్రయత్నం చెయ్యాల్సి వస్తే? ఏదేమైనా మనం అదృష్టంతో పుట్టాం.

పాపం ఈ చేపకు తినటానికి ఏమీ లేకుండా పోయిందే అని అతడు బాధపడ్డాడు. అయితే దాని పట్ల చూపే ఇంత జాలి కూడా దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ చంపి తీరాలనే తన ధృఢమైన నిర్ణయం మీద ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. దీనిని కోస్తే ఎంత మందికి సరిపోతుంది అని అనుకున్నాడు. అయితే దీన్ని తినే అర్హత అందరికీ ఉందా? లేదు. అందరికీ ఆ అర్హత లేదు. ఈ చేపకున్న హుందాతనం, దీని ప్రవర్తన బట్టి చూస్తే దీన్ని తినగలిగిన అర్హత ఏ ఒక్కరికి ఉండకూడదు.

అయితే ఈ విషయాలన్నీ అంతగా తనకు అర్థం కావనీ అతడు అనుకున్నాడు. సూర్యుడ్ని కానీ, చంద్రుడ్ని కానీ నక్షత్రాలను కానీ చంపే ప్రయత్నం చేసే అవసరం మనకు లేకపోవటం అనేది చాలా మంచి విషయం. ఆకాశంలోకి అల్లంత దూరం ఎగిరే అవసరం లేకుండా హాయిగా తేలికగా సముద్రం మీద ఉంటూ మన అసలు సిసలు సోదరులైన ఈ చేపలను చంపుకుని తినటంతో మనం సరిపెట్టుకో గలుగుతున్నాం.

"నేను ఇప్పుడు దీన్ని ఎలా తీసుకెళ్ళాలనే విషయాన్ని గురించి ఆలోచించాలి" అని అనుకున్నాడు. పడవకు కట్టి తీసుకుపోవటంలో ఎన్ని లాభాలున్నాయో అన్ని నష్టాలు కూడా ఉన్నాయి. దాన్ని కట్టటంలో చాలా తాడు వృధా అవుతుంది. అంతే కాదు దాన్ని

కట్టి పడెయ్యటం మూలంగా పడవ కూడా తేలికగా కదలదు. ఏదేమైనా ఈ పెద్ద చేప వచ్చి చిన్న చేపను తిననివ్వకూడదు. అలా చేయనిస్తే చేపను తిని పెద్దచేప బలం పెంచుకుంటుంది. ఇక దానితో పోరాడటం కష్టమవుతుంది."

"ముందు నేను మరో గంట పడుకుంటా. తర్వాత ఏం చెయ్యాలనే విషయం గురించి నిర్ణయం తీసుకోవాలి. నేను మళ్ళీ పనిలోకి దిగే దాకా ఈ చేప నీరసించి పోకుండా అలుపూ సొలుపూ లేకుండా బాగానే ఉండేలా ఉంది. ఈ లోపు చూస్తా దాని కదలికల్లో గానీ ఏమన్నా మార్పు వచ్చి ఏమన్నా చేస్తుందేమో. తెడ్లను ఉపయోగించటం ఒక మంచి ఉపాయమే. అయితే ఇంత సేపటి నుంచి ఆలోచిస్తూ ఉన్న చేప తప్పకుండా ఇప్పుడు ఎలా తప్పించుకోవాలి, క్షేమంగా బయట పడటం ఎలా అనే దాని గురించి ఒక నిర్ణయానికి వచ్చి ఉండొచ్చు. నీళ్ళలో ఉన్నా బయటున్నా దాని బలంలో పెద్ద తేడా ఏమీ రాదు. గాలం ముల్లు దాని నోట్లో ఒక మూలన ఇంకా ఇరుక్కుని ఉండటం నేను చూశా. దాని నోటిని గట్టిగా అదిమి పెట్టి మూసి ఉండటంతో ముల్లును తీయటం వీలుకావటం లేదు. ముల్లు లోపల ఇరుక్కు పోయి ఉండటం అనేది దాన్ని పెద్దగా బాధపెట్టే విషయమే కాదు. కానీ ఆకలి, దానితో పాటు తాను ఊహించలేని పరిస్థితితో పోరాడటం దానికి అతి పెద్ద శిక్ష. ప్రస్తుతం కొంచెం సేపు పడుకోరా ముసలోడా. తర్వాత నీ పని మొదలుపెట్టే లోపు దాని తిప్పలు దానిని పడనివ్వు."

అలా అతడు కొంచెం సేపు ఒత్తిగిల్లాడు. రెండు గంటలన్నా అలా పడుకుని ఉంటానని అతడికి అనిపించింది. చంద్రుడు ఈ మధ్య బద్ధకంగా నిద్ర లేస్తున్నాడు. అందుకే అప్పుడు సమయం ఎంతై ఉంటుంది అనే విషయాన్ని ముసలోడు సరిగ్గా అంచనా వేయలేకపోయాడు. దాదాపు ఇంతకుముందు మల్లేనే అతడు పడుకో గలుగుతున్నాడు. తన భుజాల మీద వేసుకుని ఉన్న గాలం తీగను చేప లాగటం వల్ల అతడికి నొప్పి కలుగుతూనే ఉంది. ఎడమ చేత్తో పడవ ముందు ఉన్న మేకును ఆసరాగా పట్టుకున్నాడు.

ఒక్క ఉదుటున వేగంగా తీగను పైకి లాగెయ్యటం చాలా తేలిక అని అనుకున్నాడు. కానీ ఈ లోపే లోపల్నుంచి చేప ఒక్కసారి కిందకు గుంజిందంటే తీగ తెగటం ఖాయం. అది తీగను ఎప్పుడు ఎలా లాగుతుందో తెలియదు కనుక ఎప్పుడూ తీగను తన శరీరానికి చుట్టి పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలి. వీలు చూసి గబుక్కున పైకి లాగటానికి తీగను ఎప్పుడూ నా రెండు చేతులతో గట్టిగా పట్టుకునే ఉండాలి.

"నువ్వింకా నిద్ర పోలేదు ముసలోడా" అని పెద్దగా అన్నాడు. "రెండు పగళ్ళు ఒక రాత్రి గడిచిపోయాయి అయినా నువ్వింత వరకు నిద్రపోలేదు. చేప ఎటువంటి హడావిడి

చెయ్యకుండా అది ప్రశాంతంగా ఉండేలా చేయటానికి ఏదన్నా ఉపాయం ఆలోచించు అప్పుడన్నా నువ్వు కొంచెం సేపు పడుకోవచ్చు. నువ్వు నిద్రపోకపోతే నీ బుర్ర సరిగ్గా పని చెయ్యదు."

"నా బుర్ర చక్కగానే పని చేస్తుంది. చాలా స్పష్టంగా అంటే ఆకాశాన ఉన్న నా సోదరులైన నక్షత్రాలంత. అయినా నేను కొంచెం సేపు నిద్రపోవాల్సిన అవసరముంది. నక్షత్రాలు కూడా నిద్రపోతాయి. చంద్రుడు, సూర్యుడు నిద్రపోతారు. ఒక్కోసారి పెద్ద పెద్ద ప్రవాహాలు లేకుండా అప్పుడప్పుడు నిమ్మళంగా ఉన్న రోజుల్లో సముద్రం కూడా నిద్రపోతుంది."

ఈ ఆలోచనల్లో పడి నువ్వు నిద్రపోవటం మరచిపోకు అని అనుకున్నాడు. గాలం తీగల గురించి ఏదైనా ఒక మంచి ఉపాయం ఆలోచించు. ముందు వెళ్లి డాల్ఫిన్‌ను కోసి శుభ్రం చేయి. నువ్వు నిద్రపోయేటట్లయితే తెడ్లను పడవ వెనుకవేసి దాని వేగాన్ని తగ్గించటం ప్రమాదకరమైన పని.

నేను నిద్రపోకుండా ఉండగలను అనుకున్నాడు. కానీ అలాగైతే చాలా ప్రమాదకరంగా పరిణమించొచ్చు. పడవ వెనక్కు వెళ్ళి చేప లాగుడికి జారి పడిపోకుండా జాగ్రత్తగా మోకాళ్ళ మీద చేతుల మీద కూర్చుని పని చెయ్యటం మొదలు పెట్టాడు. చేప కూడా సగం నిద్రలో ఉన్నట్టుంది అనుకున్నాడు. దాన్ని అలా నిద్రపోనివ్వకూడదు. అది చచ్చే దాకా తప్పించుకోవటానికి కొట్టుకులాడుతూనే ఉండాలి.

భుజాల మీదుగా తీగను తన ఎడమ చేత్తో గట్టిగా పట్టుకుని కుడి చేత్తో ఒరలో నుంచి కత్తిని బయటకు లాగాడు. ఆకాశంలోని నక్షత్రాలు ప్రకాశవంతంగా ఉన్నాయి. ఆ వెలుతురులో డాల్ఫిన్ చక్కగా కనబడుతోంది. తన చేతిలోని కత్తిని దాని తల మీద గట్టిగా గుచ్చి కింద దాకా కోయటం మొదలుపెట్టాడు. చేప మీద ఒక కాలు ఒత్తిపెట్టి దాని కింద దవడ మొన దాకా వేగంగా కోశాడు. కత్తిని కింద పెట్టి కుడి చేత్తో దాన్ని చీల్చి మొప్పలను మొత్తం చక్కగా బయటకు లాగేశాడు.

దాని నోరు చాలా పెద్దగా బరువుగా ఉండి అతని చేతుల్లో నిలవకుండా జారిపోతోంది. అలాగే ఒడుపుగా పట్టుకుని దాని నోటిని చీల్చి తెరిచాడు. దాని నోట్లో రెండు పిచ్చుక మీనలు ఉన్నాయి. అవి ఇంకా చాలా తాజాగా ఉండి మెత్తబడకుండా గట్టిగానే ఉన్నాయి. వాటిని తీసి రెంటినీ పక్క పక్కనే పెట్టాడు. దాని నోట్లో ఉన్న ఆహార గొట్టాన్ని, ఊపిరితిత్తుల వంటి పనికిరాని భాగాలను పడవ వెనకనుంచి నీళ్ళలోకి గిరాటేశాడు. అవి నీళ్ళలో మునిగిన చోట పైన ఒక కాంతి ధారగా ఏర్పడింది. ప్రాణం పోయిన ఆ డాల్ఫిన్ వళ్ళు చల్లబడి నక్షత్రాల వెలుతురులో అది కుష్టు వ్యాధి సోకిన

చర్మానికి మల్లే తెలుపు ఊదా రంగుల్లో మెరుస్తోంది. ముసలోడు తన కుడి కాలుని దాని తల మీద పెట్టి ఒక పక్క నుంచి చర్మాన్ని వలవటం మొదలుపెట్టాడు. ఒక పక్క అవగానే దాన్ని తిరగేసి రెండో వైపు కూడా చర్మాన్ని వలిచి రెండు పక్కల తల నుంచి తోక దాకా నిలువుగా ముక్కలు కోశాడు.

మాంసం కోసేసిన తర్వాత మిగిలిపోయిన దాని అస్థిపంజరాన్ని నీళ్ళలోకి దొర్లిస్తూ అది పడిన చోట నీళ్ళలో సుడిగుండం లాంటిదేమన్నా ఏర్పడిందేమోనని చూశాడు. అలాంటిదేమీ కనిపించలేదు కానీ అది అలా నీళ్ళలో నెమ్మదిగా మునిగేటప్పుడు ఒక మెరుపు పైకి వచ్చింది. ముసలోడు పడవ పక్కకు తిరిగి అంతకు ముందే అక్కడ పెట్టి ఉన్న రెండు పిచ్చుక మీనలను తీసుకుని ఇంతకు ముందు కోసిపెట్టిన డాల్ఫిన్ మాంసం ముక్కలతో పాటుగా పెట్టాడు. కత్తిని కూడా తీసుకుని మళ్ళీ ఒరలో పెట్టుకుని పడవ వెనక్కు వెళ్ళి తన పనిలో నిమగ్నమయ్యాడు. భుజాల మీద గాలం తీగను మోయటం మూలంగా వీపంతా నొప్పి పుడుతోంది. దానికి తోడు కుడిచేతిలో పట్టుకుని ఉన్న చేప బరువు కూడా తోడయ్యింది.

డాల్ఫిన్ రెండు నిలువు ముక్కలను పడవ ముందు గూడులో నుంచి తీసి చెక్క మీద పరిచాడు. వాటి పక్కనే పిచ్చుక మీనలను ఉంచాడు. తర్వాత తన భుజం మీదున్న తీగను ఒక మారు సర్దుకుని పడవ అంచు మీద ఎడమ చేతిని ఆసరాగా పెట్టాడు. అతడు అలా కొంచెం అంచు మీద నుంచి నీళ్ళలోకి ఒంగి తన చేతిని తోసుకుంటూ వెళుతున్న నీటి వేగాన్ని గమనిస్తూ పిచ్చుక మీనలను కడిగాడు. చేప తోలు తీయటం మూలంగా అతడి చేతులు కూడా తెల్లగా మెరుస్తున్నాయి. ఆ చేతులు నీళ్ళలో మరింత మెరుస్తున్నాయి. నీటి వేగం అంత పెద్దగా లేదు. అతడి చేతిని రెండు వైపులా పడవ బయట అంచుకేసి రుద్దాడు. అప్పటి దాకా అతని చేతులకు అంటుకు పోయి మెరుస్తున్న పొలుసులు నీటి ఒరవడికి వ్యతిరేక దిశలో పడవ కిందకు వెళ్ళి నెమ్మదిగా మునిగిపోయాయి.

"లోపల చేప అలసిపోతూ ఉండి ఉండాలి లేక విశ్రాంతి తీసుకుంటూ ఉండాలి" ముసలోడు అన్నాడు. "నేను కూడా ఈ డాల్ఫిన్ ముక్కలను తిని కొంచెం సేపు సేద తీరాలి. కొంచెం సేపు నిద్రపోతే ఇంకా బాగుండు." ఆ చల్లని రాత్రి సమయంలో నక్షత్రాలు చాలా ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. తినటం మొదలు పెట్టిన అతడు డాల్ఫిన్ రెండు నిలువ ముక్కల్లో ఒక ముక్క సగం, దానితో పాటు మరో పిచ్చుక మీనను తల తీసేసి నలగ్గొట్టుకుని మరీ ఆబగా మింగటంతో ముగించాడు.

"డాల్ఫిన్ని ఉడకబెట్టుకుని తింటే ఎంత బాగుంటుందో పచ్చిది తింటే అంత

చండాలంగా ఉంటుంది. ఈసారి సముద్రం మీద వేటకు ఎప్పుడు వచ్చినా ఉప్పు, నిమ్మబద్ద వెంట తెచ్చుకోవటం మర్చిపోకూడదు" అనుకున్నాడు.

అంతదాకా ఎందుకు నాకు కొంచెమన్నా తెలివి ఉండి ఉంటే సముద్రంలో నుంచి నీళ్ళు కొంచెం తీసి పడవ పైన చల్లితే అది ఎండకు ఆరిపోయి చక్కగా మంచి ఉప్పు తయారయ్యేది అని అనుకున్నాడు. కానీ డాల్ఫిన్ని పట్టిందే పొద్దుగూకిన తర్వాత కదా. అయినా ముక్కలను బాగా నమిలాను. అయినా నాకంత వికారంగా ఏమీ అనిపించటం లేదు.

ఆకాశం తూర్పున మేఘావృతమై ఉంది. అతడికి పరిచయమున్న నక్షత్రాలు ఒక దాని తర్వాత ఒకటి అదృశ్యమైపోతున్నాయి. గాలి వేగం కూడా తగ్గిపోయింది. ముసలోడు ఇప్పుడు నెమ్మదిగా మేఘాలతో నిర్మితమైన ఒక మహాలోయలోకి కదలిపోతున్నట్టు అనిపిస్తూ ఉంది.

"మూడు నాలుగు రోజుల్లో వాతావరణం ప్రతికూలంగా మారబోతుంది" అతడు అన్నాడు. "కానీ ఈ రాత్రీ రేపు కూడా వాతావరణం బాగానే ఉంటుంది. ముసలోడా చేప ప్రశాంతంగా నిమ్మళంగా ఉంది. ఇప్పుడన్నా నువ్వు కొంచెం సేపు నిద్రపోవటానికి ప్రయత్నం చెయ్యి."

తన బరువంతా పడవ అంచుకు ఆనించి తన కుడి చేతితో గాలం తీగను గట్టిగా పట్టుకుని ఆ చేతికి ఆసరా కోసం తన తొడను దానికి ఆనించి పెట్టాడు. తీగను తన భుజం మీద కొంచెం కిందకు పోనిచ్చి దాన్ని ఎడమ చేత్తో పట్టుకున్నాడు. కుడి చేత్తో తీగను గట్టిగా మెలేసి పట్టుకున్నా కనుక అది కదిలే వీల్లేదు అని అనుకున్నాడు. ఒకవేళ నిద్రలో అది కిందకు జారినా నా ఎడమ చేతి మీదుగా జారాలి కాబట్టి నాకు మెలకువొస్తుంది. ఈ కుడి చేతికి ఎక్కువ పని పడుతోంది. దీనికి ఇలా గట్టి పనులు చేయటం అలవాటే. ఒక ఇరవై నిముషాలో అరగంటో నిద్రపోయినా గాని బాగుంటుంది. ముసలోడు తీగను అలా చుట్టుకుని తలను తన కుడి చేతి మీద పెట్టుకుని పడవ చెక్క మీద ముందుకు పడుకున్నాడు. అతడికి తొందరగానే నిద్రపట్టేసింది. అతడికి ఈసారి కలలో సింహాలు కనిపించలేదు. దానికి బదులు ఎనిమిది, పది మైళ్ళ మేర విస్తరించిన పెద్ద తూర మీనుల గుంపు కనపడింది. అది వాటిలో ఆడామగా చేపల కలయిక సమయం. అవి గాలిలోకి చాలా ఎత్తుకు ఎగిరి మళ్ళీ నీళ్లలోకి పడుతున్నాయి. అలా ఎగిరినప్పుడు నీటిలో గుంతలు ఏర్పడుతున్నాయి. ఎగిరిన చేపలు మళ్లీ అదే గుంతల్లోకి పడుతున్నాయి.

తర్వాత అతడు తన ఊళ్లో మంచం మీద పడుకుని ఉన్నట్టు మరో కల కన్నాడు. ఆ

కలలో ఉత్తరం దిక్కు నుంచి చల్లని గాలి వీస్తోంది. అతడికి చాలా చలిగా ఉంది. దిండుకు బదులుగా తన కుడి చేతిని తల కింద పెట్టుకుని పడుకోవటం వల్ల ఆ చేయి మొద్దుబారి స్పర్శ కోల్పోయింది. ఆ తర్వాత ముసలోడు మరో కల కన్నాడు. ఈ కలలో అతడికి పొడవైన పసుపు పచ్చని సముద్ర తీరం కనపడింది. అది సూర్యాస్తమయం తర్వాత సమయం. అప్పుడే చుట్టూ చీకట్లు కమ్ముకుంటున్నాయి.

ఎక్కడి నించో ఆ తీరంలోకి తరలి వస్తున్న సింహాల గుంపుకు దారి తీస్తున్న మొదటి సింహాన్ని చూశాడు. తీరంలో లంగరు వేసి ఉన్న ఓడ అంచు మీద తన గడ్డం ఆనించి అతడు చూస్తూ ఉన్నాడు. సాయంకాలంలో సముద్రం తీరం ఆవలి నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. ఆ గుంపు వెనుక ఇంకా ఏమన్నా సింహాలు వస్తాయేమోనని ఆనందంగా, ఆత్రంగా చూస్తున్నాడు.

చాలా సేపటి నుంచి చంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు. అతడు ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. చేప గాలం తీగను నెమ్మదిగా లాగుతూనే ఉంది. పడవ క్రమ క్రమంగా మేఘాల సొరంగంలోకి కదలి పోయింది.

తల కింద పెట్టుకుని ఉన్న తన కుడి చేతి గుప్పిట తన ముఖానికి తగలటంతో ముసలోడికి మెలకువ వచ్చింది. కుడి చేతిలోని గాలం తీగ తెగి పోయింది. తన ఎడమ చెయ్యి స్పర్శ జ్ఞానాన్ని కోల్పోయి నిశ్చలంగా ఉంది. తెగి కిందకు జారిపోతున్న తీగను తన కుడి చేతితో ఆపటానికి ప్రయత్నం చేశాడు కానీ కుదరలేదు. అది అప్పటికే జారి పోయింది.

చచ్చుబడినట్టు మారిన ఎడమ చేతిలోకి ఎలాగోలా శక్తి కూడదీసుకుని దానితో జారిపోతున్న తీగను గట్టిగా పట్టుకుని తన వీపుకు చుట్టేసుకున్నాడు. ఆ వేగానికి బరువుకి అతడి వీపు, ఎడమ చెయ్యి మంటపుడుతున్నాయి. తీగ బరువంతా ఎక్కువగా తన ఎడమ చేతి మీద పడటం మూలాన అది తెగ్గోసుకు పోతోంది. వెనక్కు తిరిగి తన కాళ్ళ దగ్గర పడున్న తీగ చుట్టలను చూశాడు. అది కూడా నెమ్మది నెమ్మదిగా జారిపోతోంది. అదిగో అప్పుడే లోపలున్న చేప సముద్రాన్ని చీల్చుకుంటూ ఉవ్వెత్తున పెద్ద అలకు మల్లే ఎగసి పడింది. ఎంత వేగంగా పైకి దూకిందో అంతే వేగంగా మళ్ళీ దభాలున కొండకు మల్లే నీళ్ళలో పడిపోయింది. ఆ చేప అలా మళ్ళీ మళ్ళీ పైకెగిరి దూకుతూనే ఉంది. పడవ వేగంగా కదులుతోంది. దానికి వ్యతిరేక దిశలో తీగ కూడా అంతే వేగంగా పైకి కిందకు కదులుతూ ఉంది. ముసలోడు మాత్రం తన పట్టును అంతకంతకు బిగిస్తూనే ఉన్నాడు. అతడు తన పట్టును తీగ తెగే దాకా అంతకంతకు ఎక్కువ చేస్తున్నాడు. అంతలో ఆ చేప లాగుడికి ముసలోడు ఒక్క ఉదుటున పడవ మీద

ముందుకు తూలి పడ్డాడు. అలా పడటం మూలంగా అతడి ముఖం అక్కడ కోసి పెట్టి ఉన్న డాల్ఫిన్ ముక్కకు దబ్బుమని తగిలింది. అతడు ఇక కదలలేకపోయాడు.

దీని కోసమేనా నేను ఇంత సేపూ ఎదురుచూస్తోంది అనుకున్నాడు ముసలోడు. లాగనియ్ ఎంత సేపు లాగుతుందో చూద్దాం. ఇంతకింత బదులు తీర్చుకోవాలి అనుకున్నాడు. అది తన బాకీని వడ్డీతో సహా చెల్లిస్తుంది.

అలా ముందుకు పడి ఉన్న అతడికి చేప ఎగరటం కనిపించలేదు కానీ అది పైకి దూకటం మళ్ళీ కింద పడటం మూలంగా నీళ్ళలో కలిగే శబ్దాలు మాత్రం అతడి చెవులకు వినిపిస్తూనే ఉన్నాయి. తీగ కదిలే వేగానికి అతడి చేతులు విపరీతంగా కోసుకుపోతున్నాయి. అతడికి ముందు నుంచీ తెలుసు. చేపలు పట్టే వాళ్లకి ఇలాంటి అనుభవాలు మామూలే. అతడు మాత్రం తీగ తన మొద్దు బారిన చర్మం మీద నుంచి జారి అర చేతులు వేళ్ళు కోసుకుపోకుండా ఉండేలా సాధ్యమైనంత వరకు జాగ్రత్త పడుతున్నాడు.

ఇప్పుడు పిల్లోడు తనతో పాటు ఉండి ఉంటే తీగ చుట్టలను తడిపేవాడు. అవును. పిల్లోడుంటే ఎంత బాగుండేది.

గాలం తీగ అదే పనిగా జారి పోతోంది. కానీ కొద్ది సేపటి తర్వాత వేగం తగ్గింది. చేప దానికి ఇష్టమొచ్చినంత తీగను ఇష్టమొచ్చినంత సేపు లాక్కునేలా ముసలోడు చేపకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడు. పడవ మీద డాల్ఫిన్ మాంసం ముక్కలో నుంచి తన తలను ముసలోడు పైకి ఎత్తాడు. మాంసం ముక్క మీద తన బుగ్గ గుర్తు పడింది. కొంచెం పైకి లేచి మొదట మోకాళ్ళ మీద కూర్చున్నాడు. తర్వాత నెమ్మదిగా పైకి లేచి తన కాళ్ళ మీద నుంచోగలిగాడు. అతడు చాలా నెమ్మది నెమ్మదిగా తన చేతిలోని గాలం తీగను సడలిస్తున్నాడు. కిందకు చూడకుండా గాలం తీగ చుట్టలు తన కాలికి తగిలిన చోటకు వెళ్ళి నుంచున్నాడు. చేప లోపలికి లాక్కోగా బయట ఇంకా చాలా తీగ మిగిలి ఉంది. లోపలికి జారిపోయినా తీగను ఇక ఆ చేప గట్టిగా లాగాలి అనుకున్నాడు.

అది ఇప్పటికే పది పన్నెండు సార్లు పైకెగిరి పడింది. అలా ఎగరటం మూలంగా దాని పొట్టంతా గాలితో నిండి ఉంటుంది. కాబట్టి అది చాలా లోతుకు పోయి అక్కడ చచ్చే ఆస్కారం లేదు. పొరపాటున అది నీటి అడుగుకు పోయి చచ్చిందంటే దాన్ని పైకి తీసుకురావటం నా తరం కాదు. అది ఖచ్చితంగా సుళ్ళు తిరగటం మొదలు పెడుతుంది. అదిగో అప్పుడు దాని పని పడతాను. అది ఇంత అకస్మాత్తుగా ఇలా ప్రవర్తించటానికి కారణం ఏమై ఉంటుందబ్బా? ఆకలేసి దిగులుపడిందా లేకపోతే చీకట్లో దేన్నన్నా

చూసి భయపడిందా? బహుశా దానికి భయంపుట్టి ఉండొచ్చు. కానీ అది చూడటానికి చాలా గట్టిగా బలంగా ఉంటుంది. పైగా చాలా నెమ్మదిగా నిబ్బరంగా ఆత్మ విశ్వాసంతో తొణికిసలాడుతూ కనపడింది. ఇదంతా చాలా వింతగా ఉంది.

"ముసలోడా నువ్వు మాత్రం ధైర్యంగా నిబ్బరంగా నమ్మకంగా ఉండు" అని తనకు తాను చెప్పుకున్నాడు. "తిరిగి నువ్వు దాన్ని పట్టుకుంటున్నావ్. తీగ సంగతి మాత్రం మార్చిపో. ఇంకా కొద్ది సేపట్లో అది తిరగటం మొదలు పెడుతుంది."

తీగను తన భుజాల మీద వేసుకుని ఎడమ చేత్తో పట్టుకున్నాడు. పడవ అంచు మీద నుంచి ముందుకు వంగి తన కుడి చేత్తో నీళ్ళను తీసుకుని ముందుకు పడినప్పుడు తన ముఖానికి అంటిన చితికి పోయిన డాల్ఫిన్ మాంసాన్ని కడుక్కున్నాడు. ముఖానికి అంటిన మాంసం గుజ్జు మూలంగా కడుపులో దేవినట్టు ఉండి వాంతి అవుతుందేమోనని అతడు భయపడ్డాడు. ఒక వేళ వాంతి చేసుకుంటే కడుపులోని తిండితో సహా వంట్లో శక్తి కూడా పోతుందని అతడి భయం. ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాత అతడు తన కుడి చేతిని పడవ పక్కన నీళ్ళలో కడుక్కుని ఆ చేతిని అలానే కొంచెం సేపు ఉప్పు నీళ్ళలో ఉంచాడు. అప్పుడే సూర్యోదయానికి ముందు చీకట్లను చీల్చుకుంటూ వచ్చే వెలుతురును చూస్తూ ఉన్నాడు. ఇప్పుడు తన ప్రయాణం దాదాపు తూర్పు దిక్కుగా సాగుతోంది అనుకున్నాడు. దీనర్థం, చేప పడవను లాగి లాగి అలసిపోయి ఇక ప్రవాహపు వాలుకు పోతున్నదని. ఈ చేప ఇక సుళ్ళు తిరగటం మొదలవుతుంది. ఆ తర్వాత మొదలవుతుంది అసలు పని.

తన కుడి చేతిని నీళ్ళలో చాలా సేపటి నుంచి పెట్టి ఉంచాననే విషయం గుర్తుకొచ్చి దాన్ని బయటకు తీసి తేరిపార చూసుకున్నాడు ముసలోడు.

"ఇప్పుడు కొంచెం పర్వాలేదనిపిస్తోంది" అనుకున్నాడు. "నొప్పి అనేది మనిషికి పెద్ద లెక్కలోకి రాని విషయం. అది మనిషి ఆత్మవిశ్వాసాన్ని ఇసుమంతైనా కదల్చలేదు."

తన చేతికున్న గాయాలకు తగలకుండా అతడు గాలం తీగను చాలా జాగ్రత్తగా పట్టుకుని కొంచెం ఎడమ పక్కకు వంగి ఎడమ చేతిని పడవ అంచు నుంచి సముద్రంలోని నీళ్ళలో పెట్టాడు. అతడి ఎడమ చేతిని చూస్తూ దానితో అన్నాడు "నువ్వేమీ పనికి మాలిన వాటి కోసం ప్రయత్నం చేసి గాయాలపాలవ్వలేదు. కానీ కొన్ని సార్లు నువ్వు నాకు సాయం చేయలేదు".

నేను రెండూ మంచి చేతులతో ఎందుకు పుట్టలేదు? అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. బహుశా రెండో చేతికి కూడా మొదటి చెయ్యంత బాగా తర్ఫీదు ఇవ్వటంలో నా లోపం ఉంది అనుకున్నాడు. కానీ ఏదైనా ఒక విషయం నేర్చుకోవటానికి

మొదటి చేతికి ఎంత అవకాశం ఉందో రెండో చేతికి కూడా అంతే అవకాశం ఉంది. అయితే ఈ చెయ్యి రాత్రి ఒక సారి కొంచెం బెణికింది తప్పించి మిగతా పనిలో బాగానే సాయం చేసింది. ఈ సారి బెణికిందో ఇక దీన్ని తాడుతో కోసేస్తాను. పీడ వదిలిపోద్ది.

తన బుర్ర సరిగ్గా పని చేయటం లేదని అతడు అనుకున్నాడు. అలా అనుకోగానే డాల్ఫిన్ మాంసాన్ని కొంచెం నములుదామని తలచాడు. కానీ నావల్ల కాదు అని తనకు తాను చెప్పుకున్నాడు. అనవసరంగా తిని సయించక వాంతి చేసుకుని ఓపిక పోగొట్టుకునే బదులు తెలివి తప్పిపోవటమే మంచిది అని అనుకున్నాడు. ముందుకు తూలి పడ్డప్పుడు నా ముఖం నిండా అద్దుకుపోయింది. అలాంటి ఈ డాల్ఫిన్ మాంసాన్ని తిన్నా పొట్ట లోపల అది ఇమడదు. ఆ విషయం నాకు బాగా తెలుసు. అత్యవసర పరిస్థితుల్లో దీని అవసరం ఉండొచ్చేమో అది పాడయ్యేదాకా దాన్ని అలా పడి ఉండనిస్తాను అనుకున్నాడు. శక్తి, బలం పొందటం కోసం ఇప్పుడు దీన్ని తినటం వల్ల పెద్ద ఉపయోగం ఉండదు. నువ్వు ఉత్తపనికి మాలిన వెధవ్వి అని తనను తానే తిట్టుకున్నాడు. దీన్ని వదిలేసి వేరేగా పడి ఉన్న పిచ్చుక మీనను తిను అని అనుకున్నాడు.

చక్కగా శుభ్రం చేసి అక్కడ సిద్ధంగా పెట్టి ఉన్న పిచ్చుక మీనను ఎడమ చేత్తో అందుకున్నాడు. మాంసం నుంచి ఎముకలను వేరు చేసి వాటిని జాగ్రత్తగా ఆమూలాగ్రం చీకాడు. చేప మొత్తాన్ని దాని తోక దాకా నమిలి తినేశాడు.

దాదాపు అన్ని చేపల కంటే కూడా ఈ చేప ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది అని అనుకున్నాడు ముసలోడు. కనీసం నాకు అవసరమైన ఓపిక మాత్రం ఈ చేపను తిని పొందొచ్చు. ఇప్పుడు నేను చేయగలిగింది చేశా అనుకున్నాడు. ఇప్పుడు దాని వంతు. అది సుడులు తిరగటం మొదలు పెడితే ఇక మా ఇద్దరి మధ్య యుద్ధం మొదలైనట్టే.

అతడు సముద్రం మీదకు వేటకు వచ్చాక సూర్యుడు మూడోసారి ఉదయిస్తున్నాడు. సరిగ్గా అప్పుడే చేప సుడులు తిరగటం మొదలుపెట్టింది.

నీళ్ళలో ఉన్న గాలం తీగ పక్కగా లోపలికి చూసిన అతడికి గిరికీలు కొడుతున్న చేప కనపడలేదు. ఆ గిరికీలు అతడి కళ్ళబడటానికి ఇంకా కొంచెం సమయం పడుతుంది. గాలం తీగ బిగుతు కొంచెం మందగించినట్టు అతడికి అనిపించింది. కుడి చేత్తో తీగను పట్టుకుని నెమ్మదిగా లాగటం మొదలుపెట్టాడు. ఎప్పటి లాగానే తీగను ఇంకా లాగితే తెగుతుంది అనిపించే దాకా గట్టిగా లాగాడు. కానీ పైకి లాగే కొద్దీ తీగ అలా వస్తూనే ఉంది. తన భుజాలు వీపుకు చుట్టుకుని ఉన్న తీగను తప్పించి దాన్ని అతను నెమ్మదిగా స్థిరంగా పైకి లాగటం మొదలు పెట్టాడు. తన శరీరంలోకి కాళ్ళలోకి బలాన్ని

కూడదీసుకుని తీగను రెండు చేతులతో గట్టిగా పట్టుకుని ఉయ్యాలలా పైకి కిందకు ఊగుతూ దాన్ని పైకి లాగటం ప్రారంభించాడు. అతడి ముసలి కాళ్ళను భుజాలను ఇరుసులాగా ఉపయోగించి శక్తికొద్దీ తీగను లాగుతున్నాడు.

"ఇది చాలా పెద్ద వలయం. కానీ అది మాత్రం గుండ్రంగా తిరుగుతోంది" అన్నాడు. అలా అతడు లాగుతూ ఉండగా తీగ ఇక పైకి రాకుండా బిగుతుగా తయారయ్యింది. దానితో పాటు పైకి చేరిన నీళ్లు బొట్లు బొట్లుగా కిందపడుతోంది. ఆ చుక్కలు ఎండకు మెరుస్తున్నాయి. అంతలో తీగ మళ్లీ లోపలకు గుంజటం మొదలైంది. ముసలోడు మోకాళ్ళ మీద కూర్చుని పట్టును సడలించి తీగను నెమ్మదిగా కొంచెం కొంచెంగా వదిలిపెట్టాడు.

"ఈ చేప ఇప్పుడు పెద్ద పెద్ద గిరికీలు కొడుతోంది" అన్నాడు. నా శక్తి మేర తీగను ఒడిసి పట్టుకుంటా అనుకున్నాడు. ఇలా నేను ఈ తీగను ఎంత ఎక్కువగా లాగి పట్టుకుంటే చేప వేసే గిరికీలు అంత చిన్నగా ఉంటాయి. బహుశా ఇంకో గంటలో అది నాకు కనపడుతుంది. ముందు దాన్ని బుజ్జగించి బతిమాలి తర్వాత కసి తీరా చంపుతా అని అనుకున్నాడు.

చేప మాత్రం చిన్నచిన్నగా గిరికీలు కొడుతూనే ఉంది. ముసలోడికి చమటలు పట్టి వళ్ళంతా తడిసి ముద్దయ్యింది. అతడు బాగా అలసిపోయాడు. రెండు గంటల తర్వాత అతడి ఎముకల్లో సత్తువ బొత్తిగా నశించిపోయింది. అంతకంతకు చేప వేసే గిరికీలు చాలా చిన్నగా ఉన్నాయి. తీగ కదిలే తీరును బట్టి చేప నెమ్మదిగా నీళ్ళలో పై పైకి లేచి ఈదుతున్నదని అతడికి అర్థమయింది.

ఒక గంట పాటు ముసలోడికి కళ్ళు బైర్లు కమ్మి తన కళ్ళ ముందు నల్లటి మచ్చలు కనబడ్డాయి. ధారాపాతంగా కారిన చెమటకు కళ్లు, నుదురు, కనురెప్ప దగ్గర గాయం ఉప్పురిసి పోయాయి. తన కళ్ళ ముందు నాట్యమాడుతున్న నల్ల మచ్చలను చూసి అతడు బెదిరిపోలేదు. చాలా గట్టిగా తీగను పట్టుకుని లాగేటప్పుడు అలసిపోయి నీరసం వస్తే కళ్ళ ముందు ఇలాంటి నల్లటి చుక్కలు మచ్చలు కనిపిస్తాయని అతడికి తెలుసు. అయితే రెండు సార్లు అతడికి చాలా నీరసంగా, కళ్ళు బైర్లు కమ్ముతున్నట్లు అనిపించింది. ఇలా జరగటం అతడ్ని ఒకింత ఆందోళనకు గురిచేసింది.

"నా పనిలో అదీ ఇలాంటి చేపను పట్టేటపుడు అంత తేలికగా ఓడిపోయి చావను" అని అన్నాడు. "ఈ చేప నా చేతికి చిక్కబోతోంది. దేవా అంతదాకా నాలో ఓపిక ఆవిరవకుండా నాకు సహాయం చెయ్యి. నేను నూరు మార్లు నీకూ మేరీమాతకు ప్రార్థనలు చేస్తా. ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో చెప్పలేను."

ప్రస్తుతానికి నేను ఆ ప్రార్థనలు చెప్పినట్లే భావించు అని అతడు అనుకున్నాడు. తర్వాత ఖచ్చితంగా చెప్తాను. ఇంతలో తాను రెండు చేతులతో పట్టుకుని ఉన్న తీగను ఏదో అకస్మాత్తుగా గట్టిగా లాగినట్టు మోదినట్టు అతడికి అనిపించింది. అదీ చాలా వేగంగా గట్టిగా భారీగా మోదినట్టు అనిపించింది.

చేప తన తోకతో తీగ మొదట్లో బాదుతోంది అనుకున్నాడు. ఈ పరిస్థితి ఎప్పటికైనా రావాల్సిందే. అది అలా చెయ్యక తప్పదు. అలా చెయ్యటం వల్ల చేప పైకెగిరి దూకొచ్చు. కానీ ఇప్పుడు అది దూకకుండా గిరికీలు తిరుగుతుంటేనే బాగుంటుంది. చేప గాలి పీల్చుకోవటానికి పైకెగిరి దూకాల్సి వస్తుంది. అలా దూకటం మూలంగా దాని నోట్లో గాలం ముల్లు పట్టివున్న గాయం పెద్దదవుతుంది. గాలం వదులయ్యి చేప దానిని ఊసెయ్యొచ్చు.

"ఎగరొద్దు చేపా ఎగరొద్దు" ముసలోడు అన్నాడు.

చేప ఆ తీగను తన తోకతో చాలా సార్లు కొట్టింది. అది అలా కొట్టినప్పుల్లా దాని తల కదులుతుండటంతో ముసలోడు చేతిలోని తీగను కొంచెం కొంచెంగా వదులుతూ ఉన్నాడు. దానికి నొప్పి తగ్గకుండా అలాగే ఉండేలా చూడాలి అనుకున్నాడు. నా నొప్పి నాకు లెక్కలోకి రాదు. నేను ఓర్చుకోగలను. కానీ ఆ చేపకు కలిగే నొప్పి మూలంగా దానికి పిచ్చెక్కినట్టు ఉంటుంది.

కొద్దిసేపటి తర్వాత చేప తీగను బాదటం ఆపి నెమ్మదిగా గిరికీలు కొట్టటం మొదలుపెట్టింది. ముసలోడు చేతిలోని తీగను బిగించి పట్టుకుంటున్నాడు. మళ్ళీ అతడికి నీరసంగా అనిపించింది. ఎడమ చేత్తో సముద్రంలో నుంచి కొద్దిగా నీళ్ళు తీసుకుని తల మీద చల్లుకున్నాడు. ఇంకొంచెం నీళ్ళు తీసుకుని తల మీద పోసుకుని మెడ వెనుక రుద్దుకున్నాడు.

"నాకు తిమ్మిర్లు కానీ బెణుకులు కానీ ఏమీ లేవు" అన్నాడు. "ఈ చేప త్వరగా పైకి వస్తుంది. అప్పటిదాకా నాకేమీ కాదు. నాకు ఏమీ కాకూడదు. అసలేమైనా అవుతుందన్న మాటే వద్దు" పెద్దగా అన్నాడు ముసలోడు.

ముసలోడు ఒక్క క్షణం పడవ మీద మోకాళ్లానించి కూర్చుని తన వీపు మీద ఉన్న తీగను సర్దుకున్నాడు. ఇప్పుడు చేప గిరికీలు కొడుతోంది. గిరికీలు ఆపేశాక దాని సంగతి చూస్తా. అప్పటి దాకా కొంచెం సేపు పడుకుంటా అని అతడు ఒక నిర్ణయానికి వచ్చాడు.

చేపను దాని మానాన గిరికీలు కొట్టుకోమని వదిలేసి గాలం తీగను లాక్కెళుతున్నా పట్టించుకోకుండా పడవలో హాయిగా పడుకుందామని బలంగా అనిపించింది. అంతలో

చేప పడవ వైపు రావటానికి కదులుతున్నట్టు తీగ కదలికను బట్టి ముసలోడికి అర్థమయ్యింది. అతడు లేచి నుంచుని చేతిలో ఉన్న తీగను బావిలో నీళ్ళు తోడుతున్నట్టు శక్తి కొద్దీ పైకి లాగి పోగు పెట్టాడు.

నాకు చాలా అలసటగా ఉంది. ఇంతకుముందు ఎప్పుడూ నేను ఇంత అలసటకు గురవ్వలేదు. ఇప్పుడు తూర్పు గాలి కూడా పెరుగుతోంది. ఇది చేపను పట్టుకోవటంలో నాకు సాయం చేస్తుంది. దీంతో నాకు చాలా అవసరముంది.

"చేప ఈసారి లోపలికి పోయినప్పుడు కొంచెం సేపు పడుకుంటా. ఇప్పుడు కొంచెం తేలికగా అనిపిస్తోంది. చేప ఇంకో రెండు మూడు సార్లు తిరిగొచ్చిన తర్వాత దానిని పట్టేస్తా" అన్నాడు.

తల మీద అతడి ఈనెల టోపీ బాగా వెనక్కు వెళ్ళింది. చేప మరోసారి తీగను లాగినట్టు అనిపించింది. ఆ ఊపుకు అతడు పడవ మీద కూలబడ్డాడు.

చేపా ఇప్పుడు నీ వంతు. నీ పని నువ్వు చెయ్యి అనుకున్నాడు. ఈ సారి నువ్వు పైకి వచ్చినప్పుడు నీ సంగతి చూస్తా.

సముద్రంలో నీటి మట్టం పెరిగింది. చల్లగా వీచే గాలి మాత్రం అనుకూలమైనదే. అతడు ఇంటికి తిరిగి వెళ్లటానికి ఈ గాలి అవసరం.

"పడవను ఇప్పుడు నైరుతి దిక్కుగా నడుపుతా. సముద్రం అనేది ఒక పెద్ద పొడవైన దీవి. దీంట్లో మనిషి ఎప్పుడూ తప్పిపోడు" అతడు అన్నాడు.

చేప మూడోసారి పైకి వచ్చినప్పుడు ముసలోడు దాన్ని మొదటిసారిగా చూశాడు.

అది అతడికి మొదట తన పడవ కింద నుంచి వెళుతున్న ఒక నల్లని నీడలా కనిపించింది. అది నమ్మశక్యం కానంత పొడవుగా ఉంది.

"లేదు. లేదు. ఆ చేప ఇంత పెద్దదై ఉండదు" అతడు నమ్మలేనట్టుగా అరిచాడు.

కానీ నిజానికి అది చాలా పెద్ద చేప. ఈసారి ఆ చేప లోపలికెళ్ళి మళ్ళీ తిరిగి పైకి వచ్చింది. ఇప్పుడు అది పడవకు ముప్పై గజాల దూరంలో ఉంది. నీళ్ళలో పైకి తేలిన చేప తోకను చూశాడు ముసలోడు. చాలా పొడవుగా ఉందా తోక. ముదురు నీలవర్ణంలో ఉన్న సముద్రపు నీటిపైన లేత వంగ వర్ణంలో కనిపిస్తోంది. చేప తోకను నీళ్ళలోకి లాక్కుంది. అది ఇప్పుడు నీళ్ళలో పైపైనే ఈదుతూ పోతోంది. ఇప్పుడు ముసలోడికి దాని బ్రహ్మాండమైన ఆకారం చక్కగా కనిపిస్తోంది. చేప ఒంటి మీదున్న వంగ పండు రంగు చారలు దానికి కట్టిన తాళ్ళలా కనపడుతూ ఉన్నాయి. దాని వీపు మీద రెక్క కిందకు చూస్తున్నట్టు వంగి ఉంది. దానికి రెండు వైపులా ఉన్న రెక్కలు బాగా పరుచుకుని ఉన్నాయి.

ఈసారి ముసలోడికి ఆ చేప కన్ను కనిపించింది. దానితో పాటే చేప అనుగ్రహం కోసం పడి చస్తున్నట్టు దాని చుట్టే ప్రదక్షిణలు చేస్తున్న బూడిద రంగులో ఉన్న రెండు బొమ్మిడాయలు కూడా కనిపించాయి. అవి చేపను అంటిపెట్టుకునే తిరుగుతున్నాయి. కొన్ని సార్లు దానికి దూరంగా వెళుతున్నాయి. ఇంకొన్ని సార్లు దాని నీడలో ఈదుతున్నాయి. ఆ రెండు కూడా ఒక్కోటి మూడు అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉన్నాయి. అవి నీళ్ళలో వేగంగా ఈదేటప్పుడు మలుగు చేపలకు మల్లే వాటి మొత్తం శరీరాన్ని కదిలిస్తున్నాయి.

ముసలోడికి బాగా చెమటలు పడుతున్నాయి. అతడి చెమటలకు ఎండ ఒక్కటే కారణం కాదు. ఇంకా ఏదో కారణం ఉంది. చేప ప్రశాంతంగా నిమ్మళంగా కదిలినప్పుడల్లా ముసలోడు తీగను పైపైకి లాగుతున్నాడు. ఇంకో రెండు సార్లు అది అలా పైకి కిందకు కదిలితే చాలు తన ఈటె కర్రను దాని శరీరంలోకి గుచ్చే వీలు చిక్కుతుంది. గుచ్చాలంటే అది మరింత దగ్గరకు రావాలి అని అనుకున్నాడు. దాని తలలో కాకుండా గుండెల్లో గుచ్చటానికి ప్రయత్నం చెయ్యాలి.

"నింపాదిగా, నిబ్బరంగా ఉండరా ముసలోడా" అన్నాడు.

అది మళ్లీ గిరికీ కొట్టి వచ్చినప్పుడు దాని తల భాగం నీటి పైకి వచ్చి కనపడింది. కానీ అది పడవకు కొంచెం దూరంలో ఉంది. ఆ తర్వాత మళ్లీ వచ్చినపుడు బాగా పైకి తేలి కనపడింది కానీ ఇంకా కొంచెం దూరంలోనే ఉంది. ఇంకా కొంచెం తీగను తన వైపుకు లాక్కుంటే ఖచ్చితంగా దగ్గరకి వస్తుంది అనుకున్నాడు ముసలోడు.

ముసలోడు ఈటె కర్రను ఎప్పుడో సిద్ధం చేసి పెట్టాడు. దానికి ఒక వైపు కట్టి ఉన్న సన్నని తాడు చుట్టను దగ్గరలోని గుండ్రని బుట్టలో పెట్టాడు. తాడు రెండో కొనని పడవ కొయ్యకు కట్టాడు.

ఈసారి చేప పెద్దగా ఉన్న దాని తోకని ఊపుకుంటూ నింపాదిగా అందంగా పైకి వచ్చింది. దాన్ని తనకు మరింత దగ్గరకు లాక్కోటానికి ముసలోడు తన ఓపిక కొద్దీ ప్రయత్నం చేశాడు. చేప ఒక్క క్షణం పాటు కొంచెం పక్కకు ఒరిగింది. మళ్ళీ సమతలమైన తీరులోకి వచ్చి తిరిగి వెంటనే మరో గిరికీ మొదలుపెట్టింది.

"దాన్ని నేను లాగగలిగాను" అని ముసలోడు బిగ్గరగా అరిచాడు.

మళ్ళీ తనకు నిస్సత్తువుగా తోచింది. అయినా తన శక్తినంతా ఉపయోగించి ఆ చేపను లాగి పట్టుకున్నాడు. నేను దాన్ని కదల్చగలిగాను అనుకున్నాడు. బహుశ ఈసారి మాత్రం దాన్ని పట్టేస్తా. చేతుల్లారా ఓపిక తెచ్చుకొని గట్టిగా లాగండి అన్నాడు. కాళ్ళలారా మీ పట్టు సడలనియ్యొద్దు. తలా, దయ చేసి నా కోసం నువ్వు పని చెయ్యటం మానొద్దు.

నాకు సహకరించు. నువ్వెప్పుడూ నన్ను వదిలిపోవనుకో. ఈసారి ఆ చేపను ఖచ్చితంగా పట్టి పడవ మీదకు లాగి తీరుతా.

చేప తనకు దగ్గరగా రాక ముందు ముసలోడు దాన్ని తన శక్తి మేర పట్టి లాగాడు. అది తనకు దగ్గరలోకి వచ్చినట్టే వచ్చి మళ్ళీ అటు తిరిగి ఈదుకుంటూ దూరంగా వెళ్ళిపోయింది. "ఒసే చేపా నేను మాత్రం నిన్ను ఏదో రకంగా చంపి తీరుతా. నీకు కూడా నన్ను చంపాలనిపిస్తోందా?"

అలాగైతే ఒరిగేదేమీ లేదు. అతని నోరు ఎండిపోయింది. అతడు మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. అయినా నీళ్ళు తీసుకుని తాగే పరిస్థితి కాదిప్పుడు తనది. ఈసారి మాత్రం దాన్ని పడవ దగ్గరగా లాగాలి అనుకున్నాడు. ఇంకా వేచి చూడటం తన వల్ల కాదు. లేదు నువ్వు వేచి చూడగలవు. నీకు ఓపిక చాలా ఎక్కువ. తనకు తాను చెప్పుకున్నాడు ముసలోడు. ఆ తర్వాత దఫా ముసలోడు దాన్ని దాదాపుగా పట్టేసినంత పని చేశాడు. కానీ ఇంతకు ముందుమల్లే ఆ చేప చిక్కినట్టే చిక్కి తను ఈదే దిశ మళ్ళించి దూరంగా వెళ్ళిపోయింది.

నువ్వు నన్ను చంపుతున్నావే అన్నాడు ముసలోడు. అయినా నీకు ఆ హక్కు ఉంది తమ్ముడూ. నీలాంటి ఒక గొప్ప అందమైన నిబ్బరమైన రాచఠీవి గల చేపను నేను ఇంత వరకూ చూడలేదు. రా. వచ్చి నన్ను చంపు. ఎవరు ఎవరిని చంపుతారనే దాని గురించి నేను పట్టించుకోను.

"ఇప్పుడు నీ బుర్రలో ఆలోచనలు గందరగోళంగా ఉన్నాయి" ముసలోడు అనుకున్నాడు. "నీ బుర్రను ప్రశాంతంగా ఉంచుకో. మనిషిలా కష్ట నష్టాలకు ఓర్చుకో. లేకపోతే చేపలా ఎలా కష్టనష్టాలు ఓర్చుకోవాలో నేర్చుకో అనుకున్నాడు.

"బుర్రలో పిచ్చిపిచ్చి ఆలోచనలు తుడిచెయ్" ముసలోడు అన్న మాట అతడికే నూతిలోంచి వినిపించిన గొంతులా సన్నగా వినిపించింది. ఇంకో రెండు మార్లు ఆ చేప దగ్గరకు వచ్చినట్టే వచ్చి మళ్ళీ దూరంగా మరలిపోయింది. నాకేం అర్థంకావట్లేదు ముసలోడు అనుకున్నాడు. అది దగ్గరకు వచ్చినట్టే వచ్చి మళ్ళీ వెనక్కు వెళ్ళిపోతోంది. అసలేం అర్థం కావట్లేదు. అయినా ఇంకోసారి ప్రయత్నం చేసి చూస్తా.

అతను ఇంకోసారి తీగ లాగి చూశాడు. ఊహూ. అది దగ్గరకు వచ్చినట్టే వచ్చి తన పెద్ద తోకను వయ్యారంగా ఊపుకుంటూ మళ్ళీ వెనక్కు మరలిపోయింది.

ఇంకోసారి ప్రయత్నం చేస్తా ముసలోడు తనకు తాను చెప్పుకున్నాడు. అతడి చేతులు వణుకుతున్నాయి. కంటి చూపు మందగించి కళ్ళ ముందు మెరుపుల్లా అగపడుతున్నాయి.

అతడు మరోసారి ప్రయత్నం చేశాడు. ఫలితం శూన్యం. షరా మామూలే. అతడు

మొదలుపెట్టక ముందే తన ప్రయత్నం విఫలమవుతున్నట్టు భావించాడు. అయినా మరోసారి ప్రయత్నం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

చేపను బంధించే ప్రయత్నంలో ముసలోడు అలసిపోయాడు. అయినా పట్టు విడవకుండా నొప్పిని పంటి బిగువున భరిస్తూ, ఎముకల మూలల్లో మిగిలివున్న శక్తిని కూడగట్టుకుని ఎప్పుడో ఆవిరైపోయి అడుగంటిన ఆత్మాభిమానం తాలూకు భేషజాన్ని చూపుతూ.. బాధపడుతున్న చేపను పట్టటానికి సిద్ధమయ్యాడు. చేప నెమ్మదిగా ఈదుకుంటూ అతడు కోరుకున్నట్టే పడవ పక్కకు చేరింది. దాని ముక్కు దాదాపు పడవ వెలుపలి బల్లను తాకుతోంది. పొడవుగా వెడల్పుగా లోతుగా ఉన్న చేప వెండి రంగులో మెరుస్తూ పడవను దాటుకుంటూ కదలిపోయింది.

ముసలోడు తన చేతిలో ఉన్న గాలం తీగను కింద పడేసి తన పాదాన్ని దాని మీద వేసి అదిమి పెట్టాడు. చేతుల్లోని బరిసెను తనకు చేతనయినంత పైకి గాల్లోకి ఎత్తి తన శరీరంలో మిగిలి ఉన్న శక్తిని కూడగట్టుకుని చేతుల్లోకి తెచ్చుకుని ముందుకు పొడిచాడు. చేప వీపుమీద ఉన్న రెక్క దాదాపు అతడి ఛాతీ అంత ఎత్తు ఉంది. దానికి ఆవలగా చేప పక్కటెముకల్లో బల్లెం గుచ్చాడు. బల్లెం ఇనప చువ్వ చేప లోపలికి దిగబడటం అతడికి తెలుస్తోంది. లోపలికంటూ దిగిన బల్లేన్ని అలాగే పట్టుకుని అటూ ఇటూ దాని శరీరం లోపల తిప్పి తన బరువంతటినీ దాని మీద మోపి ఇంకా లోపలకు నెట్టాడు.

ఆ బల్లెం దిగబడటంతో చేప ఒక్కసారిగా ఉవ్వెత్తున ఎగిరింది. బ్రహ్మాండమైన తన ఒడ్డూ పొడుగూ భీకరమైన బలాన్ని, అందాన్ని చూపుతూ అది నీళ్ళలో నుండి పైకి లేచింది. కొంచెం సేపు అది పడవలో నుంచుని ఉన్న ముసలోడి నెత్తి పై పడుతున్నట్టు అనిపించింది. తర్వాత అది కొండచరియ విరిగినట్టు దబ్బుమని పడవ పక్కనే నీళ్ళలో పడింది. ఆ ఉదుటుకు చిమ్మిన నీళ్లు ముసలోడ్ని, వాడి పడవను తడిపి ముద్ద చేశాయి.

ఈ హఠాత్పరిణామానికి ముసలోడికి నీరసం ఆవహించి తెలివితప్పిపోయినట్లు అనిపించింది. కళ్ళు బైర్లు కమ్మి సరిగ్గా చూడలేకపోయాడు. అలానే ఎలాగో బరిసెకు కట్టి ఉన్న తాడును తన గాయాల పాలయిన చేతులతో సరి చేశాడు. అతడు తేరుకున్న తర్వాత చేప వెండిలా తెల్లగా ఉన్న పొట్టను పైకి తేల్చి వెల్లికలా పడి ఉండటాన్ని చూశాడు.

చేపకు గుచ్చిన బరిసె పిడి దాని భుజాల చాటుగా వంకరగా కోణంలా కనిపిస్తోంది. చేప గుండెల్లో నుంచి కారుతున్న చిక్కని రక్తం సముద్రం నీళ్ళను ఎర్రబారుస్తోంది. మొదట్లో నీలి వర్ణంలో ఉండే నీరు ఒక మైలు మేర లోతుగా అలలకు కొట్టుకొచ్చే ఇసుక రంగులోకి మారిపోయింది. తర్వాత అది అంతకంతకు వ్యాపిస్తూ పోయి చివరకు

ఒక మేఘంలా తయారయింది. చేప ఇప్పుడు ఎదురీదడం లేదు. అలల వాలుకు కదులుతోంది.

ముసలోడు మసకబారిన చూపుతో జాగ్రత్తగా చూశాడు. బరిసె తాడును పడవ మేకు చుట్టూ రెండు చుట్లు చుట్టి తన ముఖాన్ని చేతుల్లో దాచుకున్నాడు.

"మిత్రమా నా తలను సిగ్గుతో దించుకోనివ్వు. నేనొక అలసిపోయిన ముసలివాడ్ని. కానీ నా తమ్ముడిలాంటి ఈ చేపను నా చేతులారా చంపాను. ఇప్పుడు మళ్ళీ గొడ్డుచాకిరి చెయ్యాలి" పడవతో సిగ్గుపడుతూ చెప్పాడు.

ఈ చేపను దగ్గరకు ఈడ్వటానికి అవసరమైన తాళ్ళను ఉచ్చులను సిద్ధం చెయ్యాలి అనుకున్నాడు. నాతో పాటు ఇంకొకరున్నా గానీ ఇంత భారీ చేపను ఎత్తి పడవలో కుదెయ్యటం తలకు మించిన పనే. అయినా ఈ పడవ ఇంత పెద్ద చేపకు సరిపోదు. దీన్ని దగ్గరకు నెట్టుకొచ్చి, పడవ ఎక్కించి తెర చాపెత్తి క్షేమంగా ఇంటికి చేరేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

చేపను దగ్గరకు లాగటం మొదలుపెట్టాడు. దాన్ని తనకు దగ్గరగా లాగగలిగితే దాని మొప్పల్లో నుంచి తాడును లోపలకు దూర్చి దాని నోట్లో నుంచి బయటకు లాగి ముడేసి పడవ ముందుకు లాగొచ్చు. దాన్ని చూడాలి అనుకున్నాడు. ముట్టుకుని అనుభూతి చెందాలి అనుకున్నాడు. ఈ చేప నా అదృష్టం అనుకున్నాడు. కానీ దాన్ని ముట్టుకోవాలనే నా కోరికకు కారణం ఇది కాదు. రెండోసారి నేను బరిసెను దాని గుండెల్లోకి దించినప్పుడు దాని గుండెను తాకినట్లు నాకనిపిస్తోంది. దాన్ని దగ్గరకు లాగు. దాని తోక దగ్గర ఒక ఉచ్చు నడుం దగ్గర మరో ఉచ్చు బిగించి పడవకు కట్టేయి.

"ఆలోచనలు కట్టిపెట్టి పని మొదలు పెట్టరా ముసలోడా" అన్నాడు. గుక్కెడు మంచి నీళ్ళు గొంతులో పోసుకున్నాడు. "పోరాటం ముగిసిన తర్వాత ఇప్పుడు అసలైన గొడ్డు చాకిరి చాలా చెయ్యాలి."

ముందు ఆకాశంలోకి చూసి తర్వాత చేప వంక తేరిపారి చూశాడు. పైన సూర్యుడ్ని జాగ్రత్తగా చూశాడు. సమయం ఇంకా మధ్యాహ్నాన్ని మించలేదు అనుకున్నాడు. తూర్పు నుంచి గాలి ఎక్కువగా వీస్తోంది. ఇంక వేసి ఉన్న మిగతా గాలాల వలన పెద్ద ప్రయోజనం ఉండదు. విడి విడిగా వేసిన తీగలన్నింటినీ ఒకటిగా కలిపి ముడెయ్యాలి. ఇంటికెళ్ళిన తర్వాత ఈ పనిని పిల్లోడు నేను ఇద్దరం కలిసి చేస్తాం అనుకున్నాడు.

"చేపా ఇక వచ్చెయ్" అన్నాడు. కానీ తను పిలవగానే అది రాలేదు.

చేప మాత్రం తనకు ఈ లోకంతో పని లేదన్నట్టుగా సముద్రపు నీటి తెప్పలపై తేలుతూ ఉంది. ముసలోడు తన పడవను చేపకు మరింత దగ్గరగా లాగాడు. చేప

ఇప్పుడు దాదాపు పడవకు ఆనుకుని ఉంది. అది అతడికి అతి సమీపంలో ఉంది. అయినా తను పట్టిన చేప ఇంత పెద్దదనే నిజాన్ని నమ్మలేకపోతున్నాడు. పడవ మేకుకు కట్టి ఉన్న బరిసె తాడును విప్పదీశాడు. దాన్ని చేపకు ఒకవైపు ముక్కు దూలంలో నుంచి లోపలికి దూర్చి మొప్ప గుండా బయటకు తీసి దానికి ఒక చుట్టు చుట్టాడు. తాడును రెండో దూలంలో నుంచి లోపలికి దూర్చి మరో మొప్ప గుండా బయటకు తీసి దానికి మెలికేశాడు. ఇప్పుడు తాడు రెండు అంచులను తీసుకుని గట్టిగా లాగి పడవ ముందున్న మేకుకు బిర్రుగా కట్టాడు. మిగిలిన తాడును కోసి చేప తోకకు ఉచ్చు బిగించటానికి పడవ వెనక్కు వెళ్ళాడు. లేత వంగ పండు రంగు వెండి తెలుపు రంగుల కలయికతో మెరిసే ఈ చేప ఇప్పుడు తెలుపు రంగులోకి మారిపోయింది. దాని తోక, ఒంటి మీద అడ్డంగా ఉండే వంగ రంగు చారలు కూడా పాలిపోయాయి. ఈ చారలు జాన కంటే ఎక్కువ వెడల్పే ఉంటాయి. దాని కనుగుడ్లు బయటకొచ్చి దూరదర్శినికి వేలాడే అద్దాల్లా, అందరితో కలిసి ఊరేగింపులో వెళుతూ కూడా తన లోకంలో తానుంటూ బాహ్య ప్రపంచంతో సంబంధం లేనట్టు కనబడే సాధువులా అగుపడుతున్నాయి.

ముసలోడు అన్నాడు "దీన్ని చంపే ఒకే ఒక మార్గం ఇదే" అని. ఇక ఈ చేప ముసలోడి చేతుల్లో నుంచి తప్పించుకోలేదని ఆ సముద్రంలోని నీళ్ళకు అర్థమయ్యింది. ఈ నిజం ముసలోడికి కూడా తెలిసిపోయి బాగా నమ్మకం కుదిరిన తర్వాత అతడి మనస్సు కొంచెం తేలిక పడింది. తన బుర్రలోని పిచ్చిపిచ్చి ఆలోచనలకు తెర పడింది. దాని ఆకారాన్ని బట్టి చూస్తే పదిహేను వందల పౌండ్ల కంటే ఎక్కువ బరువే ఉండొచ్చు అనుకున్నాడు. బహుశా ఇంకా ఎక్కువే ఉండొచ్చు. చక్కగా శుభ్రం చేసి కోస్తే ఈ చేప నుంచి మూడింట రెండు వంతుల మాంసం వస్తుంది. ఒక్కో పౌండు మాంసం ముప్పై సెంట్లకు అమ్మితే?

"లెక్కెయ్యాలంటే పెన్సిల్ కావాలి" అన్నాడు. "నాకు మరీ అంత తెలివి లేదు. కానీ ఈ రోజు మాత్రం డిమాగియో నన్ను చూసి గర్వపడొచ్చు. ఇంత కష్టపడినా నా ఒక్క ఎముక కూడా చిట్లిపోలేదు. అయితే నా చేతులకీ వీపుకూ విపరీతంగా గాయాలయ్యాయి." ఎముక చిట్లి పోవటం అంటే ఎట్లా ఉంటుందో నాకు తెలియదు అని అతడు అనుకున్నాడు. బహుశా నాది కూడా ఏదో ఒక ఎముక చిట్లి పోయి ఉండి ఉండొచ్చు. అయితే అలా చిట్లి పోయినట్టు నాకు తెలిసి ఉండకపోవచ్చు.

ముసలోడు చేప తలను పడవ ముందు, మధ్య భాగాన్ని పడవ అడ్డ దూలానికి వేసి గట్టిగా కట్టాడు. చేప చేపలా కాకుండా తన పడవకు ఆనుకుని పక్కనుంచి వెళ్ళే మరో పెద్ద పడవలా కనిపిస్తోంది. గాలం తీగ నుంచి ఒక చిన్న ముక్క కోసి చేప కింది

దవడకు కట్టి దాన్ని పట్టి రెండో కొసను తన మచ్చు కత్తికి కట్టాడు. ఇలా చేయటం మూలంగా చేప నోరు మూసుకుని ఉంటుంది. ఒడ్డు చేరే దాకా చెడిపోకుండా సాధ్యమైనంత శుభ్రంగా ఉంటుంది. తర్వాత ముసలోడు పడవ స్థంబాన్ని ఎత్తాడు. తన బరిసె కర్రతో మాసికలు పడిన తెర చాపను ఎత్తి దాని అంచును పడవ మేకుకు ముడేశాడు. ఇక పడవ కదలటం మొదలు పెట్టింది. పడవ వెనుక సొరగిల్లి పడుకుని ముసలోడు నైరుతి దిశగా కదలిపోయాడు.

నైరుతి దిక్కు ఎటు వైపుందో కనుక్కోటానికి అతడికి దిక్సూచి అవసరం లేదు. కేవలం తూర్పు నుంచి పశ్చిమానికి వీచే గాలి స్పర్శ, పడవ నడిచే వేగాన్ని బట్టి చెప్పగలడు పడవ ఏ దిక్కుకు వెళుతుందనేది. సముద్రం నీళ్ళు వేడెక్కుతున్నాయి. అందువల్ల ఉక్కబోస్తోంది. తినటానికి తాగటానికి ఏర్పాట్లు చేసుకుంటాను. గాలం తీగకు పైన ఒక చెంచా కట్టి నీళ్ళలో వేస్తే బాగుంటుంది. నీళ్ళలో ఉప్పు చెంచాకు పట్టి ఎండిన తర్వాత ఇంతకు ముందు ఉన్న కవడ చేపల్లో నంజుకుని తినొచ్చు. అలానే గాలానికి చిన్నపాటి చేప పిల్ల ఏమన్నా దొరుకుతుందేమోనని ఆశ కూడా. అయితే అక్కడ అతడికి చెంచా దొరకలేదు సరికదా కవడ చేపలు కూడా కుళ్ళి పోయాయి. ఇక చేసేదేముంది. తన పడవ పక్కగా పోతున్న పసుపు పచ్చ నాచు తెట్టకు తన బరిసె కర్రను పట్టించి ఊపాడు. దాంట్లో చిక్కుకుని కొట్టుకు పోతున్న చిన్న చిన్న రొయ్యలు ఎగిరి పడవలోపల బల్ల మీద పడ్డాయి. అలా పడిన రొయ్యలు పది పన్నెండు కంటే ఎక్కువే ఉన్నాయి. అవి పడవలోకి దూకి ఇసుకలో ఉండే తుళ్ళు పురుగుల్లాగా ఎగిరాయి. ముసలోడు వాటి తలలను బొటన వేలు చూపుడు వేలు మధ్య పెట్టి చిదిమి వాటి పెంకులు తోకలతో సహా ఏమీ వదలకుండా చక్కగా నములుతూ తిన్నాడు. చూడటానికి అవి చాలా చిన్నవే కానీ వాటి రుచి మాత్రం అద్భుతం. అంతే కాదు అవి తింటే మంచి బలం కూడా వస్తుంది.

తన దగ్గరున్న మంచి నీళ్ళ సీసాలో మరో రెండు గుక్కల నీళ్ళు ఉన్నాయి. ఈ రొయ్యలను తిన్న తర్వాత ముసలోడు ఆ నీళ్ళలో సగం తాగేశాడు. ఇన్ని అవాంతరాల మధ్య కూడా పడవ చాలా చక్కగా కదిలిపోతోంది. ముసలోడు తన చేతిలోని చుక్కానిని పట్టుకుని దారి తీయసాగాడు. అప్పుడప్పుడు పడవకు కట్టేసిన చేపని చూస్తూ ఉన్నాడు. ఇంత పెద్ద చేపను తను పట్టుకోవటం అనేది కల కాదు వాస్తవమనే విషయం ప్రతి సారీ తనకు గుర్తుకు రావటం కోసం తను గాయపడిన తన చేతుల వంక చూసుకుంటున్నాడు. అంతే కాదు పడవకు ఆనుకుని మంట పుడుతున్న తన వీపు ఈ ఘనకార్యాన్ని నిజంగా తాను సాధించాననే నిజం చెప్తోంది. అతడి ప్రయాణంలోని

ఆఖరి ఘట్టంలో అతడి గాయాలు బాగా బాధిస్తున్నప్పుడు అనిపించింది బహుశా ఇది కలై ఉంటుందని. అయితే చేపను తన బరిసెతో శక్తి కొద్దీ గుచ్చినప్పుడు, అది నీళ్ళలో నుంచి బయటకు వచ్చి గాలిలోకి అంతెత్తున ఎగిరి కిందకుపడే ముందు ఆకాశంలో కొద్ది సేపు నిశ్చలంగా వేలాడినప్పుడు అదేదో ఒక మహోన్నతమైన వింతగా నమ్మశక్యం కాని చోద్యంగా అతడికి తోచింది.

ఆ సమయంలో తర్వాత జరిగిందాన్ని అతను సరిగ్గా చూడలేకపోయాడు. ఇప్పుడయితే ఎప్పట్లానే అతడికి చక్కగా కనపడుతోంది. నొప్పి పుట్టే అతడి చేతులు మంట పుట్టే అతడి వీపు కల కాదని, చేపనుపట్టే ప్రయత్న ఫలితమేనని అతడికిప్పుడు తెలుసు. చేతుల గాయాలు త్వరగానే మానతాయని అనుకున్నాడు. నా రక్తంతో వాటిని శుభ్రం చేశాను. ఉప్పు నీరు వాటిని నయం చేస్తుంది. నిజమైన సముద్ర అగాథంలో ప్రవహించే నిర్మలమైన నీరు అన్నింటికంటే గొప్ప స్వస్థతా గుణాన్ని కలిగి ఉంటుంది. నేను చెయ్యాల్సిందంతా కూడా నా మనసులో ఎలాంటి గందరగోళం లేకుండా వేచి చూడటమే. చేతులు తమ పని తాము చక్కగా చేశాయి కాబట్టే తమ ప్రయాణం నిరాటంకంగా కొనసాగుతోంది. చచ్చి నోరుమూసుకుని తోకను నిటారుగా పెట్టి ఉన్న ఈ చేపా నేనూ అన్నదమ్ముల్లా కలసి ప్రయాణం చేస్తున్నాం. ఇంతలో ముసలోడికి తన తల తిరుగుతున్నట్టు అనిపించింది. అయినా ఇది నన్ను తీసుకెళ్తోందా లేక దాన్ని నేను తీసుకెళుతున్నానా? నేను దాన్ని తోసుకెళుతున్నట్లయితే బాధలేదు. ఆ చేప తన దర్పాన్నంతటినీ కోల్పోయి, పడవలో చచ్చిపడున్నా ఇబ్బంది లేదు. కానీ తామిద్దరం పక్కపక్కన అనుకుని ప్రయాణం చేస్తున్నాం. ఒక వేళ దానికి నన్ను తీసుకెళ్లటం ఇష్టమైతే అలానే కానిద్దాం అనుకున్నాడు. అది మాత్రం నన్నేమీ చెయ్యలేదు. ఎందుకంటే దానికి నాలా టక్కుటమార విద్యలు తెలియవు.

వారి ప్రయాణం చక్కగా సాగుతోంది. ముసలోడు తన చేతులను ఉప్పు నీటిలో ముంచి తన తల తిరగకుండా ఉండేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఆకాశంలో తెల్లని మేఘాలు గోళాకారంలో దట్టంగా కమ్ముకుని ఉన్నాయి కాబట్టి చల్లగా వీచే ఈ గాలి రాత్రంతా కొనసాగుతుందని ముసలోడికి తెలుసు. తను మాత్రం ఇది కల కాదు వాస్తవమని నిర్ధారించుకోవటానికన్నట్టు ప్రతిక్షణం రెప్ప వాల్చకుండా చేప వంక చూస్తూనే ఉన్నాడు.

ఇదంతా అతడికి మొదటి సొరచేప ఎదురవటానికి ఒక గంట ముందు కథ.

ఆ సొరచేప అనుకోకుండా రాలేదు. ఈ చేప రక్తం సముద్రపు నీటిలో ఒక మైలు లోతుకు దట్టమైన మేఘంలా వ్యాపించినప్పుడు నీటి అడుగునుంచి చాలా వేగంగా

పైకి వచ్చింది. అమాంతంగా నీళ్ళ ఉపరితలాన్ని చీల్చుకుని పైకెగిరి మళ్లీ నీళ్లలో పడింది. చేప కట్టి ఉన్న పడవ వాసనను అనుసరించి ఆ దారివెంట వేగంగా దూసుకుంటూ వచ్చింది.

కొన్నిసార్లు వాసన సరిగ్గా పసిగట్టలేక అటు ఇటు దిక్కులు చూసేది. మళ్ళీ ఆ వాసన జాడను పసిగట్టి రెట్టించిన ఉత్సాహంతో అతి వేగంగా దాని శక్తి కొద్దీ దారంట ఈదటం మొదలు పెట్టేది. సొరచేప సముద్రంలో ఉన్న అన్ని చేపలకంటే కూడా వేగంగా ఈదటం కోసమే ప్రత్యేకంగా తయారుచేయబడిందా అన్నట్టు ఉంటుంది. దాని పళ్లు, దవడలు తప్ప మిగతా శరీర భాగాలన్నీ చాలా అందంగా ఉంటాయి. దాని వీపు కత్తి చేప వీపుకు మల్లే నీలి వర్ణంలో ఉంటుంది. దాని పొట్ట తెల్లగా, మిగిలిన చర్మం మృదువుగా ఉంటుంది. దాని శరీరం దాదాపు కత్తి చేప శరీరంలాగే ఉంటుంది. కాకపోతే దీనికి పెద్ద పెద్ద దవళ్ళు ఉన్నాయి. అది ఇప్పుడు అలాంటి తన దవడలను గట్టిగా మూసుకుని నీళ్ళ ఉపరితలానికి కొద్దిగా కిందగా ఈదుతోంది. మనసులో ఏ మాత్రం సంకోచంగానీ ఆందోళన గానీ లేకుండా ఏకాగ్రతతో తన పొడవైన రెక్కలతో నీటిని చీల్చుకుంటూ ఈదుతోంది. మూసుకుని ఉన్న తన దవళ్ళ లోపల కోరల్లాంటి ఎనిమిది జతల పళ్ళు లోపలికి వంగి ఉన్నాయి. సహజంగా అన్ని సొరచేపలకు పిరమిడ్ ఆకారంలో ఉండే పళ్ళ లాంటి పళ్ళు కాదు దీనివి. గద్ద కాలి గోళ్ళను బిగబట్టినట్టు ఇది తన పళ్ళను బిగబట్టినప్పుడు అవి మనిషి చేతి వేళ్ళ ఆకారంలో కనపడతాయి. అలాంటి దాని పళ్ళు దాదాపు ముసలోడి వేళ్ళంత పొడవుగా ఉండి రెండు వైపుల బ్లేడు అంచులంత పదునుగా ఉన్నాయి. సముద్రంలో వేగంగా ఈదగలిగినవి, శక్తి గలవి మిగతా చేపలు వేటితోనూ శతృత్వం లేని చేపలు ఇంకా అనేకం ఉన్నాయి. కానీ ఈ సొరచేప మాత్రం అలాంటి చేపలన్నింటిని తినటానికి మాత్రమే పుట్టింది. పడవకు కట్టి ఉన్న చేప తాలూకూ వాసన మళ్ళీ తన ముక్కు పుటాలను తాకినట్టు ఉంది. తన నీలి రంగు రెక్కలతో నీటిని కోసుకుంటూ వేగంగా కదిలింది.

అది అలా శరవేగంగా రావటం చూసిన ముసలోడు అనుకున్నాడు, ఈ సొరచేపకు ఏ మాత్రం భయం లేదు, అది ఎలా అనుకుంటుందో ఖచ్చితంగా అలానే చేసి తీరుతుంది అని. ఇలా అనుకున్న ముసలోడు తన పక్కనున్న బరిసెను అందుకుని దానికి తాడు కట్టాడు. సొరచేప సమీపంగా వస్తూ ఉంది. ఇంతకు ముందు తాను బరిసె తాడును చేపను పడవకేసి కట్టటం కోసం కొయ్యటం వల్ల దాని పొడవు చిన్నదై పోయింది.

ముసలోడి మనసు ఇప్పుడు బాగుంది. బుర్ర కూడా బాగానే పని చేస్తోంది. తానిప్పుడు ధృడ చిత్తంతో ఉన్నాడు. కానీ తనలోని ఆశ మాత్రం సన్నగిల్లింది. తన ఆశయ సాధనలో

వచ్చే ఇబ్బందులను ధృడ చిత్తంతో ఎదుర్కొని, అకుంఠిత దీక్షతో ధైర్యంగా పోరాటం కొనసాగించటం మంచిదని అతడికి తోచింది. సొరచేప అతి దగ్గరగా వస్తోంది. పడవకు కట్టి ఉన్న చేప వంక ఒక్కసారి చూశాడు. ఈ సొరచేప కూడా ఒక భ్రాంతేమో అనుకున్నాడు. అది పడవను కొట్టకుండా మాత్రం నేను ఆపలేను అయితే చివరికి దాన్ని పట్టుకోగలనేమో. ఒసే సొరచేపా! నీ అమ్మకు గర్భశోకం తప్పదు.

సొరచేప పడవ వెనక్కు వచ్చేసి పడవకు కట్టి ఉన్న చేప మీద దాడి చేసింది. ముసలోడు అలా చూస్తుండగానే అది తన నోరు పూర్తిగా తెరిచి చేప తోక దగ్గరన్ను మాంసంలోకి విసురుగా తన పళ్ళను గుచ్చింది. దాని పళ్ళే కాదు దాని కళ్ళు కూడా వింతగా మెరుస్తున్నాయి. దాని శరీరం మొత్తం కూడా నీళ్ళ లోపలి నుంచి బయటకు రాలేదు ఒక్క తల తప్ప. దాని పళ్ళను చచ్చిన చేప చర్మంలో నుంచి ఒంటిలోకి గుచ్చి చీల్చేటప్పుడు వచ్చే శబ్దం ముసలోడి చెవులను తాకుతోంది. నీటిలో ఉన్న సొరచేపకు పడవ మీదున్న ముసలోడికి మధ్య రెండు గాలం తీగలు అడ్డు ఉన్నాయి. ఒకటి సొరచేప ముక్కు దగ్గర మరోటి దాని రెండు కళ్ళ మధ్యన. ఈ రెండు పరస్పరం కలిసే చోట దాని నడి నెత్తి మీద గురి చూసి ముసలోడు తన చేతిలోని బరిసెను బలం కొద్దీ గుచ్చాడు. ఆ దెబ్బకు అక్కడున్న గాలం తీగలు చెల్లా చెదురయ్యాయి. ఇప్పుడు అక్కడ ముసలోడికి కనపడేది నీలి రంగులో ఉన్న బరువైన సొరచేప తల, తీక్షణంగా అటు ఇటూ వేగంగా కదిలే దాని కళ్ళు, కొండను కూడా పిండి కొట్టి అమాంతంగా అనాయాసంగా లోపలకు కుక్కేసుకునేలా ఉన్న దాని దవడలు మాత్రమే. ముసలోడు సరిగ్గా తలలో మెదడు ఉండే భాగంలోనే కొట్టాడు. బరిసెను పట్టుకుని ఉన్న ఆ చేతులు పచ్చి పుళ్ళతో రక్తం కారుతూ ఉన్నాయి. ఆ బాధను తాత్కాలికంగా మర్చిపోయిన అతడు శక్తిని కూడ దీసుకుని బరిసెను గట్టిగా పట్టుకుని దాని తల మీద కొట్టాడు. ముసలోడి మనసు క్రూరత్వంతో నిండి పోయింది. కానీ అతడు కొట్టిన దెబ్బలో ఆశ లోపించింది.

ఆ దెబ్బకు దిమ్మ తిరిగిన ఆ సొరచేప ధడాలున పక్కకు తిరిగింది. అలా తిరిగినప్పుడు దాని ఒక కన్ను నిర్జీవంగా ఉండటాన్ని గమనించాడు. మళ్ళీ అది తటాలున తలను ఇటు తిప్పేసుకుంది. అది అటు ఇటు తిరగటం వల్ల తాడు దాని చుట్టూ రెండు చుట్లు చుట్టుకు పోయింది. ఆ దెబ్బకు గింగిరాలు తిరిగిన సొరచేప దాదాపు చచ్చిన దానితో సమానమని ముసలోడికి తెలుసు. అయితే ఆ విషయాన్ని సొరచేప అంగీకరించదు. తర్వాత అది తన తోకను కొట్టుకుంటూ ఆయాసంతో రొప్పుకుంటూ వెల్లికిలా పడుకుని భూమిని దున్నే నాగలికి మల్లే నీటిని చీల్చుకుంటూ మర పడవ వేగంతో మరలి

పోయింది. సొరచేప తోకతో కొట్టిన చోట నీరు నురగలెత్తింది. దాని లాగుడికి దానికి చుట్టుకుని ఉన్నతాడు బిగించుకు పోయి మూడు వంతులు చేప నీళ్ళ మీద బయట కనబడింది. బిర్రుగా అయిన తాడు తెగి పోయింది. అలా సొరచేప కొద్దిసేపు నీళ్ళపైన తేలియాడటాన్ని ముసలోడు చూస్తుండి పోయాడు. తర్వాత అది నెమ్మదిగా నీటి అడుగుకు చేరిపోయింది.

"అది దాదాపు నలభై పౌండ్ల మాంసాన్ని తినేసింది" ముసలోడు పెద్దగా బాధగా అరిచాడు. అది నా బరిసెని దానితో పాటు మొత్తం తాడుని కూడా లాక్కెళ్ళింది అనుకున్నాడు. ఇప్పుడు నా చేప మళ్లీ రక్తమోడుస్తోంది. ఇంకా ఎక్కువ సొరచేపలు వస్తాయి. సొరచేప కోరలకు చిక్కి చిందర వందరగా అయిన ఆ చేప వంక కన్నెత్తి చూడటానికి ముసలోడికి మనస్కరించలేదు. ఈ చేప మీద సొరచేప దాడి చేసినప్పుడు అది నిజంగా తన మీద దాడి చేసినట్టే అనిపించింది ముసలోడికి.

ఏదైతేనేం నా చేప మీద దాడి చేసిన సొరచేపను నేను చంపగలిగాను అనుకున్నాడు. నాకు తెలిసి ఇప్పటిదాకా నేను ఇంత పెద్ద సొరచేపను చూడనే లేదు. ఇక దేవుడికి తెలియాలి నేను చూశానో లేదో.

దానితో జరిగిన నా పోరాటం బాగుంది అనుకున్నాడు. ఇదంతా ఒక కలై ఉంటే బాగుండేది. ఈ కలలోనే ఈ చేపల గొడవ లేకుండా మంచం మీద వార్తా పత్రికలను పరుచుకుని ఒంటరిగా పడుకుని ప్రశాంతంగా నిద్రిస్తున్నట్టు కనిపిస్తే ఇంకా బాగుండేది.

"కానీ మనిషి ఓడిపోవటానికి పుట్టలేదు" అతడు అన్నాడు. "ఒక మనిషిని నాశనం చెయ్యొచ్చు కానీ ఓడించలేరు." అయితే ఈ చేపను చంపటం నాకు బాధకలిగిస్తోంది అని అనుకున్నాడు. ఇప్పుడు కష్ట కాలం వచ్చిపడింది. పైగా నా దగ్గర ఇప్పుడు బరిసె కూడా లేదు. ఈ సొరచేప అతి క్రూరమైనది. దాని బలం అసాధారణమైనది. ప్రతిభా పాటవాల్లో సాటి లేనిది. ఇక తెలివి తేటల్లో వేటికీ తీసిపోదు. ఐతేనేం దానికంటే నా తెలివి తేటలు ఎక్కువ. బహుశా అదే తెలివైందేమో అని అతడు అనుకున్నాడు. కాకపోతే నా దగ్గర దాని కంటే ఎక్కువ ఆయుధాలు ఉన్నాయి.

"మరీ ఎక్కువగా ఆలోచించకురా ముసలోడా" పెద్దగా అన్నాడు. "నీ పనంతా పడవని నడపటం. దారీ తెన్నూ కనబడినప్పుడు అటుగా పోవటం" అనుకున్నాడు.

"కానీ నేను తప్పకుండా ఆలోచించాలి అనుకున్నాడు. ప్రస్తుతం నేనున్న పరిస్థితుల్లో చేయగలిగిన పని అదొక్కటే. దీనితో పాటు బేస్ బాల్ కూడా. నేను సొరచేపను మెదడు వాచేలా కొట్టిన పద్ధతిని డిమాగియో చూసి ఉన్నట్లయితే అతడు నన్ను తప్పకుండా మెచ్చుకునేవాడు. అయినా సొరచేపను కొట్టటం అనేది నేను అనుకునేంత గొప్ప పనేం

కాదు అని అనుకున్నాడు. నా స్థానంలో ఉన్న ఏ మనిషైనా ఇలానే చేసి ఉండేవాడు. అయితే నా చేతులు చిట్లిపోయిన ఎముకలంత పనికి మాలినవా? ఆ విషయం నాకెలా తెలుస్తుంది. నా మడమ మాత్రం నన్నెప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. కేవలం ఒక్కసారి అప్పుడెప్పుడో ఈతగొట్టేటప్పుడు చూసుకోకుండా కొండి చేప మీద కాలేశాను. వెంటనే అది నా కాలుని కుట్టటంతో మోకాలి నుంచి కింది భాగమంతా విపరీతమైన నొప్పి పుట్టి కాలు కదల్చ లేకపోయాను."

"ఏదన్నా ఉత్సాహం కలిగించే జ్ఞాపకాలు నెమరేసుకోరా ముసలోడా" అన్నాడు. ఇంకా కొన్ని నిముషాల్లోనే నువ్వు ఇంటికి చేరతావు. ఇప్పుడు నీకు పడవ నడపటం అంత భారం కాకపోవచ్చు, ఎందుకంటే నలభై పౌండ్ల బరువు తగ్గిపోయింది.

ఏదైనా ప్రవాహం లోపలికి వెళ్ళినప్పుడు దాని తీరు తెన్నులు ఎలా ఉంటాయో ముసలోడికి బాగా తెలుసు. అయితే ఇప్పుడు అలాంటి సందర్భం వచ్చే అవకాశం ఏమీ లేదు. "అంత నిరాశ చెందాల్సిన అవసరం లేదు. మనసుంటే మార్గముంటుంది. నా దగ్గరున్న కత్తిని ఒక తెడ్డు చివర కట్టి బరిసెలా ఉపయోగిస్తాను" అని పెద్దగా అరిచాడు.

తన చంకలో ఉన్న చుక్కానిని ఊడబీకాడు. దానికి పడవలో తన కాలు పెట్టిన చోట ఉన్న రేకు ముక్కను బిగించి కట్టాడు. "నేను ఓపిక చచ్చిన ముసలోడ్నే కావచ్చు. కానీ ఇప్పుడు నా రక్షణ కోసం నా దగ్గర ఆయుధం ఉంది" అన్నాడు. హాయిగొలిపే చల్లటి గాలి తెమ్మెరలు చల్లగా వీస్తున్నాయి. అతడు పడవకు కట్టిన చేప తల భాగాన్ని మాత్రమే చూశాడు. అలా చూడటం చేత అతనిలో ఆశ మళ్ళీ చిగురించింది.

ప్రతి మనిషీ ఆశావాది అయి ఉండాలి. తెలివిమాలిన మనసులు మాత్రమే నిరాశావాదంతో నిండిపోయి ఉంటాయి అని అనుకున్నాడు. అంతే కాదు నా లెక్క ప్రకారం నిరాశావాదం కూడా ఒక రకమైన పాపమే. నువ్వు పాపం గురించి ఆలోచించకు అని అనుకున్నాడు. పాపంతో సంబంధం లేని కష్టాలు, బాధలు, ఇబ్బందులు ప్రపంచంలో అనేకం ఉన్నాయి. అసలు పాపం అనే విషయం గురించే నాకు సరైన అవగాహన లేదు.

పాపం గురించిన కనీస అవగాహనే లేనప్పుడు దానిలో నాకు నమ్మకముందని గట్టిగా చెప్పలేను. బహుశా చేపను చంపటం పాపం కిందకే రావచ్చు. నేను బతకటం కోసం, వేరే వాళ్లకి తిండిపెట్టటానికి దీన్ని చంపి ఉండొచ్చు. కారణమేమైనా కావచ్చు కానీ దాన్ని చంపటం అనేది తప్పకుండా పాపమే. కాబట్టి నువ్వు పాపం గురించి ఆలోచించకు. నీ వరకు పాపం అనే విషయం గురించి ఆలోచించే కాలం దాటి

పోయింది. లోకంలో చాలా మంది తమ పాపానికి వెల కడుతుంటారు. ఆలోచిస్తే గిస్తే అలాంటి వాళ్ళు మాత్రమే దాని గురించి ఆలోచించాలి. చేప చేపగా ఉండటం కోసం ఎలా పుట్టిందో, నువ్వు కూడా జాలరిగా ఉండటం కోసం పుట్టావు. సాన్ పెడ్రో కూడా ఒక జాలరే. అంతెందుకు, గొప్ప బేస్ బాల్ క్రీడాకారుడైన డిమాగియో వాళ్ళ నాన్న కూడా జాలరే.

ముసలోడు సముద్రంలో ఒంటరి అయిపోయాడు. చదవటానికి పత్రికలు లేవు, వినటానికి రేడియో కూడా లేదు. ఉబుసుపోక, వేరే ఏ వ్యాపకం లేని అతడు తన జీవితంలో తనకు ప్రత్యక్షంగా లేక పరోక్షంగా సంబంధం ఉన్న విషయాల గురించి, సంఘటనల గురించి ఆలోచిస్తున్నాడు. దానిలో భాగంగానే అతడి ఆలోచనలు ఎక్కువగా పాపం అనే అంశం వైపు పరుగులెడుతున్నాయి. కేవలం నువ్వు బతకటం కోసమో లేక ముక్కలుగా కోసి జనాలు తినటానికి వారికి అమ్మటం కోసమో నువ్వు చేపను చంపలేదేమో అని అతడు ఆలోచించాడు. నువ్వు జాలరివి కాబట్టి పెద్ద పెద్ద చేపలను చంపితే లభించే పేరు ప్రఖ్యాతులను కాంక్షించి నువ్వు ఆ పని చేశావు. అది బతికుండి సముద్రంలో ఈదుతున్నప్పుడూ తర్వాత నీ చేతుల్లో చచ్చినప్పుడు దాని మీద నీ ప్రేమ ఒకే రకంగా ఉంది. అది చావక ముందు ఇంత పెద్ద చేపను నేను చంపబోతున్నాను అనే ఒక రకమైన ఉద్విగ్నతతో కూడిన ఆనందం, అది చచ్చిన తర్వాత ఇంత పెద్ద చేపను నేను చంపగలిగాను అనే ఒక గర్వంతో కూడిన ఆనందం. రెండు సందర్భాల్లోనూ నీకు ఆనందమే కలిగింది. నువ్వు ప్రేమించేదాన్ని చంపే అధికారం నీకు ఉంది. ఏ రకంగా చూసినా అది పాపం కాదు. లేకపోతే అలా చెయ్యటం పాపం కంటే కూడా ఎక్కువ దుర్మార్గమైన కార్యమా?

"నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావురా ముసలోడా" పెద్దగా అన్నాడు.

కానీ సొరచేపను చంపేటప్పుడు నీకు మహదానందం కలిగింది అని అనుకున్నాడు. నీకు లాగానే అది కూడా బతికున్న చేపలనే తింటుంది. నువ్వు చంపిన సొరచేప మిగిలిన సొరచేపలకు మల్లే చచ్చి చెడిన తిండిని తినే రకం కాదు. దేన్ని చూసినా కడుపున కుక్కేసుకోవాలనుకునే కక్కుర్తి రకం కూడా కాదు. అది చాలా అందమైనది. గొప్పది. దానికి భయమంటే ఏమిటో తెలియదు.

"దాన్ని నేను నన్ను రక్షించుకోవటానికి చంపాను. అది కూడా చాలా కళాత్మకంగా చంపాను" ముసలోడు పెద్దగా అరిచాడు.

ప్రతి జీవి కూడా ఏదో రకంగా మరో జీవి మూలంగా చస్తుంది అని అనుకున్నాడు. చేపలు పట్టటం అనేది నాకు జీవనాధారం. ఇదే నా చావుకు కూడా కారణమవుతుంది.

పిల్లోడు మూలంగానే నేను జీవించి ఉండగలుగుతున్నా అని అనుకున్నాడు. నన్ను నేను మరీ ఎక్కువగా మోసం చేసుకోకూడదు.

ముసలోడు కొంచెం పక్కకు వంగి సొరచేప తన పళ్ళతో కొరకటం వల్ల బయటకొచ్చిన మాంసం ముక్కను ఒకదాన్ని చేప ఒంటి మీద నుంచి అందుకున్నాడు. దాన్ని నోట్లో వేసుకుని నమిలాడు. అది చాలా నాణ్యమైన మాంసం. గొప్ప రుచిగా కూడా అనిపించింది. మంచి గొర్రె మాంసం లేదా బర్రె మాంసంలా గట్టిగా రసాలూరుతూ గొప్పగా ఉంది. అయితే వాటి మాంసానికి మల్లే ఎర్రగా లేదు. చిన్న చిన్న దారాల్లాంటి నరాలు కూడా లేకుండా శుభ్రంగా ఉంది. ఇలాంటి చేపమాంసానికి మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుందని అతడికి తెలుసు. అయితే ఇంతే శుభ్రంగా, చేప యొక్క సువాసన పోకుండా, మాంసం కుళ్ళి పోకుండా ఒడ్డుకు చేరటం అంత తేలికైన విషయం కాదని కూడా అతడికి తెలుసు. ముందు ముందు రానున్నది గడ్డు కాలమని ముసలోడికి చాలా బాగా తెలుసు.

పిల్ల గాలి నిమ్మళంగా వీస్తోంది. అది వీచే దిశ నైరుతి వైపు మరలింది. దానర్థం గాలి వేగంలో తగ్గుదల ఉండదని అతనికి తెలుసు. ముసలోడు తన ముందు సముద్రంలోకి తేరి పార చూశాడు. అతడికి కనుచూపు మేరలో ఒక్క చిన్న పడవకానీ, ఓడ ఆకారంగానీ చివరకు ఓడ నుంచి పైకి వెలువడే పొగ తాలూకూ ఆనవాలేమీ చూచాయగా కూడా కనిపించటం లేదు. తన పడవకు ఇరువైపుల నుంచీ ఎగురుతూ ఉన్న రెక్కల చేపలు వాటికి తోడు నీళ్ళలో వెళుతున్న పసుపు పచ్చని గల్ఫ్ నాచు తెప్పలు మాత్రమే అతడికి కనిపిస్తున్నాయి. కనీసం ఒక చిన్న పక్షి ఆనవాలు కూడా లేదు.

రెండు గంటలపాటు అతడు ఆపకుండా తన ప్రయాణాన్ని కొనసాగించాడు. ఈ రెండు గంటల పాటూ కొంచెం సేపు పడవ ముందు పడుకుని మరి కొంచెం సేపు కవడ చేపల మాంసాన్ని చప్పరిస్తూ గడిపాడు. కొంచెం సేపు విశ్రాంతి తీసుకుని శక్తిని పెంపొందించుకోవాలని అతడి ఆలోచన. ఇంతలోనే అతడు తన పడవకేసి వస్తున్న రెండు సొరచేపల్లో మొదటి దాన్ని చూశాడు.

"ఓహో" అని పెద్దగా అరిచాడు. అతడి అరుపును ఏ భాషలోకీ తర్జుమా చేసి దాని అర్థాన్ని విడమర్చి చెప్పలేము. బహుశా మనిషి తనకు చీదర కలిగించే ఏదైనా సంఘటన అకస్మాత్తుగా సంభవించినప్పుడు, తన ప్రమేయం లేకుండానే గుండె పెగల్చుకుని వచ్చే ఒక రకమైన అరుపు ఇది. ముందు అరచేతుల్లోకి, అక్కడి నుంచి చెక్కలోకి మేకులు దిగబడుతున్నప్పుడు చేసేలాంటి శబ్దమది.

"నీలి కళ్ళ పాపాయిలు" అని పెద్దగా అరిచాడు. ముసలోడు ఇప్పుడు మొదటి

దాని వెనుక నెమ్మదిగా పైకి లేచి వస్తున్న చేప వీపు మీది రెక్కను చూశాడు. బూడిద రంగులో ముక్కోణ ఆకారంలో ఉన్న వాటి రెక్కలను, గూడేస్తున్నట్టు తన తోకతో నీళ్ళను విరజిమ్మటాన్ని బట్టి అవి పట్టకారు లాంటి ముక్కులున్న సొరచేపలుగా గుర్తించాడు. అవి సమ్మోహనమైన సువాసనలను వెదజల్లుతున్నాయి. కరువు కోరల్లో చిక్కి ఆహారం లేక మల మలలాడుతున్న మనుషుల్లా అవి మతిలేని ఉత్సాహంతో దూకుకుంటూ వస్తున్నాయి.

ముసలోడు పడవ అడుగున ఉన్న రేకును చుక్కాని కమ్మికి చుట్టాడు. తర్వాత కత్తి కట్టి ఉన్న తెడ్డును కూడా అందుకున్నాడు. అతడి చేతులు విపరీతంగా నొప్పి పుడుతున్నాయి. సాధ్యమైనంత నెమ్మదిగా ఆ తెడ్డుని పైకి లేపాడు. తెడ్డు మీదున్న తన చేతులను కొంచెం పైకి కిందకు సర్దుకున్నాడు. తర్వాత తన రెండు చేతుల్లోకి శక్తిని కూడదీసుకుని తెడ్డుని గట్టిగా పట్టుకున్నాడు. ఇలా తన చేతులను బిగించి పట్టుకోవటం చేత నొప్పి అర చేతుల్లోకి రాకుండా పైనే ఆగి పోయింది. ఇక తనను సమీపిస్తున్న సొరచేపలతో అమీ తుమీ తేల్చుకోవటానికి సిద్ధపడ్డాడు. ఇప్పుడు అతనికి నిప్పులను తోడే గరిటకు మల్లే చదరంగా, వెడల్పుగా ఉన్న వాటి తలలు, వాటి వెనుక తెల్లని కొనలతో వెడల్పాటి కొమ్ముల్లా ఉన్న వాటి రెక్కలు కనబడుతున్నాయి. అవి నీచాతి నీచమైన సొరచేపలు. లేకితనానికి ప్రతినిధులు. దుర్గంధ భరితమైన హంతక జీవులు. వాటికి ఆకలైతే కడుపుతోనే చూస్తాయి కానీ కళ్ళతో కాదు. తెడ్డేంటి, చుక్కాని ఏంటి నోటికి దగ్గరలో ఉన్న ప్రతి దాన్నీ కొరుక్కు తినే రకాలు.

నీళ్ళ ఒడ్డున నిద్రపోతుండే తాబేళ్ళ కాళ్ళను రెక్కలను కొరుక్కు తినే సొరచేపలు ఇవే. సొరచేపలు సహజంగా చేపలను వాటి వాసనను బట్టి, వాటి శరీరం మీదున్న బంకను బట్టి గుర్తించి వాటి మీద దాడి చేసి వాటి రక్తం రుచిని బట్టి వాటిని ఆరగిస్తాయి. కానీ వీటికి మాత్రం వాటితో పనేం లేదు. వాటికి ఆకలేస్తే చాలు నీళ్ళలో దొరికిన మనిషిని కూడా నమిలి మింగేస్తాయి.

"దమ్ముంటే దగ్గరకు రండే సొరచేపల్లారా" ముసలోడు బిగ్గరగా అరిచాడు.

అవి వచ్చేశాయి. అయితే అవి శక్తివంతమైన మాకో సొరచేపల్లా రాలేదు. వాటిలో ఒకటి దగ్గరకు వచ్చినట్టే వచ్చి అటు తిరిగి నీళ్ళలో మునిగి పడవ కిందకు చేరింది. పడవ కింద నుంచి చేపను లాగటం, కొరకటం వల్ల పడవ అటూ ఇటూ ఊగటం ముసలోడికి తెలుస్తోంది. మరొకటి చీలికల్లాంటి తన మూసుకుపోయిన పచ్చని కళ్ళతో ముసలోడ్ని ఎగా దిగా చూసింది. వెంటనే అది ఉబ్బిపోయి అర్ధగోళాకారంలో ఉన్న తన దవళ్ళను తెరుచుకుని అంతకు ముందే ఖండమై ఎంగిలిపడిన చేప శరీర భాగం

మీద కొరికింది. ముసలోడు ఆ చేప మెదడు దాని వెన్నెముకతో కలిసే చోట, బూడిద రంగులో ఉన్న దాని తల డిప్ప మీద గురి చూసి తెడ్డుకు కట్టి ఉన్న కత్తితో బలంగా మోదాడు. మళ్ళీ పైకి లేపి మళ్ళీ బలంగా మోది కత్తిని గుచ్చాడు. మరోసారి పిల్లి కళ్ళలా పసుపు పచ్చని రంగులో ఉన్న దాని కళ్ళలోకి గుచ్చాడు. ఆ దెబ్బలకు ఆ సొరచేప చేపను వదిలేసింది. అప్పటికి కొరుక్కుని తన నోట్లో పెట్టుకున్న ఒక ముక్కను చప్పరిస్తూ చప్పరిస్తూ చచ్చిపోయి నీటి అడుక్కు జారిపోయింది.

పడవ కింద చేరిన సొరచేప చేసే విధ్వంసం మూలంగా పడవ అంతకంతకు ఊగిపోతోంది. ముసలోడు పడవ అడుగున ఉన్న రేకును కొంచెం పైకి లేపటంతో దాని కిందున్న సొరచేప శరీరం కనపడింది. వెంటనే ముసలోడు పడవ అంచుకు ఆనుకుని కొంచెం బయటకు వంగి దాని మీద ఒక్క పొడుపు పొడిచాడు. సొరచేప చర్మం చాలా గట్టిగా ఉంది. కత్తి లోపలికి దిగబడలేదు. కేవలం పైన చర్మం మాత్రమే కొంచెం తెగింది. అయితే అతడు తన శక్తి కొద్దీ పొడవటం అది దిగకుండా ఎదురు తిరగటం వల్ల కలిగిన కుదుపుకు అతడి చేతులు భుజాలు నొప్పి పుట్టాయి. సొరచేప మళ్ళీ తన తలను బయట పెట్టి వేగంగా చేప వైపుకు వచ్చి చేపను కొరకటానికి తన ముక్కును ఆనించే లోపే ముసలోడు తన చేతుల్లోని తెడ్డును పైకెత్తాడు. నలుచదరంగా ఉన్న దాని తల మీద కత్తితో బలంగా పొడిచాడు. కత్తిని పైకి లాగి గురి చూసి అదే బొక్కలో మళ్ళీ పొడిచాడు. అయితే అప్పటికి కూడా అది తన దవళ్లతో చేపను పట్టుకునే ఉంది. ముసలోడు కత్తిని బయటకు లాగి ఈసారి దాని ఎడమ కంటిలో పొడిచాడు. ఇంకా అది తన పట్టును సడలించ లేదు.

"ఇంకా చాల్లేదా" అని ముసలోడు ఈ సారి కత్తిని దాని వెన్నెముక మెదడు కలిసే చోట పొడిచాడు. ఇది కొంచెం తేలిక పాటి పోటు కావటం మూలంగా కత్తి ఎముక మీద పడి జారి పోయింది. ఇలా కాదనుకున్న ముసలోడు తెడ్డు మడమ తిప్పి సొరచేప దవళ్ళ మధ్య పెట్టాడు. కత్తి కట్టి ఉన్న వైపుకు తెడ్డును తిప్పి ఈ సారి తెరుచుకున్న దాని నోట్లో కత్తిని మెలి తిప్పాడు. సొరచేప ఈ సారి తన నోట కరుచుకున్న చేపను వదలక తప్పలేదు. ముసలోడు దాని నోట్లో ఇంకా పొడుస్తూ అన్నాడు, "ఇందాక ఇలాగే ఒకటి నా చేతుల్లో చచ్చి నీటి అడుక్కు పోయింది. అది నీ స్నేహితురాలో లేక నీ తల్లో తెలీదు కానీ నువ్వు కూడా దాని దగ్గరకే పోవే సొరచేపా."

ముసలోడు కత్తిని తుడిచి తెడ్డును కింద పెట్టాడు. ముసలోడు పైకి లేచిన పడవ అడుగు రేకును చూశాడు. దానిలో నుంచి నీళ్ళు పడవలోకి వచ్చి చేరాయి. రేకును సరి చేసిన ముసలోడు తన పడవను నడపటం ప్రారంభించాడు.

"ఈ సొరచేపలు నా చేపలో నాలుగో వంతును అదీ మంచి కండగల మాంసాన్ని తినేసి ఉంటాయి" అతడు పెద్దగా అన్నాడు. "ఈ చేపను గాలం వేసి పట్టుకోవటం అనే తంతంతా ఒక కల అయి ఉంటే ఎంత బాగుండేది. జరిగిన దానికి నేను పశ్చాత్తాప పడుతున్నాను చేపా. నిన్ను పట్టిన దగ్గర నుంచి నాకు జరిగినదంతా చెడే." ముసలోడు వాపోయాడు. ముసలోడు ఇక చేప వంక కన్నెత్తి చూడటం మానేశాడు. రక్తమంతా కారి, నీళ్ళలో నాని పోయి ఉన్న ఆ చేప పాలిపోయి వెండి పూత రంగులో ఉంది. అయితే దాని ఒంటి మీదున్న చారలు మాత్రం ఇంకా స్పష్టంగా కనబడుతున్నాయి.

"నేను వేట కోసమని సముద్రంలో అంత దూరం వెళ్ళి ఉండాల్సింది కాదు చేపా. దాని మూలంగా ఇద్దరమూ నష్టపోయాం. నన్ను క్షమించు చేపా" అతను బాధగా అన్నాడు.

ముసలోడు స్వగతంగా అనుకుంటున్నాడు. కత్తికేసి చుట్టిన తాడు బాగుందో తెగిందో చూడు. అనుకోని సంఘటనలు ముందు ముందు ఇంకా ఎన్నో నువ్వు ఎదుర్కోవలసి ఉంది. కాబట్టి నీ చేతులకు ఊపిరి పోసి మళ్ళీ నీ స్వాధీనంలోకి తెచ్చుకో.

"కత్తి నూరటం కోసం ఒక రాయిని తెచ్చుకుని ఉంటే బాగుండేది" తెడ్డు పిడికి చుట్టిన తాడును పరీక్షగా చూస్తూ అన్నాడు ముసలోడు. "రాయి తీసుకొచ్చి ఉండాల్సింది." మళ్ళీ అన్నాడు. నువ్వు అవసరమైన వస్తువులు ఇలాంటివి ఇంకెన్నింటినో తీసుకు రావలసింది అని అనుకున్నాడు. వాటన్నింటినీ నువ్వు తీసుకు రాలేదు ముసలోడా. నీ దగ్గర లేని వాటి గురించి ఇప్పుడు ఆలోచించి ప్రయోజనం లేదు. ఇప్పుడు నీ దగ్గరున్న వాటితో నువ్వేమైనా చేయగలవేమో చూడు అని అనుకున్నాడు.

"అలాంటి ఆలోచనలు చేసి చేసి అలసిపోయాను. నువ్వొక్కడివే అలాంటి మంచి తెలివైన సలహాలు ప్రసాదించగలవు" తన కళ్ళు పైకెత్తి బిగ్గరగా అరిచాడు.

చుక్కాని కమ్మెను తన చంకలో పెట్టుకుని పడవను నడుపుతున్న ముసలోడు తన రెండు చేతులను నీళ్ళతో తడుపుకున్నాడు. పడవ ముందుకు సాగింది.

"చివరగా వచ్చిన సొరచేప ఎంత మాంసాన్ని తిందో ఏమో. అంతా దేవుడికే తెలియాలి" అని అన్నాడు.

"కానీ పడవ ఇప్పుడు చాలా తేలికగా కదులుతోంది." ఛిద్రమై పోయిన చేప కింది భాగాన్ని గురించి ఆలోచించటానికి అతడికి మనస్కరించలేదు. చేప దగ్గరున్నప్పుడు సొరచేపలు చేసిన ప్రతి కదలిక మాంసాన్ని కొరికి చీల్చటం మూలంగా జరిగినదే. అవి అలా కొరకటం మూలంగా ఈ చేప మాంసం చిన్న చిన్న ముక్కలుగా పడవ వెనుక వెదజల్లబడి సొరచేపల కోసం సముద్రంలో పరచబడిన ఒక రాజమార్గంలా

తయారయ్యింది.

ఈ చేప ఒక్క దాన్ని తిని ఒక మనిషి చలి కాలమంతా బతకొచ్చు. ఇక ఆ విషయాన్ని మరిచిపో. దాన్ని గురించి ఆలోచించకు అని అనుకున్నాడు. కొంచెం విశ్రాంతి తీసుకో. సొరచేపలు తినగా మిగిలి ఉన్న చేపను సంరక్షించు కోవటానికి నీ చేతుల అవసరం ఎంతైనా ఉంది. అవేమన్నా నీకు సహకరిస్తాయేమో చూడు. వాటికి కూడా కొంచెం విశ్రాంతిని ఇవ్వు. ఇప్పుడు నా చేతుల నుంచి రక్తం వాసన రావటం లేదు. సముద్రమంతా పరుచుకు పోయిన చేప రక్తపు వాసన, నా చేతుల కంటిన నా రక్తపు వాసనకంటే ఘాటుగా ఉంది. అదీకాక మరో కారణం ఇప్పుడు నా చేతుల్లోని రక్తమంతా ఇంకి పోయి ఇంకా కారటానికి ఏమీ మిగల లేదు. అదుగో బొదుగో రక్తం మిగిలి ఉన్న చోట ఇంకా కోసుకు పోలేదు. గాయాల నుంచి ఈ విధంగా రక్తం కారటం మూలంగా ఎడమ చెయ్యి పట్టుకుపోకుండా ఉండొచ్చు.

ఇప్పుడు ఆలోచించటానికి నా దగ్గరేమి మిగిలింది? అతడు అనుకున్నాడు. ఏమీ లేదు. నేనిప్పుడు ఏ విషయం గురించీ ఆలోచించకుండా ఇక రాబోయే సొరచేపల కోసం వేచి చూడాలి. నిజంగా ఇదంతా ఒక కల ఐనట్లయితే ఎంత బాగుండేది అని అతడు అనుకున్నాడు. కానీ ఎవరు ఊహించగలరు? ఒక వేళ ఇదంతా తనకు అనుకూలంగా జరిగి ఉండేదేమో.

తర్వాత వచ్చిన సొరచేప ఒక వాలుగ చేపను పోలి ఉంది. అది అలా ఒక మనిషి తల దూర్చగల వెడల్పాటి పెద్ద నోరున్న పందికి మల్లే అలల మధ్యకు వచ్చింది. అలా వచ్చిన అది చేపను కొరకే దాకా ముసలోడు వేచి చూశాడు.

తర్వాత బరిసెలా తెడ్డుకు కట్టి ఉన్న కత్తిని దాని మెదడు లోపలికంటా పొడిచాడు. అయితే ఆ సొరచేప వెనక్కు మరలిపోయింది. కత్తి పక్కకు జారి పోయింది.

ముసలోడు పడవను నడపటం మీద తన దృష్టి పెట్టాడు. తన కత్తి వేటు నుంచి జారి పోయిన ఆ సొరచేప నెమ్మదిగా నీళ్ళలో మునిగి తప్పించుకు పోవటాన్ని కూడా అతడు గమనించలేదు. సొరచేపలు నీటి పైన ఉన్నప్పుడు అతి పెద్దగా కనబడి నీళ్ళలో మునిగే కొద్దీ అంతకంతకు చిన్నదిగా మారిపోయే దృశ్యం చూస్తే ముసలోడికి సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. కానీ ఇప్పుడు దాని గురించే పట్టించుకోలేదు.

"ఇప్పుడు నా దగ్గర చాప కర్ర కూడా మిగిలి ఉంది" అని అన్నాడు. "కానీ దాని వల్ల పెద్ద ప్రయోజనం లేదు. అదే కాక రెండు తెడ్లు, చుక్కాని ఇంకా మిగిలి ఉన్నాయి. ఇవి నా దగ్గర ఉన్నంత కాలం వాటిని ఎదుర్కొని పోరాడటానికి ప్రయత్నం చేస్తా.

మరొక్క సారి అతడు తన చేతులను నీళ్లలో పెట్టి తడుపుకున్నాడు. ఆ మధ్యాహ్న

సమయాన అతడికి సముద్రం దాని పైనున్న ఆకాశం తప్ప మరేమీ కనిపించలేదు. ఇంతకు ముందు కంటే గాలి మరింత పెరిగింది. త్వరలోనే ఒడ్డుకు చేరుకోగలనని అతడు ఆశించాడు.

"ముసలోడా నువ్వింక బాగా అలసి పోయావు" అని అన్నాడు. "నువ్వు లోలోపల నీరసించిపోయావు."

సూర్యాస్తమయం అయ్యే దాకా సొరచేపలు అతడి దగ్గరకు చేరలేదు. ముసలోడు నీళ్ళలో చేప వెనుకే బూడిద రంగు రెక్కలేసుకుని వస్తున్న వాటిని చూశాడు. వాటికిప్పుడు నీళ్ళలో వాసనను బట్టి చేప జాడను కనుక్కుని రావలసిన అవసరం కూడా లేకుండా పోయింది. పక్క పక్కనే ఈదుకుంటూ వస్తున్న అవి ఎకాఎకి పడవ వైపే దారి తీశాయి.

ముసలోడు కమ్మిని చుక్కానిలోకి గట్టిగా ఇరికించి పడవ వెనుక పడి ఉన్న దుడ్డుగర్రను అందుకున్నాడు. దీన్ని ఇంతకు ముందు విరిగి పోయిన తెడ్డు కర్రలోని పిడి భాగాన్ని కోయించి రెండున్నరడుగుల కర్రగా చేయించాడు. రెండు చేతులతో పట్టుకోవటానికి దీని పిడి అనుకూలం కాదు. అతడు దాన్ని ఒక్క చేత్తోనే పట్టుకున్నాడు. సొరచేపలు రావటం చూసిన అతడు తన కుడి చేత్తో ఈ కర్రను గట్టిగా పట్టుకుని తన చేతిని బిగబట్టి సిద్ధమయ్యాడు. అలా వచ్చిన రెండు కూడా సొరచేపలే.

మొదటిది వచ్చి చేపని చక్కగా పట్టుకున్న తర్వాతే నేను దాన్ని ముక్కు మీదో లేక తల మీద నిట్టనిలువుగానో బాదాలి అనుకున్నాడు.

ఆ రెండు సొరచేపలు కలిసి అతడికి సమీపంలోకి వచ్చాయి. రెంటిలో అతడికి కొంచెం దగ్గరగా ఉన్న సొరచేప దవళ్ళు తెరిచి.. చేప తెల్లటి పక్క భాగాన దాని పళ్ళను గుచ్చింది. ఇక ముసలోడు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తన చేతిలోని దుడ్డు కర్రను బలం కొద్దీ గాలిలోకి పైకి లేపి సరిగ్గా గురి చూసి విశాలంగా ఉన్న ఆ సొరచేప మాడు మీద బాదాడు. దాని తల గట్టిగా జారుడు బండలా ఉండటంతో దాని మీద పడిన కర్ర కిందకు జారింది. అంతే కాదు దాని తలలోపల ఎముక చాలా ధృడంగా ఉన్నట్టుగా కూడా అతడి చేతికి అనిపించింది. ఈ సారి అతడు కర్ర ఎత్తి గట్టిగా దాని ముక్కు కొన దగ్గర కొట్టాడు. ఆ దెబ్బకు అది తన నోట కరుచుకున్న చేపను వదిలేసింది.

దీన్ని కొట్టేంత సేపు రెండో చేప లోపలకు మునుగుతూ పైకి లేస్తూ ఉంది. అది కూడా ఆఖరికి దగ్గరకు వచ్చేసి దాని దవళ్ళను తెరుచుకుని చేపను కొరుకుతోంది. అది ఆబగా చేపను కొరుక్కుని తింటోంది. దాని కొరుకుడికి లోపలికి నోట్లోకి వెళ్ళిన చేప మాంసం జారి దవళ్ళ చివరల నుంచి పీచులు పీచులుగా కారి పోయి బయటకు

వస్తోంది. దాని వైపు తిరిగిన ముసలోడు దాన్ని తల మీద కొట్టాడు. దెబ్బపడటంతో ఆ సొరచేప తలెత్తి అతడి వైపు చూసి తన నోట్లోని మాంసాన్ని కొంచెం వదిలింది. ముసలోడు మరొక్కసారి తన చేతిలోని కర్రను పైకెత్తి లాగి పెట్టి తల మీద మోదాడు. అయితే ఈ సారి ఆ సొరచేప నోట్లో ఉన్న మాంసాన్ని మింగటం కోసం తలెత్తి అటు వైపు తిప్పటంతో దెబ్బ పూర్తిగా తల మధ్య తగలకుండా కర్ర జారి జిగురు జిగురుగా గట్టిగా ఉన్న దాని తల పక్క ఎముక మీద తగిలింది.

"రావే మళ్ళీ ఇటు దగ్గరకు రా" అన్నాడు ముసలోడు.

ఆ సొరచేప దవళ్ళను మూసుకుని వేగంగా మళ్ళీ చేప వైపు వచ్చింది. ముసలోడు ఈ సారి తన శక్తినంతా ఉపయోగించి కర్రను తనకు చేతనైంత పైకి ఎత్తి గట్టిగా కొట్టాడు. ఈ సారి మెదడు కింద ఉన్న ఎముకకు తగిలినట్టు అతడికి అనిపించింది. అదే చోట మరోసారి కొట్టాడు. సొరచేప తన నోటిలో ఉన్న చేప మాంసాన్ని నెమ్మదిగా వదిలి చేపకు దూరంగా నీటి లోపలికి జరిగిపోయింది.

మళ్ళీ అవి తిరిగి పైకి లేస్తాయేమోనని ముసలోడు చూశాడు. కానీ రెంటిలో ఏ ఒక్కటీ కూడా పైకి తేలలేదు.

వాటిని చంపాలనుకోవటం నా ఉద్దేశం కాదు అనుకున్నాడు. వయసులో ఉన్నప్పుడు ఏ మాత్రం ఆలోచించకుండా దొరికిన దాన్ని దొరికినట్టు చంపేసేవాణ్ణి. ఈ రెంటినీ మాత్రం నేను చాలా బాగా గాయపరిచాను. అవి అంత త్వరగా కోలుకోలేవు. ఈ కర్రకు బదులు నా రెండు చేతులతో పట్టుకోవటానికి అనువుగా ఒక బేస్ బాల్ బ్యాట్ ఉండి ఉంటే ఆ దెబ్బలకు మొదటి సొరచేప ఖచ్చితంగా చచ్చి ఉండేది. ఈ వయసులో కూడా ఆ పని చేసి ఉండేవాణ్ణి అని అనుకున్నాడు.

అతడికి తను పట్టిన చేప వైపు కన్నెత్తి చూడటానికి మనస్కరించలేదు. చేప సగం మేర ఛిద్రమై నశించిపోయిందని అతడికి తెలుసు. ఒక పక్క ముసలోడు ఈ సొరచేపలతో జరుగుతున్న పోరాటంలో తలమునకలై ఉండగానే అవతల మరో పక్క సూర్యుడు పడమటి కొండల వెనక్కు చేరాడు.

"త్వరలోనే చీకటి పడబోతుంది" అని అన్నాడు. "అంటే మరి కాసేపట్లో నేను హవానా వెలుగులను చూడబోతున్నాను. నేనే ఇంకొంచెం తూర్పు దిశగా వెళితే కొత్తగా అభివృద్ధి చేసిన సముద్ర తీరాల్లోని దీపపు కాంతులను చూడగలను."

ఇప్పుడు నేనున్న పరిస్థితుల్లో దారి తప్పి ఇంకా ఎక్కువ దూరం పోలేను అని అనుకున్నాడు. నా గురించి ఊళ్ళో ఎవ్వరూ బాధపడి ఉండరని అనుకుంటా. నా గురించి ఎవరు ఆలోచించినా ఆలోచించక పోయినా ఆ పిల్లోడు మాత్రం నన్ను తలుచుకుని

బాధ పడుతూనే ఉంటాడు. కానీ అతడికి నమ్మకం మెండు, నాకా విషయం తెలుసు. ముసలి జాలరుల్లో చాలా మంది నా గురించి బాధ పడుతుండొచ్చు. జాలరులే కాదు ఊళ్ళో ఇతర వృత్తుల్లో ఉన్న చాలా మంది కూడా.. అనుకున్నాడు ముసలోడు. నేనుండే ఊళ్లో చాలా మంచి మనుషులు ఉన్నారు.

చేప బాగా చెడిపోయింది. అందుకే అతడిప్పుడు దానితో ఏమీ మాట్లాడలేక పోయాడు. అసలతను దాని వైపే చూడలేక పోతున్నాడు. ఇంతలోనే అతడి బుర్రలో ఏదో ఆలోచన బయలుదేరింది.

"చేప సగమై పోయింది" అని అన్నాడు. "ఒకప్పుడు నువ్వు చేపవు. నన్ను క్షమించు నేను నా పరిధి మీరాను. దాని వలన మనిద్దరి జీవితాలూ నాశనమయ్యాయి. ఆ మాటకొస్తే నువ్వూ నేనూ ఇద్దరం ఇంతకు ముందు వేరు వేరుగా చాలా సొరచేపలను చంపాం. మరెన్నింటి జీవితాలనో నాశనం చేశాం. నువ్వూ నాలా ముసలిదానివే. నీ జీవితంలో నువ్వు ఎన్నింటిని చంపి ఉంటావు? నీ తల మీద నా దగ్గర ఉండే బరిసె లాంటిది కూడా ఏమీ లేదు."

ఇప్పుడతనికి చేప గురించి ఆలోచించటం అంటే చాలా బాగుంది. ఒక వేళ చేప కనుక బతికుండి సొరచేప దాని మీద దాడి చెయ్యటానికి వచ్చినప్పుడు అది ఏమీ చేసి ఉండేదో, దానిని ఎలా ఎదుర్కొని ఉండేదో అనుకున్నాడు. రంపం కర్రని విరగ్గొట్టి దానిలోని బ్లేడును సొరచేపలతో పోరాడటానికి ఉపయోగించి ఉండాల్సింది తను అనుకున్నాడు. కానీ నా దగ్గర గొడ్డలి గానీ కత్తి గానీ లేవు కదా.

ఒక వేళ ఆ రెంటిలో ఒకటున్నా దాన్ని తెడ్డుకు కడితే చాలా మంచి ఆయుధం తయారయ్యేది. చేపా నేనూ ఇద్దరం కలిసి ఆ సొరచేపలను చంపేవాళ్ళం. అది సరే, ఈ రాత్రి సమయంలో ఒక వేళ అవి మళ్ళీ తిరిగి నీ మీద దాడి చేస్తే ఏంచెయ్యాలి? అసలు నువ్వేం చెయ్యగలవు?

"వాటితో పోరాడతా" తడుముకోకుండా అన్నాడు ముసలోడు. "నా చివరి రక్తపు బొట్టు చిందే దాకా, నాలో ఊపిరున్నంతవరకూ వాటితో పోరాడతాను."

కానీ చుట్టూ ముసురుకున్న చిమ్మ చీకట్లలో, ఏ మాత్రం వెలుతురు లేని ఆ నిశీధి రాత్రిలో, కేవలం రివ్వున వీస్తున్న గాలి, పడవ కదలికకు నీళ్ళు చేసే సవ్వడి మాత్రమే తన ఒంటరి తనానికి తోడుగా ఉన్నాయి. ఇలాంటి స్థితిలో ఉన్న ముసలోడు బహుశా తాను ఇంతకు మునుపే చచ్చి ఉంటానని అనుకున్నాడు. తన అరచేతులు రెంటినీ దగ్గరకు చేర్చి రుద్దుకున్నాడు. అవి చచ్చుపడి పోలేదు. వాటిని గుప్పిట మూసి తెరిచినప్పుడు కలిగిన నొప్పికి అతనికి నరకం కనబడింది. పడవ గోడకు ఆనుకుని అనుకున్నాడు

తానింకా చావలేదని. అతనికి ఈ నిజాన్ని తన అర చేతులే కాదు, వీపు భుజాలు కూడా తెలిపాయి.

తాను చేపను పట్ట గలిగితే అనేక స్తోత్రాలు చెల్లిస్తానని, ప్రార్థనలు చెబుతానని వాగ్దానం చేసిన సంగతి అతడికి గుర్తు వచ్చింది. కానీ నేను చాలా అలసిపోయాను. అవన్నీ ఇప్పుడు చెప్పలేని స్థితిలో ఉన్నానని అనుకున్నాడు. గోతాం పట్టా తీసుకుని భుజాల నిండా కప్పుకోవటం మంచిదని అనుకున్నాడు. అతడు పడవ బల్ల మీద పడుకుని ఆకాశంలో ప్రత్యక్షమయ్యే వెలుగుల కోసం వేచి చూస్తున్నాడు. ఈ వెలుగుల్లో సగానికి సగం మేర చూడటంలో నేను సఫలీకృతుడనయినట్టే అని అనుకున్నాడు. మిగిలిన సగం వెలుగును కూడా చూడగలిగే అదృష్టం బహుశా నాకు కలుగుతుందేమో. తప్పకుండా నాకు కొంత అదృష్టం అవసరం ఉంది. లేదు, నాకంత అవసరం లేదు, అని అన్నాడు. నీ శక్తిని మించి సముద్రంలోకి మరీ ఎక్కువ దూరం పోయి నీకు పట్టబోయే అదృష్టాన్ని నువ్వే నీ చేజేతులా త్రోసిరాజన్నావు.

"మరీ చిన్నపిల్లల్లా, అమాయకంగా ఆలోచించకు" అని పెద్దగా అన్నాడు. "నిద్ర పోకుండా ధ్యాస పడవ నడపటం మీద నిలుపు. ఎవరికి తెలుసు నీకు అదృష్టం దురదృష్టంలా పట్టబోతుందేమో."

"అదృష్టాన్ని అమ్మే వాళ్ళు ఎక్కడన్నా ఉంటే వాళ్ళ దగ్గర నుంచి నేను కొంచెం కొనుక్కుంటా" అతడు నిరాశగా అన్నాడు.

ఏంపెట్టి నేను దాన్ని కొనగలను? తనకు తాను ప్రశ్నించుకున్నాడు. పోయిన నా బరిసెతోనో లేక విరిగిపోయిన నా కత్తితోనో అదీ కాకుంటే పాడై పనికి రాకుండా తయారైన నా చేతులనిచ్చో కొనగలిగే వాణ్ణా?

"ఏమో వాటితో కొనగలిగే వాడినేమో" అతడు అన్నాడు. "ఆ అదృష్టాన్ని ఆశించే కదా నువ్వు ఎనభై నాలుగు రోజులు సముద్రంలో బ్రతికావు. తృటిలో తప్పి పోయింది కానీ, అదృష్టం నీ సొంతమై ఉండాల్సింది."

"నేను మరీ చెత్త చెత్తగా ఆలోచిస్తున్నాను. ఆపెయ్యాలి. అదృష్టం అనేది అనేక రూపాల్లో బయట పడుతుంది. దాన్ని గుర్తించ గలిగిన వారెవ్వరు? అది ఏ రూపంలో ఉన్నా నాకు ఫర్లేదు. కానీ అది నాకు కొంచెం కావాలి. దానికి బదులుగా నేను ఏదైనా చెల్లిస్తాను. ఆ వెలుగులను దీపపు కాంతుల్లో చూడాలనేది నా కాంక్ష. నేను చాలా కావాలనుకుంటాను. ప్రస్తుతానికి నా కోరిక మాత్రం ఇదొక్కటే. మరింత సౌకర్యవంతంగా కూర్చుని పడవను నడపాలని" అనుకున్నాడు. కొద్దిపాటి కదలికకే పుట్టిన నొప్పిని బట్టి తానింకా చావలేదనే విషయం జ్ఞప్తికి వచ్చింది.

అప్పుడు సమయం రాత్రి పది గంటలయ్యుండొచ్చు. నగరంలోని కాంతి దీపాలు మిణుకు మిణుకుమని మెరుస్తూ కనబడుతున్నాయి. వెన్నెల రాక ముందు ఇంకా పగటి వెలుతురు ఉండటం చేత అప్పటికి కొద్ది సేపటి ముందు దాకా ఆ దీప కాంతులు లీలగా కనిపించాయి. అంతకంతకు గాలి పెరుగుతుండటంతో సముద్రం కొంచెం అల్లకల్లోలంగా మారింది. ఆ సముద్రం మీదుగా నగరంలోకి చూస్తున్న ముసలోడికి కాంతి దీపాలు స్పష్టంగా కనబడుతున్నాయి. నీటిలో పడుతున్న ఆ కాంతుల నీడలోకి తన పడవను నడుపుతున్నాడు. ఇంకా కాసేపట్లో తాను ఒడ్డుకు చేరబోతున్నానని అనుకున్నాడు.

ఇంకా ఈ నా ప్రయాణం ముగిసినట్టే అని అతను అనుకున్నాడు. ఇవి మళ్ళీ నా మీద దాడి చెయ్యొచ్చు. చిమ్మ చీకట్లో నిరాయుధుడైన మనిషి వాటికి వ్యతిరేకంగా ఏమి చెయ్యగలడు?

అతని కండరాలు బిగుసుకు పోయాయి. అతని శరీరం చాలా బాధిస్తోంది. ఆ రాత్రి సమయంలో వీస్తున్న చల్లటి గాలుల తాకిడికి అతని శరీరం లోని గాయాలు మరి ఇతర దెబ్బలు అమితంగా బాధిస్తున్నాయి. నాకు మళ్ళీ వాటితో పోరాడాల్సిన అవసరం రాదనే ఆశిస్తున్నాను అని అనుకున్నాడు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలని గంపెడాశతో మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

అయితే అతడి ఆశలకు వ్యతిరేకంగా అర్ధరాత్రికల్లా మళ్ళీ పోరాడాల్సిన అవసరమొచ్చి పడింది. ఈసారి తన పోరాటం నిరుపయోగమవుతుందనే నిజం అతడికి తెలుసు. ఈసారి అవి గుంపులు గుంపులుగా వచ్చి పడ్డాయి. కేవలం అతడు నీటిలో ఒక దాని వెనుక ఒకటి వరసలో ఉన్న వాటి రెక్కలను వాటి పై నున్న పొట్టు మెరుపులను మాత్రమే చూడగలుగుతున్నాడు. అవన్నీ అమాంతంగా వచ్చి పడి చేప మీద దాడికి దిగాయి. ముసలోడు వాటి మీద ఎదురు దాడికి దిగాడు. వాటి గూబలదిరేలా మోదాడు. ఆ దెబ్బలకు వాటి దవళ్ళు కదిలిపోయాయి. పడవ కిందగా చేపను నోట కరుచుకుని ఉన్న సొరచేపలు ఆ దెబ్బలకు కకావికలమవటం వలన పడవ ఊగిపోతోంది. ఆ చీకట్లో అతడు కేవలం చూచాయగా కనబడుతున్న వాటి కదలికలను, ఆ కదలికల మూలంగా వినవచ్చే శబ్దాలను బట్టి ఎడాపెడా ఆపకుండా బాదాడు. ఇంతలో తన చేతిలోని కర్రను ఏదో పట్టి లాగినట్టు అతడికి అనిపించింది. కిందికి వంచిన చేతులు పైకి లేపేలోపే అతడి చేతుల్లోని కర్ర జారిపోయింది.

అతడు వెంటనే చుక్కానిని ఊడబెరికి దాన్ని తన రెండు చేతులతో పట్టుకుని తనకు శోష వచ్చేలా తన ఓపిక కొద్దీ ఆ గుంపును బాదటం మొదలెట్టాడు. అవి మాత్రం

వాటి దాడిని తీవ్రతరం చేశాయి. అవి పడవ ముందు వైపుకు ఒకొక్కటిగా, గుంపుగా వచ్చి చేప మీదకు ఎగబాకి దాని మాంసాన్ని తునా తునకలుగా చీల్చి లాక్కెళుతున్నాయి. అలా లాక్కెళ్ళిన మాంసం నీళ్ళ కింద మరో పొరలా మెరుస్తుంది.

చివరగా చేప తల వైపుకు వచ్చిన ఒక సొరచేప కనబడింది. చూసిన వెంటనే ముసలోడు అనుకున్నాడు దానికి చావు మూడిందని. అది నోరంతా తెరచి చేప తలను దాని నోటినిండా కుక్కుకుంది. చేప తల పెద్ద బండరాయి పరిమాణంలో ఉంది. దాన్ని నోటి నిండా కుక్కుకున్న సొరచేప తన దవళ్ళను క్రిందకు పైకి కదపలేని స్థితిలో ఉండి దానితో కుస్తీ పడుతోంది. ఇదే అదనుగా తలచిన ముసలోడు తన చేతిలోని చుక్కానిని సరిగ్గా దాని నెత్తి మీద విసిరాడు. ఆ విధంగా ముసలోడు మూడు నాలుగు సార్లు చుక్కానితో దాని తలను బద్దలు కొట్టాడు. ఇంతలో తన చేతిలో ఉన్న చుక్కాని విరిగిన శబ్దం వచ్చింది. సగం విరిగిన మొనలా తేలి తన చేతిలో మిగిలిన ముక్కతో దాన్ని పొడవటం మొదలు పెట్టాడు. అది సొరచేప ఒంట్లోకి వెళ్ళి గుచ్చుకుంటుందని అతడికి అనిపించింది. ఇక ఆపకుండా పొడవటం మొదలెట్టాడు. ఆ పొడుపులకు తాళలేని సొరచేప పారిపోయింది. గుంపుగా వచ్చిన సొరచేపల్లో ఇది చిట్ట చివరిది. వాటికి ఇంకా అక్కడ ఎక్కువ సేపు ఉండే అవసరం లేదు. తినటానికి అక్కడేమీ మిగల్లేదు.

ఆయాసంతో ముసలోడు ఊపిరి కూడా సరిగ్గా తీసుకునే స్థితిలో లేడు. నోరు ఎండిపోయి నాలుక పిడచకట్టుకుపోయింది. నోరంతా ఎర్రెర్రగా తియ్య తియ్యగా మారిపోతోంది. ఒక్క క్షణం అతడికి భయమేసింది. కొద్ది సేపట్లో ఆ రుచి తగ్గిపోయింది.

ముసలోడు తన నోట్లోని ఉమ్మిని సముద్రంలోకి ఉమ్మాడు. "రాక్షసి సొరచేపల్లారా. దాన్ని తినండి. దాన్ని తిని ఒక మనిషిని చంపి తిన్నట్టు ఊహించుకొండి" అన్నాడు. ఏమైతేనేం చివరికి తనకు ఓటమి తప్పలేదు. పైగా ఇప్పుడు ప్రతీకారం కూడా తీర్చుకోలేని స్థితి తనది అనుకుంటూ పడవ ముందుకు వెళ్ళి విరిగి కింద పడి ఉన్న చుక్కాని మీటను అందుకుని చుక్కాని రంధ్రంలోకి పెట్టి చూశాడు. పనికొస్తుంది. తను ఒడ్డుకు చేరుకోటానికి ఆ మాత్రం చాలు. గోతాం పట్టాను అందుకుని తన భుజాల చుట్టూ కప్పుకుని పడవను నడపటం మొదలు పెట్టాడు. అతడిప్పుడు పడవను నెమ్మదిగా నడుపుతున్నాడు. నిర్వికారంగా, నిర్విచారంగా ఉన్నాడు. తన పడవ ప్రయాణంలోని అన్ని సంఘటనలను ఎదుర్కొన్నాడు. అన్ని దశలను దాటాడు. తన ఈ ప్రయాణంలో చివరి మజిలీ తన ఇల్లు. తన ఇల్లు చేరే ప్రయత్నంలో ఉన్న ముసలోడు తనకు చేతనయినంత జాగ్రత్తగా, తెలివిగా పడవను నడుపుతున్నాడు. భోజనపు బల్ల కింద పడిన రొట్టె పలుకులను ఏరుకు తినే అభ్యాగతులకు మల్లే ఆ రాత్రి కొన్ని సొరచేపలు

పడవకు వేలాడుతున్న చేప కళేబరాన్ని కబళించటానికి వచ్చాయి. ముసలోడు వాటిని అసలు పట్టించుకోలేదు. అతని ధ్యాసంతా పడవ నడపటం మీద తప్పించి వేరే దేని గురించి పట్టించుకోలేదు. తన చేపను సొరచేపలు తినేశాక బరువు తగ్గిన పడవ ఇప్పుడు చాలా తేలికగా, నిమ్మళంగా నడవటం గమనించాడు.

ఆ చేప చాలా మంచిది అని అనుకున్నాడు. అది చాలా తెలివి గలిగిందే కాక నాకు ఎలాంటి హానీ తల పెట్టలేదు. చుక్కాని విరగటం తప్పించి. అది పోతే మరో దాన్ని తెచ్చుకోవచ్చు. అది పెద్ద విశేషం కాదు. తానిప్పుడు సముద్ర ప్రవాహంలో ఉన్నట్టు అతడికి అనిపిస్తోంది. సముద్ర తీరం వెంబడి మెరుస్తూ ఉన్న దీపాలను కూడా అతడు చూడగలుగుతున్నాడు. తనిప్పుడు ఎక్కడున్నాడో అతడికి తెలుసు. ఆ విషయం తెలిసి ఉన్నంత మాత్రం చేత అతడు తన ఇంటికి పోలేడు.

ఏమైతేనేం, గాలి మాత్రం మన ప్రియ మిత్రుడు అనుకున్నాడు ముసలోడు. కొన్నిసార్లు.. అన్నాడు తర్వాత. సముద్రానికి మాత్రం ఆ తేడా లేదు. మన శత్రువులైనా మిత్రులయినా దానికి అందరూ సమానమే. మంచం కూడా.. అతను అనుకున్నాడు. మంచం కూడా నా స్నేహితుడే. కేవలం మంచం మాత్రమే అని అనుకున్నాడు. మంచం అనేది అన్నింట్లోకి గొప్ప వస్తువు. నువ్వు ఓడిపోయి పడున్నప్పుడు ఈ నిజం ఇంకా బాగా తెలుస్తుంది. ఓటమి ఎంత తేలికగా లభిస్తుందో నాకు ఇంతకు ముందు తెలియదు. చాలా గొప్ప ఓటమి అని అనుకున్నాడు.

"అలాంటిదేమీ లేదు" అతడు పెద్దగా అరిచాడు. "నేను మరీ చాలా దూరం వెళ్లా."

అతడు ఆ చిన్న ఓడ రేవులోకి ప్రవేశించినప్పుడు దీపాలన్నీ ఆరిపోయి ఉన్నాయి. అతడికి తెలుసు ఆ సమయంలో అందరూ నిద్రిస్తూ ఉంటారని. గాలి బాగా పైకి లేచి విసరి కొడుతోంది. అక్కడంతా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కంకరతో అక్కడక్కడ మాసికలు వేసి ఉన్న రాళ్ళ దగ్గరకు పడవను నడిపాడు. అతడికి సాయం చేయటానికి అక్కడెవరూ లేరు. అతనే ఎలాగోలా తిప్పలు పడుతూ పడవను పైకి ఒడ్డుకు లాక్కున్నాడు. తర్వాత పడవ దిగిన అతడు దాన్ని ఒక పెద్ద రాయి కేసి గట్టిగా కట్టాడు.

తర్వాత అతడు పడవ స్తంభాన్ని కిందకు దించి దానితో పాటు ఉన్న తెర చాపను తీసి మడత పెట్టి దానికి గట్టిగా కట్టాడు. తర్వాత ఆ స్తంభాన్ని తన భుజం మీద వేసుకుని మెరక ఎక్కటం మొదలుపెట్టాడు. తనెంత విపరీతంగా అలసి పోయాడో అతడికి ఇప్పుడు అర్థమయ్యింది. అతడు ఒక్క క్షణం ఆగి వెనక్కు తిరిగి చూశాడు. వీధి దీపాల కాంతిలో తన పడవ వెనుక ఠీవిగా నిలబడి ఉన్న చేప తాలూకు బ్రహ్మాండమైన తోకను చూశాడు. దానికి కొంచెం కింద తెల్లగా మెరుస్తున్న దాని వెన్నెముక, నల్లటి

దాని పెద్ద తల, దాని మీద కొమ్ములా పొడుచుకొచ్చినట్టున్న ఒక ఎముక.. వాటన్నిటి మధ్య ఖాళీ. ముసలోడు తేరిపార చూశాడు.

గుట్ట ఎక్కటం మళ్ళీ కొనసాగించాడు. ఎక్కుతూ ఎక్కుతూ పైన కాళ్ళు జారి పడ్డాడు. తన భుజానున్న స్తంభంతో అలానే కొంచెం సేపు పడిన చోట పడుకున్నాడు. పైకి లేవటానికి ప్రయత్నించాడు. కానీ పూర్తిగా పైకి లేచి నిలబడలేని స్థితిలో ఉన్నాడు. అలానే పడిన చోటే లేచి కూర్చోగలిగాడు. ఆ స్తంభం అతడి భుజాన అలానే ఉంది. కూర్చుని అతడు వీధి వైపు తేరిపార చూశాడు. తన పనిలో నిమగ్నమై ఉన్న ఒక పిల్లి వీధికి అవతల పక్క వడివడిగా వెళుతుండటం ముసలోడు గమనించాడు. అతనలా వీధి వైపు చూస్తూ ఉండిపోయాడు.

ఆఖరికి ముసలోడు ఎలాగోలా తన భుజానున్న స్తంభాన్ని కింద పెట్టి పైకి లేచి నిలబడ గలిగాడు. కిందున్న స్తంభాన్ని మళ్ళీ భుజానేసుకుని వీధిలో నడవటం మొదలు పెట్టాడు. ఇలా తను తన గుడిసె చేరేలోగా దారిలో మధ్య మధ్య ఐదు సార్లు కొంచెం కొంచెం సేపు కూర్చోవలసి వచ్చింది. తన గుడిసె చేరిన అతడు భుజానున్న స్తంభాన్ని దించి గోడకు ఆనించాడు. ఆ చీకటిలో నీళ్ళ సీసా వెదికి పట్టుకుని ఒక గుక్కెడు నీళ్ళు గొంతులో పోసుకున్నాడు. తర్వాత మంచం మీద కూలబడ్డాడు. తల దగ్గరున్న దుప్పటిని లాక్కుని భుజాల మీదుగా కాళ్ళ దాకా కప్పుకుని వార్తా పత్రికల మీద తన ముఖాన్ని కిందకు వంచి, తన బాహువులను బారుగా చాపి అరచేతులను పైకి పెట్టి అతను బోర్లా పడుకున్నాడు.

పొద్దున్నే పిల్లోడు వచ్చి వాకిట్లో నుంచి లోపలికి చూసినప్పుడు ముసలోడు ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. విపరీతంగా వీస్తున్న గాలికి భయపడి చిన్న చిన్న పడవలు సముద్రంలోకి వేటకు వెళ్ళటం లేదు. పిల్లోడు అంతకు ముందు రాత్రి ఆలస్యంగా పడుకున్నాడు. అలవాటుగా ప్రతి రోజూ వచ్చే విధంగానే ఆ ఉదయం కూడా పిల్లోడు ముసలోడి గుడిసె దగ్గరకు వచ్చాడు. ముసలోడు ఇంకా ఊపిరి తీసుకోవటం పిల్లోడు గమనించాడు. దగ్గరకెళ్ళి అతని చేతులను చూసిన పిల్లోడు బోరున ఏడవటం మొదలెట్టాడు. ముసలోడ్ని ఆ పరిస్థితిలో చూసిన పిల్లోడు అతడు లేవక ముందే కొంచెం కాఫీ తీసుకుని రావటం కోసం బయటకు వచ్చాడు. ఇక దారి పొడవునా పిల్లోడు ఏడుస్తూనే ఉన్నాడు.

ముసలోడి పడవ చుట్టూ గుమి గూడిన జాలరులు చాలా మంది అతడి పడవ పక్కన కట్టిన చేపను చూస్తున్నారు. వారిలో ఒకడు తన షరాయిని పైకి మడుచుకుని నీటిలోకి దిగి టేపు తీసుకుని ఆ చేప కళేబరం ఒడ్డూ పొడుగు కొలుస్తున్నాడు.

అయితే పిల్లోడు కిందకు వెళ్ళలేదు. అతడు ఇంతకు ముందే పడివున్న చోటికి వెళ్ళి చూసి దానికి కాపలాగా ఒక జాలరిని పురమాయించి వచ్చాడు.

జాలరుల్లో ఒకడు అరిచాడు, "ముసలోడు ఎలా ఉన్నాడు?"

"నిద్ర పోతున్నాడు" పిల్లోడు బదులిచ్చాడు. తాను ఏడవటం మిగతా వాళ్ళు చూస్తున్నారనే విషయాన్ని కూడా పట్టించుకోలేదు పిల్లోడు. "అతడ్ని ఎవ్వరూ లేపొద్దు" అన్నాడు.

చేప కళేబరాన్ని కొలుస్తున్న జాలరి అరచి చెప్పాడు, "ముక్కు దగ్గర నుంచి తోక దాకా దీని పొడవు పద్దెనిమిది అడుగులు."

"నాకు తెలుసు అంత ఉండొచ్చు" పిల్లోడు బదులిచ్చాడు.

రేవు ఒడ్డుకు చేరుకున్న పిల్లోడు ఒక క్యాను కాఫీ ఇవ్వమని అడిగాడు.

"వేడివేడిగా చిక్కటి పాలతో చేసి బాగా తియ్యగా పంచదార కలిపి ఇవ్వు."

"దానితోపాటు ఇంకేమన్నా కావాలా?"

"ఇప్పుడేమీ వద్దు. తర్వాత చూద్దాం. అతడింకేమన్నా తినగలడేమో."

ఆ దుకాణం యజమాని అన్నాడు "ఆహా ఏమి చేపది. అలాంటి చేపను నేను ఇంతకు ముందు ఎప్పుడూ చూడలేదు. నిన్న నువ్వు పట్టుకొచ్చిన రెండు చేపలు కూడా మంచివే."

"పనికి మాలిన చేపలు" అని పిల్లోడు మళ్ళీ ఏడ్వటం మొదలుపెట్టాడు.

దుకాణదారుడు అడిగాడు "ఏదన్నా తాగుతావా?"

"వద్దు" పిల్లోడు అన్నాడు. "సాంటియాగోను ఇబ్బంది పెట్టొద్దని వారికి చెప్పండి. నేను ఇప్పుడే వస్తాను."

"అతడి పరిస్థితి చూసి నేను ఎంత బాధ పడుతున్నానో అతనికి చెప్పు"

"అలాగే. తప్పకుండా చెప్తా" పిల్లోడు చెప్పాడు.

పిల్లోడు వేడి వేడిగా ఉన్న కాఫీ డబ్బాను తీసుకుని ముసలోడి గుడిసె వైపు అడుగులు వేశాడు. లోపలికి వెళ్ళి ముసలోడు నిద్ర మేల్కొనే దాకా అతడి పక్కనే కూర్చున్నాడు. అతను లేవబోతున్నట్టుగా పిల్లోడికి ఒకసారి అనిపించింది. కానీ ముసలోడు అటు తిరిగి ఒత్తిగిలి మళ్ళీ గాఢ నిద్రలోకి జారుకున్నాడు. ఈ లోపు కాఫీ కొంచెం వేడి తగ్గింది. మళ్ళీ దానిని పొయ్యి మీద పెట్టి వేడి చెయ్యటానికి అవసరమైన కట్టెలో చెక్కో ఎవరి దగ్గరన్నా చేబదులుగా తీసుకురావటానికి పిల్లోడు గుడిసె ఎదురుగా ఉన్న రోడ్డు దాటి వెళ్ళాడు.

కొంచెం సేపటి తర్వాత ముసలోడు లేచాడు.

"పడుకునే ఉండు. లేవద్దు" లేవబోతున్న ముసలోడిని పిల్లోడు వారించాడు. "ఈ కాఫీ తాగు" కొంచెం కాఫీని డబ్బాలో నుంచి గ్లాసులోకి పోస్తూ అన్నాడు.

ముసలోడు పిల్లోడి చేతిలో నుంచి కాఫీ గ్లాసుని అందుకుని తాగాడు.

"మనోలిన్.. అవి నన్ను చితకబాదాయి. నిజంగా బాదేశాయి."

"అవి నిన్నేం చేయలేదు. చేప అసలు నిన్ను కొట్టనే లేదు."

"లేదు. నిజంగా కొట్టాయి. చివరిలో జరిగింది ఇదంతా."

"పడవని, మిగతా సామానంతటినీ పెడ్రికో భద్రంగా చూస్తున్నాడు. సరే, చేప తల గురించి ఏమిటి?"

"చేపల కొట్టంలోకి పనికొస్తుంది కదా. పెడ్రికోని కోసుకుని తీసుకెళ్ళమను."

"మరి బల్లెం సంగతో?"

"నీకు అవసరమనుకుంటే దాన్ని నువ్వు ఉంచుకో."

"నాకు కావాలి" పిల్లోడు చెప్పాడు. "ఇక పోతే మనం మిగిలిన విషయాల గురించి మాట్లాడుకుందాం."

"వాళ్ళు నా కోసం వెదికారా?"

"అవును. కోస్టు గార్డులుతో సహా విమానాల్లో వచ్చి మరీ వెదికారు."

"సముద్రం చాలా పెద్దది విశాలమైంది. అయితే దానిలో తిరిగే పడవ చాలా చిన్నది. బయటి నుంచి చూస్తే సరిగ్గా కనబడను కూడా కనబడదు" ముసలోడు అన్నాడు. సముద్రంలో ఉన్నప్పుడు తనతో తానో లేక కొన్ని సార్లు సముద్రంలోని నీళ్ళతోనో మాట్లాడ వలసి వచ్చేది. కానీ మాట్లాడటానికి తనకు తోడుగా మరొకరు ఉండటం అతనికి చాలా బాగున్నట్టు అనిపించింది. "ఇన్నాళ్ళు నువ్వు నాతో లేక పోవటంతో వెలితిగా తోచేది" అన్నాడు ముసలోడు. "ఇంతకీ నువ్వు ఏమేం పట్టావేం?"

"మొదటి రోజు ఒకటి. రెండో రోజు కూడా ఒకటే. మూడో రోజు మాత్రం రెండు." చెప్పాడు పిల్లోడు.

"చాలా మంచిది."

"ఇప్పుడు మనిద్దరం కలసి చేపలు పడదాం" అన్నాడు పిల్లోడు.

"వద్దు వద్దు. నాకంత అదృష్టం లేదు. అదృష్టం నన్నింకే మాత్రం వరించదు."

"అదృష్టమా గిదృష్టమా. అయినా నాతో పాటు నీకు కావలసిన అదృష్టాన్ని తీసుకొచ్చే పూచీ నాది" అన్నాడు పిల్లోడు.

"మీ వాళ్ళు ఏమన్నా అంటారేమో?"

"వాళ్ళేమనుకుంటారనేది నాకు అనవసరం. నేను నిన్న రెంటిని పట్టాను. మనిద్దరం

కలసి చేపలు పట్టాల్సిందే. నీ నుండి నేను నేర్చుకోవలసింది చాలా ఉంది."

"మనం మాత్రం చేపలను తేలికగా చంపేందుకు ఒక మంచి బరిసెను సంపాదించి దాన్ని ఎప్పుడూ మనతో పాటే పడవ మీద ఉంచుకోవాలి. పాత ఫోర్డ్ కారు చక్రంలోని ఆకు నుంచి బ్లేడును తయారు చేసుకోవచ్చు. చక్కగా సాన పెట్టించొచ్చు. బాగా మొనదేలి పదునుగా ఉండాలి. మరీ పెళుసుగా ఉంటే విరిగిపోద్ది. నా కత్తి కూడా అలాగే విరిగింది.''

"మరేం పర్లేదు. నేను ఇంకొక కత్తి సంపాదిస్తాను. దానికి మంచి సాన పెట్టిద్దాం."

"ఈ గాలి ఇంకా ఎన్ని రోజులు ఉంటుంది?" అని అడిగాడు పిల్లోడు.

"బహుశా మరో మూడు రోజులో ఇంకా ఎక్కువో ఉండొచ్చు."

"నేను అన్నింటినీ చక్క బెడతాను. నువ్వు నీ చేతులు బాగయ్యేలా జాగ్రత్త తీసుకోవాలు. మిగతా విషయాలు నాకు వదిలెయ్ ముసలోడా" పిల్లోడు అతనికి చెప్పాడు.

"నా గురించి శ్రద్ధ తీసుకోవటం నాకు తెలుసు. రాత్రి విచిత్రమైన వస్తువేదో ఒకటి ఊశాను. నా ఛాతీలో ఏదో విరిగినట్లు అనిపించింది."

"దాని నుంచి కూడా కోలుకో" పిల్లోడు చెప్పాడు. "ముసలోడా నువ్వు పడుకో నీకు మంచి చొక్కా ఒకటి తీసుకొస్తాను. పనిలో పనిగా తింటానికి కూడా ఏమన్నా తీసుకొస్తా."

"నేను చేపలు పట్టటానికి సముద్రంలోకి వెళ్ళినప్పటి పత్రికలు ఏమన్నా దొరికితే పట్టుకురా" ముసలోడు పిల్లోడితో అన్నాడు.

"నువ్వు తొందరగా కోలుకో. నేను నీ దగ్గర నుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది. అదంతా నువ్వు నాకు నేర్పాలి. నువ్వెంత బాధపడ్డావ్?"

"చాలా" అన్నాడు ముసలోడు.

"నీ కోసం తినటానికి తిండి చదువుకోవటానికి పత్రికలు తీసుకొస్తా. చక్కగా విశ్రాంతి తీసుకో ముసలోడా. నీ చేతి గాయాలకు దగ్గరలోని మందుల దుకాణం నుండి మందులు తీసుకొస్తాను" పిల్లోడు చెప్పాడు.

"పెడ్రికోకు చెప్పటం మరవకు. తల అతడిదే."

"గుర్తు పెట్టుకుని మరీ చెప్తా."

తలుపు తెరుచుకుని పిల్లోడు బయటకు వెళ్ళి కంకర రోడ్డు ఎక్కగానే మళ్ళీ ఏడుపు మొదలుపెట్టాడు.

ఆ రోజు మధ్యాహ్నం ఆరు బయట సముద్రం ఒడ్డున కొంత మంది యాత్రికులు విందు చేసుకున్నారు. ఆ దారంట వెళుతున్న ఒకావిడ అక్కడ నీళ్ళలో కింద పడేసిన ఖాళీ బీరు సీసాల మధ్య, సగం తిని తినక మిగిలిపోయి, చచ్చి పడి ఉన్న బారు చేపల

మధ్య పడి ఉన్న ఒక పొడవాటి తెల్లని వెన్నెముక, దాని చివరన ఒక పెద్ద తోక, అలలకు కొట్టుకుంటూ రావటం చూసింది. ఇది తూర్పు నుంచి వీచిన పెద్ద గాలికి నిదానంగా నౌకాశ్రయానికి వెళ్ళే దారిలోకి కొట్టుకొచ్చింది.

అలా కొట్టుకొచ్చి అక్కడ చెత్త కుప్పలోకి చేరిన పెద్ద చేప వెన్నెముకను చూపించి అక్కడ పని చేసే ఒక వెయిటర్‌ను ఆమె అడిగింది "ఏమిటి ఇది?" అని.

"టిబ్యూరన్" వెయిటర్ బదులిచ్చాడు. "సొరచేప" అని ఇంకా ఏమి జరిగిందో అది అక్కడకు ఎలా చేరిందో వివరించబోయాడు.

"అరే సొరచేపలకు ఇంత అందమైన చూడ ముచ్చటైన తోకలు ఉంటాయని ఇంతవరకు నాకు తెలియదే" అంది ఆమె.

"నాకూ తెలియదు" ఆమెతో పాటుగా వస్తున్న అతను అన్నాడు.

రోడ్డుకు దగ్గరలో తన గుడిసెలో ముసలోడు మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు. అతను బొక్క బోర్లా పడుకుని ఇంకా నిద్ర పోతూనే ఉన్నాడు. అతడి పక్కన కూర్చున్న పిల్లోడు పడుకుని నిద్ర పోతున్న అతన్నే తదేకంగా చూస్తున్నాడు. ముసలోడు మాత్రం హాయిగా సింహాల గురించిన కలల్లో మునిగి తేలుతున్నాడు.

అయిపోయింది